# KONDAREDLA MOUKHIKA SAHITYAM

## BHASHAA SAAMAAJIKA PARISHIILANA

The thesis submitted to the University of Hyderabad

in partial fulfillment of the degree of

**Doctor of Philosophy**

**in**

**TELUGU**

**by**

**SREENU KETHAVATH**

**Reg No.09HTPH12**

**DEPARTMENT OF TELUGU**

**School of Humanities**

**University of Hyderabad**

**Prof.C.R.RAO ROAD**

**Hyderabad**

**TELANGANA – 500 046.**

**DECEMBER-2014**

# కొండరెడ్ల మౌఖిక సాహిత్యం – భాషాసామాజిక పరిశీలన

పిహెచ్.డి.  పట్టాకోసం

హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన

సిద్ధాంత గ్రంథం


పరిశోధన

**శ్రీను కేతావత్**

**Reg No.09HTPH12**

పర్యవేక్షణ

డా॥డి.విజయలక్ష్మి

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు

తెలంగాణ – 500 046


డిసెంబర్ - 2014

# CERTIFICATE

This is to certify that the dissertation entitled "KONDAREDLA MOUKHIKA SAAHITYAM - BHAASHAA SAAMAAJIKA PARISHIILANA" submitted by **Mr. Sreenu Kethavath** bearing Reg. No. **09HTPH12** in partial fulfillment of the requirements for the award of Doctor of Philosophy in Telugu is a bona fide work carried out by him under my supervision and guidance which is a plagiarism free thesis.

This dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

DATE: 11-12-2014

(D. VIJAYALAKSHMI)

Research Supervisor

Head

Department of Telugu

Dean

School of Humanities

# DECLARATION

I, Sreenu Kethavath Reg.No.09HTPH12 hereby declare that this dissertation entitled "KONDAREDLA MOUKHIKA SAHITYAM - BHASAHA SAMAJIKA PARISHILANA" submitted by me under the guidance and supervision of Dr.D.Vijayalakshmi is a bona fide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga / INFLIBNET.

Signature of the Student

(SREENU KETHAVATH)

Date: 11.12.2014. Reg. No.09HTPH12

# కృతజ్ఞతలు

కొండరెడ్ల మౌఖికసాహిత్యం – భాషాసామాజిక పరిశీలన అనే అంశంపై పిహెచ్.డి. చేసుకొనడానికి అనుమతినిచ్చిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం అధికారులకి, ఎంతో ఆదరణతో దిశానిర్దేశం చేస్తూ ప్రోత్సహించే తెలుగుశాఖ అద్యక్షులు ఆచార్య.ఎస్.శరత్ జ్యోత్స్నరాణి గారికి....

పరిశోధన అంటే ఏమిటో తెలియజేసి పరిశోధనపట్ల నిబద్దతను, ఆసక్తిని కలిగించడమే కాకుండా క్షేత్ర పర్యటనలోని మెలకువలను, సామాగ్రి సేకరణలోని సూక్ష్మతను అనేక రీతులుగా నేర్పి, ఏ సమయంలో వెళ్లి సందేహ నివృతికోరినా విశదంగా మౌఖికసాహిత్య అధ్యయన రీతులను, పరిశోధనా పద్ధతులను వివరించి, సలహాలను, సూచనలను అందించి మౌఖికసాహిత్య పరిశీలనపై ఆసక్తిని, జిజ్ఞాసను కలిగించిన పర్యవేక్షకులు డా.డి.విజయలక్ష్మిగారికి.....

వెళ్లి అడిగినపుదల్లా పరిశోధనకు సంబంధించిన ప్రగతిని అడుగుతూ నన్ను ప్రోత్సహించిన డాక్టరల్ కమిటీ మెంబర్లు ఆచార్యతుమ్మల రామకృష్ణ, డా.పమ్మిపవన్ కుమార్ గార్లకు, ఆత్మీయంగా ఆదరించే తెలుగుశాఖలోని అధ్యాపకులు ఆచార్యఆర్.వి.రామకృష్ణశాస్త్రి, ఆచార్యజి.అరుణకుమారి, డా.పిల్లలమర్రి

రాములు, డా.దార్ల వెంకటేశ్వరరావు, డా.బి.భుజంగరెడ్డి, డా.దాసరి విజయకుమారిగార్లకు...

కొండరెడ్ల గురించి ప్రాధమిక విశేషాలను తెలుసుకోవడానికి సహకరించిన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ వారికి, ప్రత్యేకించి డా.వాడ్రేవు చినవీరభద్రుడు గార్కి, కొండరెడ్ల గురించి ప్రాధమిక అవగాహన కల్పించి వారు రచించిన గ్రంధాలను ఇచ్చి ప్రోత్సహించిన డా.పిరాట్ల శివరామకృష్ణగారికి, డా.రెడ్డిఫౌండేషన్ హైదరాబాద్ వారికి, క్షేత్ర పర్యటనకు వెళ్ళినప్పుడు సహకరించిన క్షేత్రస్థాయి పాఠశాల ఉపాధ్యాయ వర్గానికి విద్యావాలంటిర్లకు, సంప్రదింపు గ్రంధాలను సేకరించు కోవడంలో సహకరించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ నగర గ్రంధాలయం, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ గ్రంథాలయం అధికారులకు, విషయ సేకరణ సమయంలోనూ, విశ్లేషణలోను సహకరించిన మిత్రవర్గానికి.....

అన్నింటికన్న ముఖ్యంగా క్షేత్ర పర్యటనకు వెళ్ళినప్పుడు ఈ పరిశోధనకు ఆకరాలైన పాటలుపాడి వినిపించిన, సమాచారాన్ని అందించి సహకరించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఖమ్మం జిల్లాలో నివసించే కొండరెడ్ల తెగలోని మహిళలకు, పురుషులకు, పిల్లలకు.......

నిరంతరం ప్రోత్సాహిస్తూ ధైర్యాన్ని అందిస్తూ, అభివృద్ధిని కాంక్షిస్తూ వెన్నంటి ఉండే కుటుంబసభ్యులకు......

అందరికి..

హృదయపూర్వక కృతజ్ఞతలు

# విషయ సూచిక

కృతజ్ఞతలు

ప్రవేశిక I-IV

**అధ్యాయం I** **1-21**

**కొండరెడ్లు –పరిచయం**

**అధ్యాయం II** **22-39**

**కొండరెడ్ల మౌఖిక సాహిత్యం – కుటుంబజీవనం**

**అధ్యాయంIII** **40-73**

**కొండరెడ్ల మౌఖిక సాహిత్యం – సామాజిక జీవనం**

**అధ్యాయం IV** **74-142**

**కొండరెడ్ల మౌఖిక సాహిత్యం – సంస్కృతి**

**అధ్యాయం V** **143-178**

**కొండరెడ్ల మౌఖిక సాహిత్యం – భాషావిశేషాలు**

**పరిశోధన ఫలితాలు** **179-183**

## అనుబంధాలు

**అనుబంధం- I** **184-191**

పదాలు - అర్థ క్షేత్రాలు

**అనుబంధం- II** **192-194**

పదబంధాలు

**అనుబంధం- III** **195-209**

కొండరెడ్ల ఛాయాచిత్రాలు

**అనుబంధం - IV** **210-215**

విషయ సేకరణకు సహకరించిన కొండరెడ్లు

**ఉపయుక్తగ్రంథ సూచి** **216-221**

# ప్రవేశిక

భాష సార్వజనీయమైంది. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని వేల భాషలున్నాయని గుర్తించారు. ప్రతి భాషకు దాన్ని వినియోగించే జాతి ఒకటి ఉంటుంది. ఆ భాషా జాతుల్లో కొన్నింటికి పదుల సంఖ్యలో జనాభా ఉంటే కొన్నింటికి కోట్ల సంఖ్యలో జనాభా ఉన్నారు. ఆ రీతిలో తెలుగు భాషా జాతికి కోట్ల సంఖ్యలో జనాభా ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 11 కోట్లమంది జనాభా గలిగిన భాషా జాతిగా తెలుగు వెలుగొందుతుంది. ఇందులో భారతరాజ్యాంగం గుర్తించిన షెడ్యూలు తెగలు, షెడ్యూలు కులాలు, వెనకబడిన తరగతులు, ఇతర కులాలకు చెందిన వారూ తెలుగు జాతిలో ఉన్నారు. వీరేకాకా అనేక సంచారజాతులకూ చెందినవారున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రధాన స్రవంతిగానున్న తెలుగు వారిలో కొండరెడ్లు షెడ్యూల్డ్ తెగకు చెందిన వారు. వీరు ఎక్కువగా గోదావరినది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్నారు. కొండరెడ్లు ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాలలో అధికంగా నివసిస్తున్నారు. కొండరెడ్లు జీవన రీతి ఆధారంగా చాలా ప్రాచీనులు. నేటికీ తమ

అస్తిత్వాన్ని కాపాడుకునే దిశలో నాగరిక సమాజానికి దూరంగా జీవనం సాగిస్తున్నారు. తెలుగుజాతి జీవనంలో కొండరెడ్లు చెంచులు ప్రాచీన జీవన రీతులకు చిహ్నాలుగా ఉన్నారన్నది మానవ శాస్త్రజ్ఞులు నిరూపించారు.

నాగరక సమాజంలోని తెలుగువారి జీవన రీతులకు కొండరెడ్ల ప్రాచీన జీవన రీతికి గల సారూప్య విశేషాలను వైరుధ్య విశేషాలను తెలిసికొన వీలగుతుందని ఈ పరిశోధన అంశం ఎన్నుకొనడమైంది. అందుకు గాను పరిశోధన క్షేత్రంగా ఖమ్మం జిల్లాను ఎంచుకొనడం జరిగింది. మౌఖికసాహిత్యంలోని గేయాలలో ప్రాచీనమైన విశేషాలు లభ్యం అవుతాయని భావించి కొండరెడ్ల మౌఖిక సాహిత్యాన్ని పరిశోధనకు ఆకరంగా గ్రహించడం జరిగింది. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, వేలేరుపాడు, దమ్మపేట, అశ్వారావుపేట మండలాలలో అధికంగా కొండరెడ్లు నివసిస్తున్నారు. స్థానికంగా వీరి మాతృభాష తెలుగు. ప్రామాణిక తెలుగుకి వీరి తెలుగుకి వైవిధ్యం కన్పిస్తుంది. వీరి వినియోగ మౌఖిక సాహిత్య భాష

ద్వార వీరి జీవన విధానాన్ని తెలిసికొనడమే ఈ పరిశోధన ఉద్దేశ్యం.

ఈ పరిశోధనను ఐదుఅధ్యాయాలుగా వింగడించడమైంది. మొదటి అధ్యాయంలో తెలుగు మాట్లాడే గిరిజన తెగలలో కొండరెడ్ల స్థానాన్ని పరిచయంచేసి, ద్వితీయ ఆకరాలనుండి సేకరించిన అంశాలతోనూ, క్షేత్రంలో సేకరించుకున్న అంశాలతోనూ కొండరెడ్ల నివాసం జీవనవిధానం సంస్కృతి పరిరక్షణ రీతులను పరిచయం చేస్తూ తెలపడమైంది. తరువాతి అధ్యాయాలను ఖమ్మం జిల్లాల్లో నివసిస్తున్న కొండరెడ్లనుండి క్షేత్రపర్యటనద్వారా సేకరించిన మౌఖికసాహిత్యంలో చిత్రితమైన అంశాల ఆధారంగా రచించడం జరిగింది.

రెండవఅధ్యాయంలో కొండరెడ్ల కుటుంబజీవనంలో ఉమ్మడికుటుంబ వ్యవస్థ, వ్యస్త కుటుంబ జీవనవ్యవస్థ, రక్తసంబంధ బంధుత్వాలు, వైవాహిక సంబంధ బంధుత్వాలు తెలపడమైంది.

మూడవ అధ్యాయంలో కొండరెడ్ల సామాజికజీవనం నివాస ప్రదేశాలు, వ్యవసాయం, పోడువ్యవసాయం, పంటలు, పశుపోషణ, జలవనరులు, వేట, అటవీ ఉత్పత్తుల సేకరణ, సంతలు, కొలతలు, ద్రవ్య రీతులు, వృత్తులు, ఇంటినిర్మాణం, గ్రామ నిర్మాణం, వెట్టివిధానం మొదలైనవి చర్చించడమైంది

నాల్గవ అధ్యాయం కొండరెడ్ల మౌఖిక సాహిత్యం – సంస్కృతిలో కొండరెడ్ల మతం ఆధారంగా పూజలు, నైవేధ్యాలు, బలులు, పండుగలు తెలపడమైంది. కుటుంబ పరంగా పెండ్లి, ఆచార వ్యవహారాలు, బొట్టుకు పోవడం, ఓలి, అక్షింతలకి వెళ్లడం, వియ్యాల వారి వేడుకలు, అప్పగింతలు, నివాళి, పెండ్లి విందు, ఇల్లరికం, పెండ్లి తిరస్కృతి, సంతానం, అలంకరణ సామాగ్రి, ఆభరణాలు, దుస్తులు, ఆహారపుటలవాట్లు, వినోదాలు విలాసాలు, ఆటలు, నృత్యం మొదలైన వాటిని చర్చించడమైంది.

ఐదవ అధ్యాయంలో కొండరెడ్ల తెలుగు భాషలోని వర్ణాలు, వర్ణవ్యాప్తి, వర్ణమార్పులు, పదాంశాల చర్చ చేయడం జరిగింది.

అధ్యాయాల చివర పరిశోధనా ఫలితాలను అధ్యాయాల వారీగా ఇవ్వడమైంది.

అనుబంధాలలో వరుసగా కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోని మాటల అర్థక్షేత్రాలు, పదబంధాలు, పర్యటన కాలంలో సేకరించిన ఛాయాచిత్రాలు, క్షేత్ర పర్యటనలో విషయ సేకరణకు సహకరించిన కొండరెడ్ల పేర్లు వరుస క్రమంలో ఇవ్వడమైంది.

చివరగా ఈ పరిశోధనా క్రమానికి అధ్యయనానికి సిద్ధాంత వ్యాస రచనకు ఉపకరించిన గ్రంథాలను ఉపయుక్త గ్రంథ సూచికలో అకారాది క్రమంలో కూర్చడమైంది.

# మొదటి అధ్యాయం

## కొండరెడ్లు – పరిచయం

ఆదివాసీలు భారతదేశంలో అనేక జాతులు, తెగలు, కులాలు, వర్గాలు అని ప్రజలను ప్రభుత్వం, సమాజం విభజించి చూస్తుంది. భారతీయుల జీవనవిధానంలో ప్రాచీనకాలంనుండి అనేక తెగలు మూలవాసులుగా భారతదేశంలో నివసిస్తున్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. కాలక్రమంలో వీటిలోని కొన్ని తెగలు నాగరిక సమాజాలతో విలీనమయ్యాయి. మరికొన్ని తెగలు నేటికీ తమ ఉనికిని, ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. భారతదేశంలో తెగ అనే మాటను సమగ్రంగానూ నిర్దిష్టంగానూ నిర్వచించడం వీలుకాదు. "ప్రాచీనత, నివాసం, చరిత్ర, సంస్కృతి, ఆర్థికస్థితి, సమాజం అనే ఆరు ముఖ్య లక్షణాలు కలిగి జీవించే ప్రజా సమూహమే తెగ" అని యన్.సి. దూబే వివరించాడు[1]. కొన్ని కుటుంబాలు, లేదా కొన్ని కుటుంబ సముదాయాలమధ్య సమైఖ్యత వుండి, ఒకే పేరుతో వ్యవహరింపబడుతూ వారందరూ ఒకే నిర్ణీత ప్రదేశంలో నివసిస్తూ, ఒకే భాష మాట్లాడుతూ, ఒకే రకమైన వైవాహిక నియమాల్ని పాటిస్తూ, ఒకే రకమైన ఆహార విధానాన్ని అవలంభిస్తూ పరస్పర సహకార భావం కలిగివుండి, వారి మధ్య పరస్పర అనుబంధముండే సమూహాన్ని తెగ అనవచ్చు. ఒక తెగ సామాన్యంగా అంతర్వివాహ సముదాయం అంటే ఒక తెగలోని వారు ఆ

తెగలోని వారితోనే వైవాహిక సంబంధాల్ని ఏర్పరచుకొంటారు.[2] (మజుందార్-1961. భారతదేశము గిరిజన సముదాయాలు. పేజి-1) మొగలుల దండయాత్రకు పూర్వం గిరిజనులు స్వతంత్రంగా, గణతంత్ర వ్యవస్థను పోలి వుండేవారు. స్వంతంగా స్వతంత్రరాజ్యాలు కలిగిఉన్నారు. ఇందులో గోండురాజ్యం, కోయరాజ్యం, కొండరెడ్ల రాజ్యం ముఖ్యంగా చెప్పుకోదగినవి. వీరిలో వర్గాలు, వర్గదోపిడీ – పీడన లేదు. నేటికీ వ్యవసాయం వేట అంతా సమిష్టిగానే సాగుతుంది. చారిత్రక ఆధారాలను బట్టి చూస్తే భారతదేశంలో ఆదివాసీల రాజ్యాలు బ్రిటిష్ వారి రాకకు ముందు చాలా బలంగా ఉండేవని తెలుస్తుంది. బ్రిటిష్ వారి రాకకు పూర్వమే కాకతీయులను, మొగలులను, రెడ్డిరాజులను ఎదిరించి పోరాటాలు చేసిన దాఖలాలు చరిత్రలో కన్పిస్తున్నాయి. బ్రిటీష్ వారి రాక తర్వాత వీరిపై అనేక దండయాత్రలు జరిగినప్పుడు ఆదివాసీలు వీరోచితంగా ఎదుర్కొన్నప్పటికీ అశేష బలాధిక్యతను కూడగట్టుకుని బ్రిటీష్ వారు చేసిన దాడులకు ఓడిపోక తప్పలేదు. ఓడిన వారిని సామంతులుగా పరిగణించడంతో అది ఇష్టంలేని ఆదిమజాతులు పూర్తిగా అడవులు, కొండలువంటి మారుమూల ప్రాంతాలకు వెళ్లి తలదాచుకుని ఆటవికజీవనం ప్రారంభించారని తెలుస్తుంది.

భారతదేశంలోని ఆదివాసీలను 1952వ సం లో 'గిరిజన అభ్యుదయ కమిటీ' నాలుగు వర్గాలుగా వర్గీకరించింది. 1. వారివారి ప్రాంతంలోనే నివసిస్తూ సాంప్రదాయిక ఆదివాసీ జీవితాన్ని విడనాడక ఉన్న తెగలు,

వీటినే ‘ఆదివాసీ సముదాయాలు’ అనవచ్చు. 2. గ్రామీణ పరిసరాల్లో నివసిస్తూ, వ్యవసాయం దానికి అనుబంధ జీవనాలను అలవరుచుకొని ఉన్న తెగలు, ఇటువంటి వాటిని అర్ధ ఆదివాసీ సముదాయాలు అనవచ్చు. 3. నగర ప్రాంతాలకు వలసపోయి అక్కడ స్థిరపడి, అక్కడి నాగరిక వృత్తులను చేపట్టి, అక్కడి ప్రజల ఆచారవ్యవహారాలను అలవరుచుకొన్న తెగలు, వీటిని ‘సంస్కృతీకరణ చెందిన ఆదివాసీ సముదాయాలు’ అనవచ్చు. 4. పూర్తిగా ఇతర సంస్కృతులతో విలీనీకరణం చెందిన ఆదివాసీ తెగలు. ఇలా వర్గీకరించిన తెగలలో దక్షిణ మండలంలోని తెలుగు వ్యవహార ప్రాంతంలోని గిరిజనుల్లో తెలుగు మాతృభాషగా కలిగిన గిరిజన తెగలు మొత్తం ఏడు ఉన్నాయని గుర్తించారు.  అవి 1. కొండరెడ్లు 2. బగతలు 3. కొండదొరలు 4. వాల్మీకులు 5. కొండకమ్మరులు 6. చెంచులు 7. యానాదులు. 2014లో జూన్2న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అని  రెండు రాష్ట్రాలుగా విభజించడం  జరిగింది. ఈ రెండు రాష్ట్రాలలోను తెలుగు మాట్లాడే వారే ఎక్కువ. విభజనకు గురైన రెండు రాష్ట్రాలలోను పైన  చెప్పిన ఏడు తెగలకు చెందిన ఆదివాసీలు ఉన్నారు.

తెలుగు గిరిజనులు : తెలుగు వ్యవహార ప్రాంతంలోని గిరిజనులను మూడు వర్గాలుగా గుర్తించవచ్చు. 1. ఆహార సంగ్రహణ విధానానికి ప్రాధాన్యత ఇచ్చేవారు. 2. ఆర్థిక వ్యవస్థ  అటు ఆహార సంగ్రహణ ఇటు మారక వ్యవసాయానికి చెందక మధ్య రకానికి చెందిన వారు. 3. అటవీ వనరులపై

ఆధారపడుతూ కొండ దిగువ ప్రాంతాలలో భారతీయ సాంప్రదాయిక వ్యవసాయం చేసుకునేవారు అని గుర్తించడం జరిగింది. నాగరిక సమాజంతో సంబంధాలను పెంచుకున్న ఆదివాసీలు సాంస్కృతికజీవన సంబంధాల విషయంలో తమ సాంప్రదాయిక గిరిజన జీవితాన్ని వదలకుండా కాపాడుకుంటూ వస్తున్నారు కానీ జీవనసంస్కృతి విషయంలో ఆధునికతను అనుసరిస్తున్న తీరు కన్పిస్తుంది. తెలుగు మాతృభాషగా కలిగిన గిరిజన తెగకు చెందిన చెంచులు, కొండరెడ్లు, కొండదొరలు, కొండకమ్మరులు ప్రాచీన సాంప్రదాయిక గిరిజన జీవితాన్ని విడనాడక ఉన్న తెగలుగా గుర్తించడం జరిగింది. ఇటీవల కాలంలో కొండదొరలు నగర ప్రాంతాలకు వలసపోయి అక్కడ స్థిరపడి, అక్కడి ప్రజల ఆచార వ్యవహారాలతో తమ నమ్మకాలను ముడిపెట్టి బతుకుతెరువు సాగిస్తూ నాగరిక జీవనానికి అలవాటు పడుతున్నారు.

**కొండరెడ్లు**

తెలుగు గడ్డపై నివసిస్తున్న కొండరెడ్లు తమను తాము 'పాండవరెడ్లు' అనీ 'రాచరెడ్లు' అనీ చెప్పుకుంటారు. వీరి జీవనవిధానాన్ని పరిశీలించినట్లయితే ఆదిమజాతి మానవుని జీవనవిధానానికి పోలిక ఎంతగానో కన్పిస్తుంది. తెలుగు వ్యవహార ప్రాంతాలలోని ఆదివాసీలపై పరిశోధనలు చేసినవారు క్రిస్టాఫ్ ఫాన్ ఫ్యూరర్ హైమన్డాఫ్ ఆదిమజాతి మానవులుగా గుర్తింపబడిన వారిలో మొట్టమొదటగా కొండరెడ్లను పేర్కొన్నారు. వీరుచేసే పోడువ్యవసాయ విధానం మోటైనదనీ,

ప్రాచీనమనీ పేర్కొన్నారు. అంతేకాదు ఇంత మోటు పద్ధతులని వదలక వ్యవసాయం చేసే ఆదివాసీలు మరొకరు ఆసియా ఖండంలోనే లేరనికూడాతెలియజేశారు[3] సామూహికతత్వం ఉమ్మడితనం కొండరెడ్ల ఆచార వ్యవహారాల్లో, సంప్రదాయాల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తాయి.

**కొండరెడ్ల చరిత్ర :**

పూర్వం రెడ్డి రాజుల కాలంలో యుద్ధాలు జరిగినప్పుడు ఆ యుద్ధాలలో పరాజయంపాలై ప్రాణభీతితో అడవుల్లోనూ, కొండకోనల్లోనూ తలదాచుకొన్నారనీ, అలా అప్పటినుంచి వారు ఆయా ప్రాంతాలలోనే స్థిర పడి పోయారనీ, అలా నేడు అడవులకే పరిమితమైన వారే కొండరెడ్లనీ, వీరి ఉనికి వేల సంవత్సరాల నుంచి ఉందనే అభిప్రాయం సమంజసమేనని విద్యాసాగర్ అభిప్రాయంగా కెచ్చల రంగారెడ్డి పేర్కొన్నారు[4] వీరికి గురువులు జంగాలవారు.

**కొండరెడ్ల రూపం** - ప్రత్యేకత **:**

కొండరెడ్లు చామనఛాయ రూపంతో కొంచెం పొడవుగా ఉండి దృఢకాయులుగా ఉంటారు, పొడపైన జుట్టును కలిగి ముడివేయడం ఆనవాయితి, కొనతేలిన ముక్కు నాసికా రంధ్రాలు, చిరుగడ్డంతో ఉంటారు. ముందటి కాలంలో మగవాళ్ళు గోచిపాతలుగానీ, అడ్డపంచెలుగానీ ధరించేవారు. ఖచ్చితంగా తలపాగా ధరిస్తారు. ఇటీవల యువతరం తలపని చేసుకోవటం, ప్యాంట్లు, చొక్కాలు, షార్ట్ లు వేస్తూ నాగరికతకు

అలవాటుపడుతున్నారు, స్త్రీలు చీర, లంగా, జాకెట్టు వేసుకుంటున్నారు. కానీ ప్రాచీన కాలంలో వీరు జాకెట్టు తొడిగేవారు కాదు. స్త్రీల కట్టుబొట్టు, అలంకరణలు సాంప్రదాయికంగా ఉండేవి. వివిధమైన ఆభరణాలు ధరించి తమ ఉనికిని చాటుకునేవారు. వాటిల్లో నాసికారంధ్రాల మధ్య నోటిపై భాగాన నత్తులను ఆభరణంగా ధరించడం, మెడకు రకరకాల పూసల పేర్లు ధరించడం వీరి ప్రత్యేకత. స్త్రీలు తలకొప్పు వేసి పూలు పెడతారు. గోదావరి ఒడ్డువారు సాధారణంగా స్నానాలు సాయంత్రం మాత్రమే చేస్తుంటారు. నీటి ఎద్దడి కారణంగా కొండలపైవారు రోజు స్నానాలు చేయరు చేస్తే మధ్యాహ్నం ఎండవేడిలో చేస్తారు. పురుషులు అడ్డనారను మొలత్రాడుగా ఐదారు వరుసలు నడుముకు చుట్టుకొంటారు. కొండరెడ్లు తమ బంధువుల ఇళ్ళకు వెళ్ళినప్పుడు తమకు పండినకొత్త పంటనుంచి ఎంతో కొంత బహుమతిగా తీసుకుపోతారు. పొరుగూరినుంచి వచ్చిన అతిథుల్ని ప్రతికుటుంబం గౌరవించి ఆధరించడం ఆచారం. స్త్రీ, పురుషులందరికి అతిథి మర్యాద చేయడం ఉత్కృష్ట ధర్మంగా భావిస్తారు. వీరి ఆర్థిక సామాజిక వ్యవస్థ అతి ప్రాచీన నాగరికతకు చెందినది.

**కొండరెడ్ల ఇంటిపేర్లు :**

ఇక్కడ నివసిస్తున్న కొండరెడ్ల ఇంటిపేర్లు ఈవిధంగా వున్నాయి. కతల, ముర్ల, గొల్ల, కనుగుల, కెచ్చల, అందెల, సుంట్రు, వల్లాల, కొండ్ల, కటకాల, మొదలగు ఇంటిపేర్లుగల కొండరెడ్లు ఉన్నారు, వీరి ఇంటిపేరుకి చివర వాళ్లు, వారు, చేర్చి కెచ్చలవారుఅనిగాని, కెచ్చలవాళ్లుఅనిగాని

పిలుస్తారు. కొండరెడ్ల పూర్వీకులనివాసంసంఘటనల, స్థితిగతుల ఆధారంగాకూడా ఇంటిపేర్లుంటాయి. కేచ్చాలవారిలో వోరకేచ్చాల, పిడుగులకేచ్చల, ఎలుగుచింతలకేచ్చల వంటివి గోదావరి ఒడ్డు ప్రాంతాలలో ఉన్నాయి. ప్రతి గ్రామంలోనూ పురుషులు చిన్నా పెద్ద మొదలు అందరూ తమ ఇంటిపేరు తమపేరుతో కలిపి రెడ్డి అనే కులం పేరు జతపరచి పిలుచుకుంటారు.

**నివాస స్థలం:** సాధారణంగా కొండరెడ్లు తూర్పుకనుమల మధ్య ప్రవహించే గోదావరినదికి ఇరుపైపులా వున్న కొండలలో జీవిస్తున్నారు. వీరు కొండ ప్రాంతాల్లో నివసిస్తుండడంవల్ల వీరికి కొండరెడ్లనే పేరు వచ్చింది. వీరికి కొండకోనలే లోకం, నాగరికులంటే భయం, వీరి జీవన సరళి, సంస్కృతీ సంపద సర్వం అడవుల మీదే ఆధారపడి వుంటుంది. మన రాష్ట్రంలో ఉత్తర సరిహద్దుకు చివరనున్న శ్రీకాకుళం, వైజాగ్ నుంచి ఉభయగోదావరి జిల్లాలలోని తూర్పు కనుమల్లోనూ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని అడవుల్లోనూ కొండల్లోను దక్షిణాన రాయలసీమ జిల్లాల్లో తూర్పు కనుమల్లోని నల్లమల అడవుల్లోనూ, కొండల్లోను కొండరెడ్లు నివసిస్తున్నారు. సంస్కృతీ పరంగా చాలా ఉన్నత స్థాయిలో ఉన్నారనే దానికి వీరి జీవన శైలే నిదర్శనం. ఇప్పుడిప్పుడే వీరి విద్యాభివృద్ధికి ఆశ్రమ పాఠశాలలు సమీకృత గిరిజనాభివృది సంస్థల వారిచే నిర్వహించబడుతున్నాయి.

పరిశోధనా క్షేత్రమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఖమ్మంజిల్లాలో

కొండరెడ్లు అధికం. ఈ జిల్లాలోని భద్రాచలం, దమ్మపేట, కూనవరం, వేలేరుపాడు, అశ్వారావుపేట, చింతూరు, వరరామచంద్రాపురం మండలాలలో పలుగ్రామాలు పూర్తిగా కొండరెడ్లవి ఉన్నాయి. దమ్మపేట మండలంలోని అంకంపాలెం, తిరుమలకుంట, కొత్తమాములవారి గూడెంలో కొండరెడ్లు అధికంగా నివసిస్తున్నారు.

కూనవరం మండలంలోని కొండరెడ్ల గ్రామాలు: గబ్బిలాల గొంది, తోటమామిడి, కుసుమామిడి, కొత్తకర్మాన్ కొండ, పాత కర్మాన్ కొండ, చింతగండి, ఎలుగుల గొంది, కొప్పిరిమెట్ట, కిందిపాకల, టేకులొద్ది. ఈ గ్రామాలన్ని దట్టమైన అడవులమధ్య కొండలపై దాదాపుగా గ్రామానికి గ్రామానికి మధ్య 2-3 కి.మీ.ల దూరంలో ఉన్నాయి. వీటిలో తారురోడ్డుకు దగ్గరి గ్రామం గబ్బిలాలగొంది. ఈ గ్రామంకూడా రోడ్డునుంచి దాదాపుగా 5 km దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో వుంది. ఒక్కో గ్రామంలో 3-5 ఇండ్లు మరికొన్ని చోట్లా 10 ఇండ్లు ఒక్కోదగ్గర ఒక్కటే ఇల్లుకూడా వుంది ఈ గ్రామాలలో నివసించే కొండరెడ్లకి కావలసిన నిత్యావసరాలకి వారికి సమీప గ్రామంగా భావించే కుటూరు గ్రామంలో సోమవారం సంతలో కొనుక్కొని తిరిగి కొండెక్కుతారు.

వేలేరుపాడు మండలంలో టేకుపల్లి, పేరంటపల్లి, కాకిఇసునూరు, కోయిదా, రేపాకగొమ్ము మొదలైన గ్రామాలలో కొండరెడ్లు నివాసముంటున్నారు. ఇవి గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామాలు. ఇక్కడ సమతల భూమిపై పంటలు పండిస్తారు. గోదావరి

జలాలను పంటలకు వినియోగిస్తారు. ఈ ప్రాంతంలోని కొండరెడ్లు నాగలి వినియోగించి వ్యవసాయం చేస్తారు. కొంత నాగరిక సమాజానికి దగ్గరగా ఉండడం వల్ల ఈ మండలంలోని ప్రజలు నాగరిక జీవనానికి అలవాటు పడినట్లు కన్పిస్తున్నారు. వీరు గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి చేపలు తెచ్చి అమ్ముకుంటారు. చేపలవేట ఎవరికి వారు చేసుకుంటారు. ఇక్కడ సాముహిక విధానం కన్పించదు.

అశ్వారావుపేట మండలంలోని కొండరెడ్డి గ్రామాలు కవాడిగుండ్ల, గోగులపుడి, కన్నాయిగూడెం, బండారిగూడెం, గాండ్లగూడెంమొదలైన గ్రామాలలో కొండరెడ్లు నివాసం ఉన్నారు. ఈ గ్రామాలు కొండలపైన ఉన్నాయి. ఈ ప్రాంతంలో పోడు వ్యవసాయం, సాముహిక వేట విధానం నేటికీ పాటిస్తున్నారు.

చింతూరు మండలంలో కూడా అధిక సంఖ్యలోనే కొండరెడ్లు నివసిస్తున్నారు. చెదలవాడ, బాయిబొక్క, కొల్లేరుమద్ది, పల్లకావం, చిన్నటుగు, చింతలపాడు మొదలగు గ్రామాలలో కొండరెడ్లు జీవిస్తున్నారు.

వరరామచంద్రాపురం మండలంలో జిడిగుప్పా, ఇప్పూరు, ముత్యాలమ్మ గండి, దారపల్లి, కల్తినూరు, పోచవరం, కొండేపూడి, మారేడుపూడి, గండిగూడేం, రాయిగూడేం, కోటూరుగుమ్ము, యేరువాడ, తుమ్మిలేరు, కొల్లూరు, చినమట్టపల్లి, గొందురు, రాజుపేట గ్రామాలలో

కొండరెడ్లు జీవిస్తున్నారు. ఈ మండల ప్రజలు  గోదావరి పరివాహక ప్రదేశంలో నివసిస్తున్నారు. వీరి నివాసం సమతల ప్రాంతం. ఈ మండలంలోని వారు కొండలపైకి వెళ్లి సాముహిక వేట విధానం పాటిస్తారు. సమతల ప్రాంతంలో నాగలి వినియోగించి వ్యవసాయం చేస్తారు. కొండపైకి వెళ్లి పోడు వ్యవసాయంకూడా చేస్తారు. చేపల వేటకి వెళతారు. ఈ మండలంలోని వారు ప్రాచీన, అర్వాచీన నాగరికతలను రెంటిని పాటించడం కన్పిస్తుంది.

**నివాస విధానం :**

కొండరెడ్లు చిన్న కుటుంబాలుగా నివసిస్తారు. భార్య, భర్త, పెండ్లికాని పిల్లలు ఈ కుటుంబంలో భాగస్వాములు. పిల్లలు ఎదిగిపెండ్లి కాగానే వేరు కుటుంబం పెట్టిస్తారు. కొండరెడ్లు తమ ఇంటిని కొండగడ్డితో, తాటాకులతో, కప్పుకుంటారు. ఇంటి నిర్మాణానికి కావలసిన కలపకు అడవిలో లభించే వెదురు బొంగులను ఉపయోగిస్తారు, గదుల నిర్మాణానికి, అలాగే గుమ్మాలకి వెదురు తడికెలు వాడతారు. కోడిసే బడితలను ఇంటి చుట్టూ నాలుగు వరుసలుగా వెదురు కంపగాని, కర్రతోగాని పాతిపెట్టి వెదురు బొంగులతోనే కడతారు. అది వారి ఇంటికి ప్రహారీలాగా ఉంటుంది. అదేవిధంగా పంటల కాలంలో కొండపోడు వద్ద ఎక్కడివారు అక్కడ మరో ఇల్లు వేసుకుంటారు. వీటిని చేనుపాకలు అంటారు. ఈ పాకల్లోనే ఉండి పోడు పనులన్ని పూర్తి చేసుకుని తిరిగి ప్రధాన గ్రామంలోకి చేరుతారు, వీరికి ఒంటరిగా జీవించే లక్షణం కూడా ఉంది.

**పరిపాలన :**

కొండరెడ్ల ఆర్థిక జీవనం ఏదేమైనా సామాజిక సంబంధాలలో ఐక్యతతోపాటు మంచి పరిపాలనా దక్షతకూడా ఉంటుంది, వివాహాలను దృవీకరించడం సమాజంలో సమైక్యతా భావాన్ని, తీర్మానాన్ని చేయడానికి ప్రతి కుదురుకు వెజ్జు, గ్రామ పెద్దలుంటారు. వెజ్జు వైద్యం చేస్తారు. పుజారితనం వెజ్జు నిర్వహిస్తారు. గ్రామస్తులకు సలహాదారుగా ఉంటారు. ప్రతి గ్రామానికి సంబంధించి చిన్నపెద్ద, పెద్దపెద్ద ఉంటారు. వీరికి పాలనా సంబంధ వ్యవహారాల్లో సమప్రాధాన్యం ఉంటుంది. కుదురుల మధ్య పేచీలు వస్తే తీర్మానాలకు జాతి పెద్ద ఉంటాడు. వీరి నిర్ణయానికి అందరు సమ్మతించి మెలగడం ఈ జాతి వైశిష్ట్యం.

**పోడు వ్యవసాయం :**

కొండరెడ్లు చేసే పోడువ్యవసాయం ప్రత్యేకమైంది. సాధారణంగా వేసవికాలంలో (ఫిబ్రవరి–మార్చ్) కొండపై ప్రాంతాల్లో దేవతలను ప్రతిష్టించి పూజలు చేసి పనులను ప్రారంభిస్తారు. చిన్నచిన్న తుప్పల్ని నరికి అడవికి నిప్పు పెడతారు. ఇప్పచెట్లు, జీలుగుచెట్లు నరకరు. వీటిని తల్లితో సమానంగా భావిస్తారు. అలా తొలకరి వర్షాలు రాగానే కొండ దేవరకి బలిగా కోడిని కోసి రక్తాన్ని భూమిపై చల్లి వ్యవసాయం ప్రారంభిస్తారు. దీన్నే భూమిపూజ అంటారు. పోడుభూములు కొండవాలులో ఉంటాయి. నాగలిగానీ, కర్రుగానీ వాడరు. అడవిలోని చెట్టు పుల్లలను కూసిగా

చివ్వుకుని వాటితో వ్యవసాయానికి ఎన్నుకున్న క్షేత్రంలో నేలపై పొడుస్తూ పోతుంటారు. ఎక్కడ నేలలో పుల్ల దిగుతుందో అక్కడ విత్తనం నాటుకుంటూ వెళతారు. ఇలా చేసే వ్యవసాయాన్నే పోడు వ్యవసాయం అంటారు. పోడులో ప్రధానంగా పండించే పంటలు కొండజొన్నలు, సజ్జలు, సామలు, కొర్రలు. కొండవాలు ప్రాంతాల్లో వరి పండిస్తారు. వీటితో పాటు నల్ల అలసందలు, కందులు, కులమకాయలు, దోసకాయలు, గోంగూర పండిస్తారు. పోడుభూములు కొండవాలులో ఉంటాయి కాబట్టి వర్షాలకు భూసారం కొట్టుకుపోతుంది. మూడుసంవత్సరాలకు పూర్తిగా సారం పోతుంది. అందుకని నాలుగో సంవత్సరం మరో కొండవాలుకు వెళ్లి అక్కడ మూడు సంవత్సరాలు పోడు వ్యవసాయం చేస్తారు. ఆ తర్వాత మరో పోడు చేస్తారు. ఇలా మూడు పోడులు చేసిన తర్వాత మరలా మొదటి కొండవాలుకు వెళ్తారు. అప్పటికి అక్కడ తుప్పలు పెరిగి భూసారం పెరిగిఉంటుంది. కాని ఈ మధ్యన జనాభా పెరగటం, అటవీ చట్ట నిబంధనల కారణంచేత, పోడు విస్తీర్ణం తగ్గిపోవడంచేత చాలాచోట్ల ఒకే స్థలంలో ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేయాల్సివస్తుంది. దానివల్ల దిగుబడి తగ్గి కొండరెడ్లకు 'పోడు' జీవనాధారం కల్పించలేకపోతుంది.

**వేట :**

కొండరెడ్లు వేటలో ఆరితేరిన వారుగా ప్రసిద్ధి. గ్రామంలోని ప్రతి ఒక్కరు కత్తిని, విల్లంబులను ధరించే జీవనం సాగిస్తారు. విల్లంబులు వీరి అస్తిత్వ చిహ్నం. వీళ్ళది అనాదిగా వేటకు వెళ్లే సంప్రదాయంగల తెగ.

అడవులలోనూ కొండల్లోను నివసిస్తున్న జంతువులను, పక్షులను వేటాడడం వీరికి జీవనోపాధి మాత్రమే కాదు వినోదం కూడా. గ్రామంలోని వారందరూ కూడుకుని సామూహికంగా వేటకు వెళ్ళడం అలవాటు. వెళ్లే వారు మూడు  వర్గాలుగా విడిపోయి వేటలో పాల్గొంటారు.  జంతువుల ఉనికిని గుర్తించి తరుముకునే కుక్కలతో కొందరు, వలలు విల్లంబులు ఈటెలు పట్టుకుని జంతు వేట చేసేవారు కొందరు, చంపిన జంతువుల కళేబరాలను కాపాడుతూ మరి కొందరు,  వేటకు వెళ్ళిన రోజున ఆ గ్రామానికి చెందిన వారంతా ఒక చోట కూడి సాముహిక విందు భోజనం చేసుకుంటారు. ఎలాగంటే   వేటాడి తెచ్చిన కళేబరాలను శుభ్రం చేసి కండలతో కూడిన మాంసాన్ని యితర భాగాలను వేరు చేస్తారు. మాంసాన్ని పక్కన పెట్టి యితర భాగాలతో కూర చేసుకుంటారు. మగవాళ్ళు వేటకు వెళ్లి  వచ్చేసరికి ఊరిలోని ఆడవాళ్ళు అన్నం రొట్టెలు చేసుకుని ప్రతి ఇంటినుంచి తెచ్చి ఒక దగ్గర కూడుతారు. వేటకు వెళ్లి వచ్చే మగవాళ్ళకు  డప్పులు కొట్టి  గ్రామంలోని స్త్రీలు స్వాగతం పలకడం సంప్రదాయం. అందరూ కలసి అన్నం, మాంసం, కూరలను దేవుడికి ‘ఓరెం’ పెట్టి పూజ చేస్తారు. పూజానంతరం సామూహికంగా తెచ్చుకున్న అన్నం రొట్టెలతో, మాంసం కూరతో ముచ్చటించుకుంటూ విందు చేసుకుంటారు. పొద్దు కుంకే వేళ సారాయి తాగి ఆట పాటలతో వినోదిస్తారు. మిగులు మాంసాన్ని ఊరిలోని కుటుంబాలు సమానంగా  పంచుకోవడం ఆనవాయితి. ఈ పంపకం వేటకు మాత్రమే పరిమితం. కారణం నిల్వ

ఉండకపోవటమే. ఇది వీళ్ళ వేట విధానం. కాని యిప్పుడు జంతువులు తగ్గాయి. పక్షులు తగ్గాయి. ఆంక్షలు పెరిగాయి. వేటాడడం తగ్గిపోయింది. కాని ఆత్మరక్షణకు అడవి జంతువులైన అడవిపందుల్ని, దుప్పి, కుందేలు, ఎలుగుబంట్లు, అడవిగొర్రెలను వేటాడతారు. ఆహారంలో భాగంగా పక్షుల్లో నెమలిపిట్టలు, బోడపిట్టలు, చిరుకుపిట్టలు, కారుకోడి, చిప్పరకోడి, కాంజుపిట్టలు, భీంపిట్టలని వేటాడి తింటారు. అదే విధంగా చేపల వేటకి చేతిముల్లు, గాలాలు మాత్రమే ఉపయోగిస్తారు. గండెపరాలు, పొలుసుచేపలు, బొచ్చెలు, చీరచేపలు, రొయ్యలు, టెంకర్రాళ్లు, దెందులు, మోసెపర్కలు వంటి జలచరాల్ని వేటాడతారు. వీరు వేటకు కావలసిన విల్లంభులను, బాణాలను, ఈటేలను స్వయంగా సమకూర్చుకొంటారు.

**ఆహార పదార్థాలు :**

కొండరెడ్ల తెగలోని అందరూ ఇంటి ముందు గానీ వెనకగానీ కొంత స్థలం సరిచేసుకుని తోట పెంచడం ఖచ్చితమైన అలవాటుగా కలిగి ఉంటారు. అందుకోసం ఇంటికి ముందు వెనుక కొంత స్థలం వదిలి వెదురు తడికలతో ప్రహరీ కట్టుకుంటారు. ఇలాంటి విధానం ఆదివాసీలలో ఈ తెగవారికి ప్రత్యేకం అని చరిత్రకారులు చెప్తున్నారు. ఆ స్థలంలో అరటి, కమలా, మునగ, చీమమిరప, నిమ్మ, నారింజ, బత్తాయి, బొప్పాయి చెట్లను పెంచుతారు. అడవుల్లోనుండి దుంపల్ని సేకరిస్తారు. వీటిల్లో వేలిచందగడ్డల్ని శనగడ్డల్ని తెచ్చి రెండురోజులు నీళ్ళలో నానబెట్టి విషరహితం చేసుకుని తింటారు. వీటికి ఉప్పుకారం కలిపి ఏదయినా

ఆకుకూరలో చేర్చి తింటారు. ఇంటిదగ్గర మెంతికూర, దుగ్గలికూర, అక్కాచెల్లెళ్ల కూరవంటి ఆకుకూరలు వంటకి వినియోగిస్తారు. లేత వెదురుతో వంటచేసి కూరగా ఉపయోగిస్తారు. మామిడి టెంకల్ని నీళ్ళలో నానబెట్టి తర్వాత పిండిగొట్టి రొట్టెలుగాను, జావగాను ఉపయోగిస్తారు. వీటిని టెంకరొట్టెలని, టెంకజావని పిలుస్తారు. జిలుగు చెట్టు కల్లును కొన్ని సార్లు ఆహారంగా ఉపయోగిస్తారు. దాని బెరడును తీసి అంబలి కాచుకొంటారు. అది వారికెంతో బలాన్ని ఇస్తుందని విశ్వసిస్తారు. ఇలాంటి పౌష్టికాహారం వల్లే మైదాన ప్రాంతాల వారికంటే కొండరెడ్లు చాలా బలంగా ఉంటారు.

**వ్యాపారం :** అటవీ ఉత్పత్తులైన చింతకాయలు, అడ్డాకులు, జిగురు, తేనె, ముష్టిగింజలు సేకరించి తెచ్చి సంతలలో అమ్ముతారు. అడవిలో దొరికే ఔషధమొక్కలనుండి వాటి ఆకులను బెరడును, గింజలను, వేర్లను సేకరించి వాటి ఔషధ విశేషాలను తెలుపుతూ సంతలలో అమ్ముకుంటారు. వీటితోపాటుగా వెదురును సేకరించి తద్వారా చేటలు, బుట్టలు, విసనకర్రలు, తట్టలు తదితర వస్తువులు తయారుచేసి వారాంతపు సంతల్లో ఎవరికివారు అమ్ముకుంటారు. అలా అటవీ ఉత్పత్తులను సంతల్లో విక్రయించి వారికి కావలసిన నిత్యావసరాలన్నీ కొనుగోలు చేసుకొని మిగిలిన సొమ్ముతో మద్యం సేవిస్తారు. వారం వారం జరిగే ఈ సంతలకి వీరు విధిగా వస్తుంటారు. వివిధ గ్రామాలనుంచి వచ్చే వారి బంధువులను కలుసుకోవడానికి సంతలు ఉపకరిస్తాయి. ఈ

సందర్భంగా ఒకరితో ఒకరు జరుపుకునే క్షేమసమాచారాల్లో పెళ్ళిళ్ళ ప్రస్తావనలు వస్తుంటాయి. సంతలు వీరికి సామాజిక వేదికలు అవుతాయి.

**కొండరెడ్ల సంస్కృతి :**

కొండరెడ్ల సంస్కృతిని నాలుగు అంశాలుగా దర్శించవచ్చు. పుట్టుక, పెండ్లి, మరణం సంబంధంగా నిర్వహించే ఆచార వ్యవహారాలు. కొండరెడ్లు నిర్వహించే పండుగలు ప్రధానమైనవి. ఇవి కాకుండా వీరి నమ్మకాలు సంస్కృతిలో భాగం అవుతాయి

**పుట్టుక :**

కొండరెడ్ల ఇండ్లల్లో గర్భం ధరించినట్లు తెలియగానే ఆ స్త్రీని ప్రత్యేకంగా గుర్తిస్తారు. బలమైన పనులకు వీళ్ళను వినియోగించకుండా తేలికైన పనులను చేసుకోనిస్తారు. పోషక ఆహారం అంటూ ప్రత్యేకంగా ఏమిలేకపోయినా నెలనెలా ఎదుగుదలను కాంక్షిస్తారు. ఆరవ నెలలో సీమంతం చేస్తారు. సీమంతం గర్భస్థ శిశువుకి గర్భ సంబంధ దోషాలను పోగొట్టడానికై చేస్తారు. సమీప బంధువులను పిలుచుకుని పేరంటం చేస్తారు. ఆరోజు బంధువర్గం గర్భస్థస్త్రీకి పండ్లు వంటకాలు తినుబండారాలు పలురకాలు చేసి పెడతారు. నెలలు నిండగానే ఊరిలోని స్త్రీలలో అనుభవజ్ఞురాలైన స్త్రీని పిలిచి తోడు ఉండమని ప్రసవం చేస్తారు. సహజ ప్రసవం అయ్యేట్లు ప్రోత్సహిస్తారు. పుట్టిన బిడ్డకు వెంటనే బొడ్డు కోస్తారు. బొడ్డు కోయడానికి కూసిగా చెక్కుకున్న వెదురు బద్దను వాడుతారు.

పుట్టిన బిడ్డకు వెంటనే స్నానం చేయించరు. పుట్టిన బిడ్డపై చల్లటి నీళ్ళు చల్లుతారు. మరురోజు గోరువెచ్చని నీటితో స్నానం చేయిస్తారు. బిడ్డ పుట్టిన తర్వాత తల్లిని బిడ్డని ప్రత్యేకమైన ఇంటిలో ఉంచుతారు. మంత్రసానినిగానీ అనుభవజ్ఞురాలైన స్త్రీనిగానీ బాలింతకు తోడుగా ఉంచుతారు. తల్లికి బిడ్డకి ఆరోగ్య పరంగా సలహాలను గృహవైద్యాన్ని అందిస్తారని సహాయంగా ఉంచుతారు. బాలింతలను ఇరవైఒక్కరోజులు ఉంచుతారు. కొంతమంది మూడు నెలలుకూడా ఉంచుతారు. దీన్ని కీడుపాక అంటారు. పురుడును కొంతమంది తొమ్మిదవరోజు చేస్తారు. నెలరోజులలోపు ఏరోజైన పురుడు చేస్తారు. సరిరోజు పురుడు చేయరు. పురుడురోజున బాలింతను కీడుపాకనుండి తీసుకువచ్చి తల్లీబిడ్డలను ఇంటికి పిలుచుకుంటారు. ఆ రోజున సమీప బంధువులను పిలిచి పేరంటం చేస్తారు. ఆ రోజున బిడ్డకి పేరు పెడతారు. పేరుపెట్టేరోజున పొద్దున్నే పురిటి అంటు(మైలు) తొలగించడంకోసం తల్లికి బిడ్డకు పురిటిస్నానం చేయిస్తారు. తల్లికి బిడ్డకి కొత్తబట్టలు వేస్తారు. పేరంటంలో భాగంగా విందు పెడతారు. విందుకోసం చేసిన ఆహార పదార్థాలను ముందుగా ఒక ఆకులో పెట్టి బిడ్డ తండ్రిచేత నైవేద్యంగా పెద్దలకు పెడతారు. అక్కడనుండి వచ్చి నేరుగా బిడ్డ అరికాళ్ళను పెదాలకు తాకించి పెట్టదలచుకున్న పేరును ఉచ్చరిస్తారు. నైవేధ్యం పెట్టి కుటుంబ సభ్యులు దేవుడిని ఇలా ప్రార్థిస్తారు "నీకు కొబ్బరికాయి బెల్లం బువ్వ పెట్టినాము. సామీ తల్లీ పెద్దలూ వచ్చి కాపాడవలె దండం'' అని ప్రార్థిస్తారు. ఆ రోజు తప్పనిసరిగా కోడిని కోసి కోడి

రక్తంతో కలిపి ముద్ద చేసిన అన్నంతో తల్లీబిడ్డలకు దిష్టి తీస్తారు. మొదటగా బిడ్డతండ్రి ఎంగిలి చేస్తారు. తర్వాత సమీప బంధువులతో కలసి విందుభోజనం చేస్తారు. నామకరణం తర్వాత బిడ్డకు జ్వరంవచ్చి సుస్తీచేస్తే కొండరెడ్ల పూజారైన వెజ్జును పిలిపిస్తారు. అతను చూసి బిడ్డకు పేరుమార్చమని చెపితే మగబిడ్డకుతాతపేరు, ఆడబిడ్డకు అవ్వపేరుపెట్టి పిలుస్తారు.

**రజస్వల :**

కొండరెడ్ల ఆచారాలల్లో యువతి పుష్పవతైతే తమ ఇంటికి దూరంగా ఒక గుడిసె వేసి ముదుసలి స్త్రీ సహాయంతో వారంరోజులు ఇంటికి దూరంగా పెడతారు. దీనిని 'అడవికి పారడం' అంటారు. ఏడో రోజు స్నానం అయ్యాక ఒక కోడిని బలి ఇచ్చి కోడి నెత్తురుతో మైలు తొలగించి ఇంటిలోకి పిలుచుకుంటారు. ఇంటికి పిలుచుకునే రోజున పేరంటం చేసి విందు భోజనాలు ఏర్పాటు చేస్తారు. ఈ కార్యక్రమాన్ని కుండల్లోకి కలుపుకోవడం అంటారు. ఇంటితో పాటు వేరుగా కట్టుకునే ఈ గుడిసెను కీడుపాక అంటారు. ప్రతినెల నెలసరి రోజుల్లో అమ్మాయిలను ఇంటి పనులకు దూరంగా ఉంచుతారు. స్త్రీల బహిష్టు సమయంలో వారి భర్తలకు దూరంగా ఉంచుతారు, పండుగల్లోనూ వేడుకల్లోనూ పాల్గొననివ్వరు. నదిని దాటనివ్వరు. ఇలాంటి సమయాలలో ఇంటిలోని మగవాళ్లు భూమి దున్నవచ్చు కానీ విత్తనాలు వేయనివ్వరు. అంటు పద్ధతిని కుటుంబ సభ్యులందరూ పాటిస్తారు.

**వైవాహిక సంబంధాలు :**

సాధారణంగా కొండరెడ్లకి వావివరుసలకి సంబంధించిన విషయాలలో పట్టింపులు ఎక్కువ. వీరికి వరుసైన వారిని పిలుచుకొనే విధానంలోనూ, సంభాషణల్లో చమత్కారానికి ప్రాధాన్యం ఎక్కువ. ఇంటిపేర్లు ఆధారంగా వారి గత సంబంధాల ఆధారంగా పెళ్లిళ్లు చేసుకొంటారు. ఉదాహరణకి, కెచ్చలవారికి గురుగుంట్ల, పెట్ల, చింతల, సుంట్రు, మాడి, కోట్ల, పల్లాల, వల్లాల వారితో పెండ్లిసంబంధాలు కుదురుతాయి. కెచ్చలవారికి కతల, చెదల, కోరుకొండ, వాల్ల, విద్దే, గుంజారపు, కనబాల మొదలగు ఇంటిపేర్ల వారంతా అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు వరస అవుతారు. వీరు వావివరుసలను ఖచ్చితంగా పాటిస్తారు. ఎవరైనా వావివరుసలను అతిక్రమిస్తే సహించరు. శిక్షలు కఠినంగా వేస్తారు. జరిమనాలే కాదు గ్రామ బహిష్కరణ వంటివి కూడా ఉంటాయి. కొండరెడ్లలో వివాహపద్ధతి ప్రధానంగా మూడురకాలుగా ఉంటుంది. ఇవి 1. బలవంతపు వివాహం, 2. మొగనాలు వివాహం (పారిపోయి పెండ్లి చేసుకోవడం) 3. పెద్దలు కుదిర్చిన వివాహం. వీరికి బహుభార్య విధానం ఉంది. అంతేకాదు చనిపోయిన సోదరుడి భార్యను వివాహమాడటం, విడాకులు మొదలైనవి వీరి ఆచారాలు. అలాగే ఇల్లరికపు వివాహపు పద్ధతిని కూడా ఆదరిస్తున్నారు. వివాహమైన స్త్రీని ఇంకొకరు లేపుకుపోతే కులతప్పు పెట్టి పెళ్లి ఖర్చులు ఆమెనుంచి వసూలు చేస్తారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలకు సారాయితో విందు

చేస్తారు. దానితో ఆమె నూతన వరుడికి చట్టబద్ధంగా భార్య అవుతుంది. పెండ్లిండ్లు సాదాసీదాగా జరిగినా వారి ఆర్థిక పరిస్థితిని బట్టి ఖర్చు ఉంటుంది. మేనరికం వివాహాలు జరుగుతాయి. మేనత్త మేనమామ పిల్లలు వరుస అవుతారు. మేనమామతోనూ, మేనకోడళ్ళతోనూ పెండ్లిండ్లు జరుగుతాయి. పెద్దలు కుదిర్చిన వాటిలో అబ్బాయి కుటుంబం అమ్మాయి కుటుంబానికి ఓలి కట్టాలి. కాని నేడు నాగరికసంస్కృతీ ప్రభావంవల్ల ఆడపిల్లలనుంచి కట్నాలు అడుగుతున్నారు. అది ఎంత అనేది వారి ఆర్థికస్తోమతనుబట్టి ఉంటుంది. సాధారణంగా పెండ్లికొడుకు ఇంటిదగ్గరే పెండ్లి జరగాలి. కానీ ఇటీవల కాలంలోAZx పెండ్లికూతురి ఇంటివద్దకూడా జరుగుతున్నాయి. వీరిలో తాళి కట్టే ఆచారం ఉంది. కొండమీద నివసించే కొండరెడ్లు పెళ్లి పీటలపై పసుపుకొమ్ము కడతారు. తర్వాత కాలంలో వారి ఆర్థికపరిస్థితిని బట్టి వెండితోగాని, బంగారంతోగాని మాంగళ్యాలు చేసుకుని మార్చుకొంటారు, ఈ సందర్భంగా డోలు వాయిస్తారు. స్త్రీలు పాటలు పాడుతారు. కాని గోదావరి ఒడ్డున సరిహద్దు ప్రాంతాల్లో ఉండే కొండరెడ్లు పెళ్ళికి మైకులు, వీడియోలకి అలవాటుపడుతున్నారు. పెళ్లి సందర్భంగా భోజనాలు పెట్టడానికి ఒక ప్రత్యేక పద్ధతిని అవలంభించేవారట. అదేమంటే ఎవరి ఇంట్లో పెండ్లి జరుగుతుందో వాళ్ళ ఇంటిలో పండిన జొన్నలను పసుపు కుంకుమలతో అలంకరించిన గంపల్లో పోసి ఒక బండి కాడికి ఇరుపక్కల రెండు గంపలను కావడిలాగా కట్టి మగపిల్లవాడి భుజాన వేసి పంపిస్తారు. అతను

ఊరిలోని ప్రతి ఇంటికి వెళ్లి తలా కొన్ని లెక్కన జొన్నలు పంచి పెడ్తారు. పంచిన జొన్నలను ప్రతి ఇంటివారు దంచి వండి ముద్దలుగాగాని, రొట్టెలుగాగాని చేసి పెండ్లింటికి పెండ్లిరోజున పట్టుకురావాలి. పెండ్లి ఇంటిలో కూరలు చేసి ఉంచుతారు. వీటితో పెండ్లివిందు ఏర్పాటు చేస్తారు. కాస్త పేదరికంతో ఉండే వారి ఇండ్లల్లో పెండ్లి జరిగితే ఊరివాళ్ళందరూ వారివారి ఇండ్లల్లో ఉన్న వస్తువులతో రొట్టెలు అన్నం వండి పెండ్లి ఇంటికి పట్టుకు వచ్చి ఇచ్చేవారు. వాటిని అన్నింటిని ఒక దగ్గర చేర్చి వచ్చిన చుట్టాలకు పెండ్లి విందు పెట్టేవారు. పెండ్లి భోజనాలు అయ్యాక సారా తాగే కార్యక్రమం తప్పనిసరిగా ఉండాల్సిందే.

**మరణం :**

చనిపోయిన వ్యక్తి బంధువులందరికి సమిష్టిగా కబురుచేసి పిలుస్తారు, శవాన్ని మోసేటప్పుడు కాళ్ళను ముందువైపు ఉంచి తీసుకుపోతారు, ఎందుకంటే వారి జననం సూర్యుడు ఉదయించే విధంగా ఉంటుందని నమ్ముతారు. చనిపోయిన వ్యక్తికి శవముద్దవేసిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తారు. వీరి ఒలుకుల్లు(శ్మశానం) గ్రామానికి తూర్పు వైపునా ఉంటాయి. నలుగురు వ్యక్తులు నాల్గువైపులా కట్టేసి వున్న 4 కాంజుల సహాయంతో మోసుకుపోతారు. దీనిని కాంజులుపాడే అంటారు. పెండ్లయినవారు చనిపోతే దహనం చేస్తారు. పెండ్లికానివారు చనిపోతే ఖననం చేస్తారు. శవయాత్ర అనంతరం స్నానాలు చేస్తారు. ఆ తర్వాత 3వ రోజు దినం చేస్తారు. అంత్యసంస్కారాల అనంతరం అంటే పెద్దకర్మ తర్వాత

విందు చేస్తారు. మృతుని భార్య పుస్తెలు, నగలు తీయించి చితిమీద వేస్తారు, ప్రతి ఒక్కరు ఓ రాగి కానీని చితిమంటలో వేస్తారు.

**పండుగలు :**

వీరు పంట పక్వానికి వచ్చేవరకు అక్కడే చేను పాకల్లో ఉండి కోతల సమయంలో కొండ దేవరకి కోడిని కోసి ఓరెం (నైవేధ్యం) సమర్పిస్తారు. దీనిని కొత్తల పండుగ అంటారు. ఇలా మొదలుకొని ఫిబ్రవరి-మార్చ్ నెలలో మామిడికాయ పండుగ అడవిలో జరిగే వాతావరణ మార్పుల ఆధారంగానే మామిడి పూత పూసిన నాటినుండి కోతల సమయంలో జరిగే వివిధ పంటల పరిణామాన్ని ప్రకృతి ఆధారంగానే కాలనిర్ణయం చేస్తారు. ఈ సందర్భంగా జరిగే పండుగలు మామిడికాయ పండుగ మొదలుకొని గంగాలమ్మ, కాటమయ్యపండుగ(వేట), బండి కొలుపు(ముత్యాలమ్మ), వానదేవుడిపండుగ, రేవు(వెదురుతెప్ప కట్టడానికి)పండుగ, కొండదేవుడిపండుగ ఇలా వేరువేరు పంటల ముందు, కోతల ముందు పండుగలు జరుపుకుంటారు. అలాగే నూకాలమ్మ(గ్రామదేవత), సింగారమ్మ(కుదురు దేవత)కి అంటు రోగాలనుండి కాపాడటంకోసమై కొలుపులుచేస్తారు. ఇలా వీరి జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలకి సంబంధించిన పండుగలలో ప్రకృతిని తృప్తి పరచడానికి బలులు ఇస్తారు. బలి రక్తం విత్తనాలపై చల్లితే పంటలు బాగా పండుతాయని వారి నమ్మకం.

**నృత్యం :**

ఈ పండుగ సందర్భాలలో దేవతలకు బలులు అర్పించే సమయాలలో డప్పు వాయిద్యాలతో శబ్దాలకు అనుగుణంగా (డోల్లు, ఔజాలతో)నృత్యాలు చేస్తారు. వీటిని మామిడికాయ నృత్యాలని వ్యవహరిస్తారు. ఈ సాంప్రదాయ నృత్యాలకు అవసరమైన వాయిద్యాలను వీరే తయారు చేసుకుంటారు. స్త్రీలు అడవి గుచ్చకాయతో తయారుచేసిన గిల్లికాయ గజ్జెల నినాదంతో నృత్యంలో పాల్గొంటారు. ప్రారంభంలో వాయిద్యాలు నెమ్మదిగా వాయిస్తారు. వీటిలో సాముహిక నృత్యం, పురుషుల నృత్యం విశిష్టమైనవి, అర్ధరాత్రివరకు ఆడిపాడి విందులు ముగించి మరలా ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మను, కొండ దేవతలను ఆహ్వానిస్తారు. ఈ ఆటపాటలు కొండరెడ్లకు ఎంతో ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని కలిగిస్తాయి.

**నమ్మకాలు :**

కొండరెడ్లు అడవులలో నివసిస్తుండడం వల్ల నీటి ఎద్దడి కారణంగా లోతట్టు ప్రాంతాలలోని కాలువ నీళ్లు, గోదావరిలోని అశుభ్రమైన నీరు త్రాగటం మూలంగా రోగాల బారిన పడుతుంటారు, అలాంటప్పుడు సరైన వైద్యం అందక ఎవరైనా మరణిస్తే చేతబడి చేశారని భావిస్తారు. పంటలు వేయడానికి ముందు భూమి పూజ చేయకపోతే అడవి జంతువులన్నీ వచ్చి పంటను నాశనం చేస్తాయని నమ్మకం. భూమి పూజ చేయడంవల్ల

శక్తి దేవతలు పంటలను కాపాడుతాయని నమ్మకం. పొలంలో విత్తనాలు జల్లెముందు  బలి ఇచ్చిన జంతువు రక్తంతో విత్తనాలను తడిపి చల్లితే పంట బాగా వస్తుందని నమ్మకం. తాయెత్తులు, రక్షరేకులు కట్టుకోవడం వల్ల దుష్ట శక్తుల బారినుండి కాపాడబడతారనే నమ్మకం. మూలికా వైద్యం మీద వీరికి అపారమైన నమ్మకం. వీళ్ళు గురువుగా భావించే 'పెజ్జు' రోగానికి కారణాన్ని వివరించి నివారణోపాయం సూచిస్తారు. తెగ సంస్కృతికి విచ్ఛిన్నం జరిగే పనులు తెగలోని వారు ఎవరైనా చేస్తే దాని పర్యవసానంగా రోగాలు, అవరోధాలు జరుగుతాయని నమ్ముతారు. వీటికి విరుగుడుగా దేవతలకు బలులు సమర్పించడం వల్ల దోషాలు నివారణ పొందుతాయని బలీయంగా నమ్ముతారు. ఇలాంటి నమ్మకాలు అనేకం ఉన్నాయి.

కొండరెడ్లు పేరుకి మాత్రమే కొండల్లో నివసించే ప్రాచీన తెగగా పరిశోధకులు గుర్తించారు కానీ నిజానికి వీరి జీవన శైలిని ప్రత్యేకంగా దర్శించి పరిశీలన చేస్తే తర తరాలుగా ఉన్న వీరి జీవన విధానంలో అనేకమైన ప్రాచీన అర్వాచీన నాగరిక చిహ్నాలు కన్పిస్తున్నాయి.

# రెండవ అధ్యాయం

## కొండరెడ్ల మౌఖిక సాహిత్యం – కుటుంబజీవనం

భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రాచీన కాలంనుండి సమిష్టి జీవన విధానానికే ప్రాధాన్యతనిచ్చి కాపాడుకుంటూ వస్తున్నదనీ, ఎన్ని తరాలవారు జీవనం సాగించినా ఎంతమంది ఉన్నా ఒక ఇల్లు ఒక వంట అని జీవనం సాగించడం ఒకప్పటి భారతీయ విధానమనీ కొనియాడుతాం. కానీ ఎంతో ప్రాచీనులని గుర్తింపు పొందిన కొండరెడ్ల జీవన విధానంలో ఈ విధానం కన్పించదు. వీరి కుటుంబ వ్యవస్థ నాగరిక సమాజంలోని వ్యష్టి కుటుంబ వ్యవస్థలా కన్పిస్తుంది. కొండరెడ్లు తమ బిడ్డలకు వివాహం చేసినవెంటనే దంపతులకు వేరుగా ఇల్లు కట్టించి అందులో కాపురం పెట్టిస్తారు. కానీ కొండరెడ్ల  జీవనవిధానం మాత్రం అనేక సందర్భాల్లో సమిష్టి జీవన రీతితో నిండి ఉండడం విశేషం. విశేషమైన ఏ చిన్న సందర్భం జరిగినా బంధువులంతా సమిష్టిగా కూడి విందు వినోదాలు జరుపుకుంటారు.

**సమిష్టి జీవనం:**

సమాజ నిర్మాణంలో కుటుంబం భాద్యతాయుతమైంది. సమాజ సంబంధిత ప్రతి అంశం కుటుంబంతో ముడిపడి ఉంటుంది. సామాజికశాస్త్ర అధ్యయనంలో కుటుంబమే ప్రథమ సామూహిక సంబంధానికి మూలకమైంది. కుటుంబ జీవనంలో సమానోద్దేశ్యాలు, అన్యోన్యాశ్రయం అలరారుతుంది మానవ సమాజంలో ప్రతి మానవునికి మొదటి సంబంధం కుటుంబంతోనే మొదలవుతుంది. ఆతర్వాతే సమాజ సంబంధం. కొండరెడ్ల మౌఖిక సాహిత్యం పరిశీలించినపుడు సమిష్టి జీవనంకే ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చిన అంశాలు కనబడుతున్నాయి. వీరు వ్యవసాయం చేసినా, వేటకు వెళ్ళినా, విందులు- వినోదాలు చేసుకున్నా ఒక సమిష్టి వ్యవస్థ కనబడుతుంది.

‘‘....కొండ కొనల మీద వుంటిమన్న ---పోడువ్యవసాయం చేస్తామన్నా---

‘‘....మరిగిలవారు మామిద్దరు –మంచి మంచి విండ్లావారు

తగ్గివారు తండ్రిద్దరు - తగరపువిండ్లవారు

జోడు విండ్లు జోడించుకొని - బోలకొండ వేటకువేళో...........

‘‘ముత్యాలమ్మకి సందడి చేద్దాం రండి ఓ గోవులారా

గుబ్బట్లకి పిలుచుకురండి ఓగోవులారా

డొల్లు ఔజాలు తెచ్చుకురండి ఓగోవులారా

గుబ్బట్లతోని కలసి ఎగురుదాము ఓ గోవులారా "||వేలేలేలన్న||

**ఉమ్మడి కుటుంబం**

ప్రాచీన వ్యవస్థను తలపిస్తున్న కొండరెడ్ల కుటుంబ జీవన విధానంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనబడుతుంది. అత్తమామ, తోటికోడళ్లు, మరదళ్లు, చెల్లెళ్లుతో నిండిన జీవనం ఈ పాటలో కనబడుతుంది.

"అత్తమామ లెరుగకుండ- అంటివన్నె చీరగోన్నమా

తోటికోడలెరుగకుండా-తొగరువన్నె చీరగోన్నమా

గంత కోడలెరుగకుండా-గాగావన్నే చీరగోన్నమా

చెల్లెలు మరద లెరుగకుండ-సెనగపూవురైకగోన్నమ్మ"

-----------------------------------

"అత్తమామ సంతకేడితే – చీరలు టివ్వుటివ్వు"

"అత్తమామ మాటలకూ –ఈతపేనం తేలిపోయే"

**భార్య-భర్త :**

కొండరెడ్లలో ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ సంస్కృతిలో ఉన్నప్పటికీ ఇప్పుడు వివాహానంతరం దంపతులను వేరుగా మరోఇంటిలో జీవనం సాగింపజేస్తున్నారు. కొత్తగా పెండ్లయిన వారికి ఇతరులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు.

“ఎర్రి నేను కర్రలకు పోగా – ఎర్రి మొగుడు నాకే నమ్మడా

నమ్మకుంటే – నా  వెంట రావోయా”

“చాకితా చాకితా ఒయీ చాకితా

చాకితా నీ మొగుడు - చలి కూటి వాడు

చలి కూటి వాడు కాదురో - పులి కూటి వాడు”

**తాత**

ఉమ్మడి కుటుంబంలో ఇంటిపెద్ద తాత. ఆయన తరువాతే తక్కినవారు. అమ్మమ్మ, తాతయ్య, నానమ్మ అన్నా పిల్లలకు సరదా. పిల్లల అవసరాలు తీర్చడమే వీళ్ళపని తాతయ్య మల్లెచెట్టు వేయించి పూవులు పూయించినట్లు పాట.

“....మల్లెలకు మాతాత –కోట కట్టించాడో

కోటలో పుట్టింది –చేరింత పువ్వు

చేరింత పువ్వుకు –చెరువు తోలించు.

మరో సందర్భంలో ఇతరుల ఎద్దులు వచ్చి నీళ్లు తాగేస్తుంటే తాతగారి ఎద్దు వచ్చి కుమ్మిందని, మామయ్య వాళ్ళ ఎద్దు వచ్చి మంత్రించిందని, బావగారి ఎద్దువచ్చి బాగుచేసిందని తెలిపే చరణాలు

:........నాఎద్దు   నీ  ఎద్దు నీళ్ళకెళ్ళింది –

తాతగారెద్దొచ్చి తగుల బొడిచింది

మామగారెద్దొచ్చి మంతరించింది

బావగారెద్దొచి బాగుచేసింది ....

ఊరిపెద్దయిన తాతను అందరూ పటేలు అని పిలిచే ఆచారం కొండరెడ్లలో ఉంది. ఊరికి పెద్దయినా మనవడికి తాతే కదా. కొండరెడ్లలో తాతని బుడ్డాడు అంటారు. ఈ అంశంతో తులసి చెట్టును బుడ్డాడు వేసినట్టున్న పాట

"....నీళ్ళ కుండల కాడ తులసి నిన్నెవరేసే తులసి ..."

ఎవరేసేనంటే తులసి పటేలు బుడ్డాడు వేసేడు

తులసి పటేలుబుడ్డాడు వేసే తులసి ---"

"తాతవారి భూములు కొలువు సంబురాలు

....తాత సుంకమ రాజు చూసి రావాలె ...

....ఎగురుతున్నాడ తాత సుంకమ రాజు ....

....కొలువులు సాగేవి తాత సుంకమ రాజు ... "

"మల్లెలకు మా తాత కోట కట్టాడో

కోటలో పుట్టింది చేరింత పూవు"

అని కోటలుకట్టినట్లు, పూలవనాలు వేసినట్లు తాతల ప్రస్తావనలు.

**అవ్వ:**

కొండరెడ్లలో అవ్వని బుడ్డి అంటారు. బుడ్డాడి భార్య బుడ్డి. బుడ్డాడు అంటే తాత. బుడ్డి అంటే అవ్వ. తాత తులసి చెట్టు వేస్తె అవ్వదానికి నీళ్లు పోసి పెంచినట్లు తెలుపుతున్న చరణాలు.

"...నీళ్ళేవరోసెరంటే తులసి-పటేలుబుడ్డి పోసే తులసి---"

మరో గేయంలో అవ్వలంతా కూడుకొని చేపల పులుసుగురించి చర్చించుకొన్నట్లున్న చరణాలు.

"....బుడ్డి బుడ్డి కూడుకొని – బుర్ర చేపల పులుసు గోలయా----"

**తండ్రి**

తాత తర్వాత తండ్రి ఇంటిపెద్ద. తల్లి బిడ్డదగ్గర లేనపుడు తండ్రి ఓదారుస్తున్న తీరుతోగల పాట చరణాలు కరుణరసాత్మక హృదయాన్ని కదిలింపజేసే భావన..

"మీ అమ్మ లేదు –మీ నాన్ననున్నాను కదరా

ఆటలెన్నో ఆడించాను –పాటలెన్నో పాడించినానుగా ......."

"మరిగెల వారు మామిద్దరు – మంచిమంచి విండ్లవారు

తగ్గి వారు తండ్రిద్దరు తగరపు విండ్లవారు...."

**తండ్రికొడుకులు :**

వేసిన విత్తనాలు పండి అనుకున్న మోతాదు పంట చేతికి రాకపోతే రైతు బాధ చెప్పనలవికానిది. పెత్తనం చేసే తండ్రి వేసిన చేను పండలేదని కొడుకులు నిందిస్తారని బాధ పడుతున్న తీరులో తండ్రి కొడుకుల మధ్య బంధంలోని జవాబుదారీ తనం కన్పిస్తుంది

"కొసరికాయ తుంబ నిండకున్నదట

నా కొడుకులేమో కొడుతురు తిడుతురు

ఏమి మాయ జేస్తివి ...."

"కొడుకు పేరు సోమిరెడ్డి .."

**తల్లి :**

బిడ్డ దగ్గర తండ్రిని పెట్టి తల్లి పనికి వెళుతుంది. రావడం ఆలస్యం కావడంతో బిడ్డ చిడి పెట్టసాగింది. ఏడుస్తున్న బిడ్డని అమ్మ వచ్చేస్తుంది, ఏడవకు బజ్జో అని తండ్రి లాలిస్తున్న చరణాలు

"మీ అమ్మలేదు –మీ నాన్ననున్నాను కదరా

..............................................................

అమ్మ పనికి పోయిందినాని –ఆలస్యంగా వస్తుంది నాని "

అదే విధంగా మరో పాటలో పెండ్లిలో పెండ్లికూతురు అత్తవారింటికి తెచ్చు సారేలో పెండ్లి కుమారుడి తల్లికి చీరలు ఉండాలి. అవి తెచ్చారో లేదో

అని పరిశీలిస్తున్నారు పెండ్లి కొడుకు తరుపువారు ఈ పాటలో

“కాటిక గందము ఉన్నవో లేవో

తల్లికి తలకట్టు చీరలున్నవో .............”

**పినతల్లి :**

నాన్నకు తమ్ముడి భార్యను, అమ్మకు చెల్లెలును పినతల్లి, పిన్నమ్మ, చిన్నమ్మ అనే వరుసలతో పిలుస్తారు. అలాగే తల్లికి సవతి కూడా బిడ్డలకు పినతల్లి అవుతుంది. ఈ వరుసలతో కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోని గేయ సాహిత్యంలో పలు సందర్భాల్లో చరణాలు కన్పిస్తున్నాయి .

“బొట్టుకు పోతున్నామో పినతల్లి కోకిరి మండె కూరలంక –కట్టిరాళ్ళ ఘాటీ “

లిక్కుల పిన్నమ లివ్వల పిన్నమ – లివ్వాలెందు జల్లుకున్నావా

“తేరంకొండ చిన్నమ్మ నువ్వు తప్పక రావాలి

రాజు కొండరాజు కూతురా నువ్వు రావాలమ్మా”

భార్య చనిపోతే భర్త రెండో పెళ్లి చేసుకున్నప్పుడు మొదటి భార్య పిల్లలకి రెండో భార్య పినతల్లి అవుతుంది. ఆ బిడ్డలు అనాధలు కాకుండా ఉండడంకోసం రెండో పెళ్లి చేసుకున్నప్పటికీ ఆ బిడ్డల మనస్సులో తల్లిలేని వెతల పిన్నమ్మ దగ్గర దొరకని అనురాగంతో పిల్లలు బాధపడుతుంటారు.

ఈ పాటలో కూడా కన్నతల్లి సాటివి  కావు పినతల్లి పిలుపులు అంటున్నారు.

"ఈ వోలు వోయ్యంగా ఎవ్వరిని పిలుతు

కన్నత్త  సాటివో పిన్నత్త  పిలుపు .

ఈ వోలు వోయ్యంగా ఎవ్వరిని పిలుతు

కన్నతల్లి సాటివో పినతల్లి పిలుపు ......."

**కూతురు :**

కూతురు ఇంటికి లక్ష్మీదేవితో సమానం. ప్రతి పనిలోనూ తన ప్రమేయం ఉంటుంది. ఇంటి ఆడపడుచుకు మిక్కుటంగా ప్రాధాన్యత ఇవ్వడం తెలుగు వారి ఆచారం.

"...............కూతురి పేరు గుబ్బలమ్మ'

"రాజు కొండరాజు కూతురా నువ్వు రావాలమ్మా"

**అన్నదమ్ములు**

తల్లిదండ్రులతర్వాత అన్నదమ్ములు ఇంటికి ఆదరువులు. అన్నదమ్ముల అన్యోన్యతలు ఒకప్రక్క, దాయాది మాత్సర్యం మరోప్రక్క నిండి ఉంటుంది. అన్నదమ్ముల దయాదాక్షిణ్యాలు అక్కచెల్లెళ్లు సదా కోరుకుంటారు. అన్నల వెన్నులో చీమలాగా,  తలలో పేనులాగా ఒదిగి

ఉంటామంటున్నారు అక్కాచెల్లెళ్లు ఈ పాటలో.

"చిన్నన్న వెన్నులో –చీమనై దాగుదును

పెద్దన్న వెన్నులో –పేనునై దాగుదును "

మరో గేయంలో

"ఆకులున్నవి  తీగలమీద అన్నలున్నారు బోయలు  మిం దోయా

అన్నదమ్ములు పెండ్లి తోగరియ్యి రావి ........."

"అకులూరు అంగటి వారు అన్నదమ్ముల పెండ్లి వారోయా..."

"దయగల్ల తమ్ములైతే దండె కట్ల తాప తేరో"

"ఎంత దంపిన దంగరి జొన్న – పెద్దన్న పెండ్లి జొన్న"

**చెల్లెలు**

చెల్లెలును తమ ప్రాంతానికి దూరంగా మరో ప్రాంతపు అబ్బాయికిచ్చి పెండ్లి చేశారు. వేరే ప్రాంతానికి ఏడుస్తూ వెళుతున్న చెల్లెల్ని అన్న ఒదారుస్తున్నాడు

"దగ్గరి ఊరైతే అమ్మ తరుపు బందువర్గ – బాధల్లేక ఉండే దానివో

దూర దేశం మనవారిచ్చిరి –దు:ఖ పడకు చెల్లెలమ్మ

మారుదేశం మనవారిచ్చిరి –మాటపడకు చెల్లెల్లమ్మా ......"

**కొడుకు-కోడలు**

తల్లిదండ్రులు సాధ్యామైనంత వరకు కూతురు అల్లుడు ఇండ్లకు వెళ్లి నిలవరు అలా నిలిచి ఉంటే ఊరివారు అపహాస్యం చేస్తారని తమ గౌరవ ప్రతిష్టలకు భంగం కలుగుతుందని ఎంత ఉన్నా లేకున్నా కొడుకు కోడలు దగ్గర ఉండటమే క్షేమం అనుకుంటారు, ఈ అంశం తెలుపు పాట.

"దూరపు చుట్టాలు మేలు  దూల దామ పప్పు మేలు

కొడుకు కోడలు మేలు –కొనగంది పప్పు మేలు ........."

"మరదండ్ల పెళ్ళికి మల్లెల్ల రావి - కోడండ్ల పెళ్ళికి కొమ్మల్ల రావి"

**కోడలు –తోటికోడలు**

కోడలు తోడికోడలు ఇద్దరూ వాళ్ల ఇండ్ల నుండి పరాయి యైన మగని ఇంటికి వచ్చేవారే. మగని ఇంట వీరిద్దరూ తోడికోడళ్ళు అవుతారు. అక్కచెల్లెళ్ళ వరసతో అన్యోన్యంగా ఉండమని కోరినా ఉండలేరు. ఎప్పుడూ ఒకరిని చూస్తే ఒకరికి పడదు. ఈర్ష్య అసూయలకు ఆలవాలం.  ఉప్పు నిప్పులా వ్యవహరిస్తూ కుటుంబంలో చిరాకు పుట్టిస్తుంటారు.

" చల్ల కోలాట వేయవాలె కో....కోడలమ్మ

చల్ల కలుపులు కలపవాలెయా..."

"పులి కాదో వెలుగు కాదు కోడలా

పూరి పిట్టల పేటలాడోయా....

"దొడ్డిలోని దోసపండుకో –కోడలమ్మా

దూరిరాగదోసాలోడ్డునా ....."

"సామపంట కే సేనోస్తనత్తో చందమామ

నీవొద్దుకోడలా నీకూతురిని పంపు చందమామ

గైరి పిట్ట కన్నులదానా కొ

కోడలమ్మా కారు పంది ముక్కు దానవా

ఈ రావి యారావి మట్టెల్ల రావి –

తోటికోడలు పెండ్లి తోగార్యయు రావి ........"

"కోడండ్ల పెళ్లికి కొమ్మల్ల రావి....."

"దారకొండ  సన్నాసి దొర కో.....

కోడలమ్మా డేరావేసి దక్కీ కొట్టిదా

సారుకూర చలవచేసి కో.....

కోడలమ్మా బడ్డికింద బసవేసిరా "

**బావ-మరదలు**

బావా మరదళ్ళు ఒకరినొకరు అన్యోన్యంగా మేలమాడుకుంటారు.

ఒకరంటే ఒకరికి ఇష్టమున్నా ఎప్పుడూ పోట్లాడుకుంటుంటారు. హాస్యఛలోక్తులతో ఒకరి మీద మరొకరు విసుర్లు జల్లుకుంటారు. వీరి ఇద్దరి అన్యోన్యత మధ్య సాగే విరుపు సలుపు ఇంటిల్లిపాదికి ఆనందదాయకం.

"...... చుట్టాల బియ్యం

"అన్నలున్నారు బోయల మీద

మరదండ్లున్నారు మిద్దెల మీదోయా"

"గంటె కర్ర గలగలమనగ - గయ్యాలిదో మామ కూతురు

సిప్ప కర్ర సిట సిట మనగ – చిన్నెలదో మామ కూతురు

చోడి కర్ర జొటజొట మనగ – సోకులదో మామ కూతురు "

**బావ :**

బావమరదండ్ల సరసం చిన్న వయస్సు నుండే సాధికారికతను కోరుతుంది. చీటికిమాటికి సమయం దొరికినపుడల్లా సరసానికి దువ్వుతుంటారు బావలు. తప్పించుకు తిరగడం మరదళ్ల అవస్థ. ఈ అంశంతో అనేక సందర్భాలున్న చరణాలు కన్పిస్తున్నాయి.

"వద్దుర గుంటడ వరుస లేదు లేదు

లేదురా బావా లేత పాయమురా"

"తీగె పోసో విసరబోగా తిలుపురు

తివురు లడిగేవా తీపుతీపుకు

వద్దురా బావా వరుస లేదు

లేదో బావా లేత పాయమా''

''మామ గారేద్దోచ్చి మంతరించింది

బావగారి ఎద్దొచ్చి బాగు చేసింది ''

**వదిన :**

అన్న భార్య వదిన. మరదల్లు వదినకు కాపు. ప్రతి చిన్న పెద్ద విషయాలలో జోక్యం చేసేసుకుని ఆటపట్టిస్తుంటారు.

''నడుము సన్నం నాగబంధం తగిలి పొడిచింది పిగినిపిట్ట

మరదలిని మన్నిందాము వదినగారు పెండ్లి కూతురు''

**మరిది :**

భర్తకు తమ్ముడు మరిది వరస అవుతాడు. మరిదికి వదిన తల్లి తర్వాత తల్లితో సమానంగా భావిస్తారు. ఇంటికి వచ్చిన కోడలుకు భర్త దగ్గర కన్నా మరిది దగ్గర స్వేచ్ఛ చనువు ఎక్కువ. మరిది చేష్టలను వదిన ఒక కంట కనిపెడుతూ ఉంటుంది.

''నూనె కొప్పుల పొన్న చిలుకా - తలపాగల జంగమయ్యా

చిన్నబోయిన చిన్న మరిది - సంతలోని సావాసాలు''

"బట్టలన్నీ బయట వేయగా బాల మరిది వెంట వచ్చే

చిన్న మరిది వెంట బోయి చీరలకు గుంజ బోగ

చీరల చినుకు  దగిలి చిన్న మరిది సిన్నబోయె"

**మేనమామ**

మేనమామ తండ్రితో సమానం అంటారు. మేనమామల పంచ మేనల్లుళ్ళకు గాని, మేనకోడళ్ళకు గాని చనువుతో కూడిన నిలయం. ఇలాంటి చోట వచ్చిన బావలను, మరదళ్ళను మామ పిల్లలు ఏడిపిస్తుంటారు. ఆ భాగ్యానికి  నోచుకోని ఓ అమ్మాయి వేరే ఊరికి కోడలవుతుంది. అక్కడ తనను అదుపు చేయను మేనమామలు  లేరే అని అంటుంది.

అందానికో మేనమామ బొందులిచ్చో నన్నెకొన్నడు

బులుపులకో మేనమామ బొమ్మలిచ్చో నన్నెకొన్నడు

మెప్పులకో మేనమామ మాడ లిచ్చో నన్నెకొన్నడు

దరువులకో మేనమామ డాబాలిచ్చో నన్నెకొన్నడు

**మేనరికం**

మేనరికం వ్యవస్థ ద్రవిడ సంస్కృతిలో భాగం. ఆ వ్యవస్థా మౌఖిక సాహిత్యంద్వారా కొండరెడ్లలోకూడా ఉన్నదని తెలియజేస్తున్నాయి

చరణాలు, మేనబావ చెంగున సెనగలు కట్టి కొంగున కొబ్బరి కట్టి కోరి వచ్చాడని తెలుపుతున్న అంశం.

‘‘చెంగున సేనగలుకట్టి చేరి వచ్చెడి మామయ్య కొడుకు

కొంగున కొబ్బరి కట్టి కోరి వచ్చెడి మామయ్య కొడుకు ............’’

అలాగే మామ కూతురు మరదలు వరుసవుతుంది. మేనబావలు మరదలితో సరసమాడ ప్రయత్నిస్తుంటారు. మేనబావంటే ఇష్టమైతే ఆ సరసాలకి అంతు పొంతు ఉండదు. అలాకాకుండా మేనబావంటే ఇష్టం లేకుంటే అప్పుడు మరదలి గయ్యాలితనం మామకొడుకును తరుము కొనేదాకా వస్తుందనే అంశంలో గేయం.

‘‘గంటె కర్ర గల గల మనగ- గయ్యాలిదో మామకూతురు

సిప్ప కర్ర సిట సిటమనగ – చిన్నెలదో మామకూతురు

చోడికర్ర జోటజోటమనగ – నోకులదో మామకూతురు....’’

‘‘ అత్త కూతురు రుచ్చల బాల  ఉత్తకిచ్చిన వల్ల నేనోల్ల

**అత్త :**

తండ్రి చెల్లెలు మేనత్త అవుతుంది. అలాగాక మేన మామ భార్య అత్త అవుతుంది. లేదా భార్య  తల్లి భర్తకు  అత్త అవుతుంది. లేదా భర్తకు తల్లి భార్యకు అత్త అవుతుంది.

“అత్త పేరు ఆకు చిలక”

**అత్త మామ :**

కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలో అత్తమామలపై ప్రత్యక్షంగా చరణాలు రాలేదు గానీ అత్తమామల ప్రస్తావనలు పరోక్షంగా ఉన్న చరణాలు అక్కడక్కడ కన్పిస్తున్నాయి.

“అత్త మామ లెరుగకుండ – అంటి వన్నె చీర గొన్నమా”

“పుట్టింట యున్నప్పుడు పప్పుకూడు భోజనాలు

అత్తమామ లింటికి పోగ – చల్ల లేని పుల్లనంబలి

పుట్టింట యున్నప్పుడు పట్టు చీర కట్టే దానను

అత్తమామ లింటికి పోగ – ఉల్లిపొర బల్లి బందరం”

**అల్లుడు :**

‘అల్లుడ్ని చూస్తే వంకర తాడైనా చక్కంగా నిలుస్తుందని’ సామెత. అమ్మాయిని అత్తగారింటికి పంపిన ఇండ్లల్లోనే ఈ గౌరవం అల్లుళ్ళకి. గత్యంతరం లేకో, తప్పనిసరి అయ్యో అల్లుళ్ళు ఇల్లరికం వెళితే వారి అవస్థ వర్ణనాతీతం. ఈ అంశంతో ఉన్న చరణం

“అల్లుడివైతే గొల్లిగాడి వయితే రారా ఇల్లరికానికి

జాకెట్టు తెచ్చి లంగా లుతికి మడతలు పెట్టి మాయమ్మ కిచ్చే

గొల్లిగాడివయితే రారా ఇల్లరికానికి....”

**వైవాహిక బంధం :**

కొండరెడ్ల ఇంటిలోని ఆడపిల్లకు పెండ్లి చేసి అత్తగారింటికి పంపిన తర్వాత అత్తగారింట ఆ బిడ్డ ఎలా నడచుకోవాలో చెప్పడమే కాక తమ గ్రామానికి వంశానికి ఇంటికి మంచి పేరు తెచ్చేలా అత్తగారింట మసలుకోవాలని చెప్పే పాటలో చాలా దురాన నిన్ను ఇచ్చారని కోప పడవద్దు చెల్లెలా, కొత్త సంబంధం చేశారని బాధపడకు, దూరాబారమని ఎంచకమ్మ చెల్లెలా అని చెప్పి, ఇంకా ఎవరో వస్తారని పొద్దాక ఎదురుచూస్తూ ఉండకు అని చెప్పే పాటలోని చరణాలు

“లచ్చోకోడలయ్యో కోడలా చీరో బాలాకోడలా

కోయదేశం మనవారిచ్చిరి కోపపడదే చెల్లెలమ్మా

నూరుదేశం మనవారిచ్చిరి నూకపడదే చెల్లెలమ్మా

మారుదేశంమనవారిచ్చిరి మాట పడదే చెల్లెలమ్మా

పుట్టలెక్కుచూడమాకు పుట్టింటి వారు దూరమయిరా

మెట్ట లెక్క చూడకు చెల్లెమేన వారే దూరమయిరా

యాయి ఇంటిబాలకు దెచ్చు యాపపడకుదన్నా

నిండినింటి బాలకు దెచ్చు కారాలు యంపకుడన్నా"

కల్లుదాగి వచ్చి భర్త తనను కొట్టాడని అమ్మగారింటికి వచ్చేసిన అమ్మాయిని  అత్తగారింటి దగ్గర గొడవ పడి కాపురం చెడుపుకుని వచ్చిందన్న కోపంతో నానా మాటలు అంటూ ఒకసారి పెండ్లి అయిన ఆడపిల్లకు చావైనా బతుకైనా అత్తగారిల్లె అంటూ 'ఇచ్చినింట చచ్చినట్టు బతకమని' చెప్పే వైవాహిక బంధంలోని విలువలని తెలిపే పాటలోని చరణాలు

"లచ్చోకోడలయ్యో లాలలచ్చిరి బాలాకోడల

కొట్టుచిట్టు కోయ బలకు కోయ నిక్కుమన్నా

నిక్కుమయ్యా కోలాబాలా నిక్కుమాకులయ్యో

జాజిచేక్కలవేసిన కాళ్ళు నందిపేతాతే  నాకే లేదోయో

కాంతా రెడ్డి కల్లుకు వెళ్లి ఇంటికి వచ్చి పిల్లకు కొట్టినా

కల్లుతాగి పిల్లకు కొట్టినా ఇటునేల వస్తివి లంజా

ఇచ్చినింట సచ్చినట్టె బతుకుయా...."

కొండరెడ్ల మౌఖిక సాహిత్యం ద్వార కొండరెడ్ల కుటుంబ జీవన వ్యవస్థను పరిశీలించినపుడు కొండరెడ్ల కుటుంబంలో అవ్వతాతలు కుటుంబ పెద్దరికం వహిస్తారు.  తరువాత ఆ వరుసలో తండ్రి తల్లి, కొడుకులు, కోడళ్లు, మరుదులు మరదల్లు కుటుంబంపై బాధ్యతను కలిగి

ఉంటారు. బావామరదళ్ళ సరసం అందరికీ ఉన్నట్లే కొండరెడ్లలోనూ కన్పిస్తుంది. అన్నదమ్ముల అనుబంధం అప్పచెల్లెళ్ళకు అన్న దమ్ముల అండదండలు, అత్తమామలగతులు, పినతల్లి, తోడికోడండ్లు, మరదండ్ల ప్రస్తావనలు అనేకం ఈ సాహిత్యం పరిశీలించడం ద్వారా కుటుంబంలో వారి స్థానాన్ని తెలుపుతున్నాయి. వివాహం కాగానే ఎవరికి వారు వేరువేరు ఇండ్లల్లో నివసించినా కుటుంబ సంబంధ విషయాలలో ఒకరికొకరు తోడుగా ఉన్న తీరు కన్పిస్తుంది. కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోని కుటుంబ జీవన విధానాన్ని పరిశీలించినపుడు వీరికున్న బంధువర్గ విస్తరణ, బంధు ప్రీతి, బంధువర్గంతో చేసే సంప్రదింపులు, విందులు, వినోదాలు ఇలా అనేక కుటుంబ సంబంధ అంశాలు తెలుస్తున్నాయి. వీటితో పాటు కొండరెడ్ల వైవాహిక సంబంధంలోని బలమైన కట్టుబాట్లు తెలుస్తున్నాయి.

# మూడవ అధ్యాయం

## కొండరెడ్ల మౌఖిక సాహిత్యం – సామాజిక జీవనం

కొండరెడ్లనుండి సేకరించిన మౌఖికసాహిత్యం ఆధారంగా వారి జీవనరీతులను పరిశీలించినపుడు కొండరెడ్ల సమాజంలో కొండలు, కోనలు, వాటిని ఆనుకుని ఉన్న అడవులు వీరి జీవన నివాస క్షేత్రాలుగా కన్పిస్తున్నాయి. వీరికి వ్యవసాయం, పశుపోషణ, వేట ప్రధాన వృత్తులు. ఇవికాక జీవనసౌలభ్యంకోసం అటవీవస్తువులను సేకరించి వ్యాపారం చేసుకుంటారు. వీరిలో గొప్ప ధనవంతులు లేరు. పేదరికమే ఎక్కువగా కన్పిస్తుంది. వీరి జీవనశైలిలో భవిష్యత్ దృక్పథం కన్పించదు. ఒక కారు పంటను తిండికోసం మాత్రమే దాచుకుంటారు. తక్కినవి అమ్ముకుని ఖర్చుపెట్టేసుకుంటారు. పూర్వం పెద్దగా ఆదాయవనరులు లేనందున కావచ్చు, లేదా నాగరిక సమాజానికి దూరంగా ఉండడంవల్ల కావచ్చు వీరిలో తరతరాల ఆస్తిదారులు కన్పించరు. కానీ ఇటీవల కాలంలో ప్రభుత్వ పథకాలవల్ల భూమికి హక్కుదారులు కావడంతో కొంత మార్పు కన్పిస్తుంది. మౌఖిక సాహిత్యం చాలావరకు ప్రాచీనానికి చెందిన

అంశాలతో ఉంటుంది కాబట్టి వీరి మౌఖిక సాహిత్యంలో లభించిన అంశాలతో పరిశీలించినపుడు అడవులు, కొండలు, వ్యవసాయ రీతులు, పండించే పంటలు, నీటి వనరులు నీటిఎద్దడి, వేటవిధానం, వేటాడే జంతువులు, పక్షులు, పశుపోషణ, పశుసంపదపట్ల ఉన్న ఆశక్తి, వ్యాపారం, బేరసారాలు, అలవాట్లు, పేదరికం, ఇంటినిర్మాణం, కుల కట్టుబాట్లు, శిక్షలు, కొలతలు ప్రధానంగా కన్పిస్తున్నాయి.

**అడవులు - కొండలు :**

కొండరెడ్లు అడవులలోనూ కొండల్లోను నివసిస్తుంటారు. కొండలున్న అడవుల్ని నివాస స్థలాలుగా ఎంచుకుంటారు. వీరు కొండలలో అడవులలో నివసిస్తుండడంవల్ల పండించే పంటలు ఎక్కువగా వర్షాధారంగా ఉంటాయి. కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలో వీరి నివాస స్థలాలను పరిశీలించినపుడు కథల్లోనూ పాటల్లోనూ నిండుగా కొండ ఆధారంగా వీరి జీవనం ప్రతిబింబిస్తుంది. అడవిని, కొండని వీళ్ళు తమకు అండదండలనిచ్చే దేవతగా ప్రాధాన్యతనిస్తారు. ఈ అంశాన్ని తెలిపే చరణాలు....

"అడవి తల్లి మాకు అండ అన్నా

అడవి తల్లి వుంటే మాకు హాయి అన్నా"

దేవతలేకాక పూజాపునస్కారాలు చూసే పూజారినికూడా ప్రకృతిని కాపాడమని కోరుతున్నారు ఈ పాటలో ...

“ఏమయ్యో పూజారయ్యా  చల్లంగ రండయ్యా ....

ఏమయ్యో పూజారయ్యో  మెట్టలు గుట్టలు

చల్లంగా చూడండయ్యో.....”  (చిత్రం.1)

**వ్యవసాయం:**

కొండరెడ్ల ప్రధాన వృతి వ్యవసాయం. వీరు వ్యవసాయం చేసే రీతి సాధారణంగా చేసే స్థిర వ్యవసాయ రీతికి విలక్షణమైంది. ఇది స్థిరమైందికాదు. దీన్ని పోడు వ్యవసాయం అంటారు. ఈ వ్యవసాయ విధానంలో నాగలినిగానీ,

దుక్కిటెడ్లనుగానీ వినియోగించరు. సూదిపాటి కర్రలను(కచల్) తయారుచేసి భూమిని పెళ్ళగించి అందులో విత్తనాలు వేసి పంట పండిస్తారు. దీనినే  పోడు వ్యవసాయం అంటారు. పోడుభూమి చదరంగా ఉండదు. ఎత్తుపల్లాలతో ఏటవాలుగా ఉంటుంది. పోడు వ్యవసాయదారుల దగ్గర పెద్దకత్తి, చిన్నకత్తి, కొడవలి, గొడ్డలివంటి పరికరాలే ఉంటాయి. మొత్తం ఆసియా ఖండంలోనే ఇంత మోటు పద్ధతిలో సాగుచేసే తెగ ఇంకొక్కటి లేదని ప్రాచ్యపరిశోధకులు తెలియజేశారు.

కొండల్లో, కోనల్లో, అడవుల్లో వుండే చెట్లను నరికి తుప్పల్ని తగులబెడతారు. వ్యవసాయ యోగ్యంగా మలుచుకొని వ్యవసాయం ప్రారంభిస్తారు. ఈ విషయాన్ని  గేయం తెలియజేస్తుంది. (చిత్రం.2)

"చేను చెలుపో వాలారు మొగ్గ

ఎప్పుడు సెలపంగా సూడ లేదా

కయ్యులు నరుకో వాలారు మొగ్గ

ఎప్పుడు నరుకంగా సూడ లేదా

మంచిదోయ్ కోడలమ్మ - మంచిదోయి కోడలమ్మా"

కొండరెడ్లు తమను తాము తెలియజేసుకుంటూ 'మా జాతి వాళ్ళం కొండకోనల్లో నివసిస్తాం, పోడు వ్యవసాయం చేసుకుంటామని' తెలియజేస్తున్నట్లు ఈ గేయంలోని చరణాలు

"కొండకోనల మీద వుంటిమన్నా

పోడు వ్యవసాయం చేస్తామన్నా ....."

కొండల్లోని చెట్లను నరికి వేర్లను పెకలించి నేలను సరిజేసి జొన్న పైరు వేయాలంటూ గేయంలోని చరణాలు.

"నరకవాలె నరకవాలె ఏమి నరకవాలె దియా

పెద్దాకొండ పెద్దాచేసి పోడు నరకవాలె దియా

ఏరవాలే ఏరవాలే ఏమి ఏరవాలే దియా

పెద్దాకొండ పెద్దాచేసి కయ్యు లేరవాలె దియా

వెయ్యవాలె వెయ్యవాలె ఏమి వెయ్యవాలె దియా

పెద్దాకొండ పెద్దాజేసి జొన్న వెయ్యవాలె"

పోడు వ్యవసాయంలో నేలను నాగలితో దున్నరు. ఎక్కడైతే భూమిలోకి పుల్లలు దిగబడతాయో ఆ ప్రాంతంలోని చెట్లను తుప్పలను నరికి వ్యవసాయం క్షేత్రంగా గుర్తిస్తారు. సన్న పుల్లలను సూదుల్లాగా చేసుకుని పోడు భూమిగా గుర్తించిన క్షేత్రంలో పుల్లలతో గుచ్చి రంధ్రం చేస్తారు. తమ వెంట తెచ్చుకున్న విత్తనాలను ఆ సందుల్లో వేసి మట్టితో కప్పేస్తారు. ఇదే పోడు వ్యవసాయం తొలిదశ. ఈ అంశాలతోనున్న పాటలోని చరణాలు.

"పొడవవాలె పొడవవాలె ఏమి పొడవవాలె దియా

పెద్దాకొండ పెద్దాజేసి సూదు పొడవవాలె దియా"

**భూమి దున్నడం :**

కొండరెడ్లు రెండు రకాలుగా వ్యవసాయం చేస్తారు. ఒక రీతి కొండలపై ఏటవాలు ప్రదేశాలను సరిజేసి చేసే పోడు వ్యవసాయం. మరో రీతి కొండ కింది ప్రాంతాలలో చదునుగానున్న నేలల్లో చేసే వ్యవసాయం. పోడు వ్యవసాయానికి దుక్కి దున్నరు. సమతలంలో చేసే వ్యవసాయంలో దుక్కిదున్నడం వంటి సంప్రదాయ విధానాలు ఉన్నాయి. ఈ పాట వరరామచంద్రాపురం మండలంలో సేకరించడం జరిగింది. అక్కడ చదునైన ప్రదేశంలో పొలం ఉంది. కాబట్టి ఇక్కడ దుక్కి దున్ని పొలం పనులు

ప్రారంభిస్తారు. తొలకర్లు ప్రారంభంకాగానే భూమిని సేద్యానికి యోగ్యంగా చేసి, విత్తనాలు వేయడానికి అనుకూలంగా దుక్కిదున్నే విధానాన్ని వివరిస్తుంది ఈ గేయం.........” (చిత్రం.3,4)

“దుక్కి దున్నీ దక్కం పడలు

మళ్ళా ఒకసారో మళ్ళా పట్టయా

మళ్ళా ఒకసారో మళ్ళా పట్టో

మర్రి పేరో తేలదున్నయా

ఇంకోసారో ఇంక పట్టో

ఈతపేరొ తేలదున్నయా.......”

**ఎరువు :**

కొండరెడ్ల వ్యవసాయంలో పశువుల పేడను మాత్రమే ఎరువుగా వాడతారు. అందువల్లనే పంటల ఉత్పత్తి అధికంగా ఉంటుందని తెలిపే గేయం.

“ఇప్పుడే పుట్టింది ఈ లేగదూడ

ఇరపై పుడకల గడ్డి తిన్నది

ఇరపై పుడకల గడ్డి తిన్నది

మళ్ళీ వచ్చి పేడకడి వేసె

మునికి వేసిన పేడ ముత్యమై దుల్లె

జల్లి వేసిన పేడ జువ్వాది దుల్లె

పారవేసిన పేడ పవడమై దుల్లె

కూడదోసిన పేడ కుంకుమై దుల్లె"

**విత్తనాలు చల్లడం :**

సాధారణంగా వ్యవసాయానికి యోగ్యంగా నేలను చదును చేసి వర్షాలు ప్రారంభం కాగానే విత్తనాలు చల్లుతారు. అలా విత్తనాలు చల్లుతారనే విషయం తెలియజేసే పాట.

"బందచేను తువ్వడాలు – ఒబ్బిరేల విత్తనాలు

కొండచేను తువ్వడాలు - కొయ్యగూర విత్తనాలు..."

కొండల పైవున్న చేనులో జొన్నలు నాటారని తెలిపే పాటలోని విషయాలను గమనిస్తే ఇది పోడు వ్యవసాయాన్ని తలపిస్తుంది.

"........విత్తినది ఏమి జొన్న - వీర జొన్న

పండినది పాలజొన్న కోసినది - కొర్ర జొన్నయా...."

**పంటలు :**

కొండరెడ్ల వ్యవసాయ క్షేత్రం కొండల్లో ఏటవాలుగాను కొండకింద సమతలంగాను ఉండు ప్రదేశంకావడం మూలాన వీరి పంటలన్నీ చాలావరకు మెట్టపంటలుగానే ఉంటాయి. గేయాల్లో జొన్నలు, కొర్రలు, సామలు, వరి, సజ్జలు, రాగులు, కందులు, అలసందలు మొదలైన ధాన్య విశేషాలు కనిపిస్తున్నాయి.

**జొన్నపంట :**

జొన్నలు పండింతే నీవురా అని జోడు కొప్పుల గంగాలమ్మను ఆహ్వానిస్తూ ఒక సందర్భం, మరో సందర్భంలో జొన్నపంట పండినప్పుడు నేనోస్తానత్త అంటూ కోడలి విన్నపం, జొన్నకంకుల్లో లేత కంకుల్ని కాల్చి తిందామని చెప్పు సందర్భాలలో జొన్న ప్రస్తావనలు వీరి పాటల్లో కనిపిస్తున్నాయి.

"చీమల పుట్టకాడ గోగి పువ్వో జొన్నలు ఆరబోసే...

జడగంట పంటలు జొన్నపంటలు చందమామ

జొన్న పంటకి నేనోస్తానత్తో చందమామ......"

"పిట్టలు కాయబోయి మారే ఉషాకంకులు తెత్తదోయి

ఉషాకంకులు కాల్చి మారే తిందాము గాని చిన్నా.."

**కొర్ర పంట :**

కొర్రలను ఆహారంగా స్వీకరిస్తామంటు చెప్పే పాటలోని చరణాలు

“కోట కొప్పుల గంగాలమ్మ – కొర్రలు పండితే నీవు రమ్మి

నువ్వేను వన్నెలారా గోగిపువ్వో నువ్వన్నెలారా

కోతుల మిట్టకాడ గోగి పువ్వో కొర్రలు ఆరబోసే”

జొన్నలు కొర్రలు సామలు వ్యవసాయం చేస్తాం, వాటినే ఆహారంగా స్వీకరిస్తున్నాం అని చెప్పే పాటలోని చరణాలు

“జొన్న కొర్ర సామ వేస్తామన్నా

ఆహారంగా మేము తింటిమన్నా .....”

**సామ పంట :**

సామలు ఆరబోయడానికి, కూలిగా తను వస్తానంటూ కోడలు అత్తను అడుగుతున్నట్లున్న చరణాలు.

“చీమల పుట్టకాడ గోగిపువ్వో సామలు ఆరబోసే

జడగంట పంటలు సామపంటలు చందమామ

సామ పంటకే నేనోస్తానత్తో చందమామ .......”

“యా కొండ యావల సామలే పండే చందమామయ్య

ఆ సామలు పండితేనే ఒల్లనయ్యా చందమామయ్య"

**రాగులు :**

పిట్టు అనే వంటకం బియ్యంతోను రాగులతోను చేస్తారు. ఈ ప్రస్తావనలో రాగులతో పిట్టు చేసినట్లు ఉన్న పాట లోని చరణాలు.

"సర్వచోళ పిట్టుతిని చట్టలారో - చచ్చిర గుంటడ

బూడిచోళ పిట్టుతిని బుగ్గ లారో - చచ్చిర గుంటడ

అరవచోళ పిట్టుతిని అంకుడారో - చచ్చిర గుంటడ"

**నువ్వులు :**

రాళ్ల కుప్ప దగ్గర ఒకచోట నువ్వులు పండించి ఎండ వేసినట్లు తెలుపుతూ

"రాళ్ళకుప్పకాడ గోగిపువ్వో - నువ్వులు ఆరబోసే ....."

**వరి పంట :**

వరి పండించి తూర్పానబట్టి తప్పతాలు వేరుచేస్తున్న అంశం తెలుపు పాట చరణాలు

"....గూపి గూపి కన్నెలారా గూపి కన్నెలారా

తుర్పునా వడ్లన్నా తూరు బోయించి

దక్షిణాది వడ్లన్నా ఉండా గొల్పించి.........."

"యా కొండ యావల వడ్లేల పండే చందమామయ్య

వడ్లు పండితే నేను వొల్లనయ్యో చందమామయ్య"

**బొబ్బర్లు/అలసందలు :**

అలసందలని బొబ్బర్లు అంటారు. బొబ్బర్లు ఆరబోస్తారని తెలియజేసే చరణం.

"నువ్వే నువ్వన్నెలారా గోగిపువ్వో నువ్వన్నెలారా

ఉసిక దుబ్బకాడ గోగిపువ్వో బొబ్బర్లు ఆరబోసే "

అదేవిధంగా అటుపక్క కొండని చదునుచేసి అలసందలు పండించినట్లు తెలుపుతున్నాయి చరణాలు.

"అద్దరి కొండ నరికించు- అలసందలు పండించు ....."

**కందులు :**

కందిచెట్లు వేసి కందికాయలను కోసి ఎండ బెట్టి కందులు తీస్తారు. ఇవి నిల్వ పెట్టుకుంటారు.

"కంది గింజల నేరుకొచ్చి - కందిపులుసులు పెట్టి దియా... "

"కాచిన కందు లెల్ల–కారుకోడి బాలలము"

వేసిన కందు లెల్ల-వెలుగూరి బాలలము

పూసిన కందు లల్లే-పూరి పిట్టల బాలలము

పండిన కందుల ల్లె –పాలివారి బాలలము”

“దూరపు చుట్టాలు మేలు - దూలదాము పప్పు మేలు

కొడుకు కోడలు మేలు - కొనగంది పప్పు మేలు”

**ఉలవలు :**

ఉలవలను పప్పు చేసి, కూర చేసుకొని, జొన్న కూటితో కలుపుకొని తింటామని, చిరుగటి పప్పు, చిప్పకూడు తింటారని తెలియజేసే అంశాలు.

“...జొన్నకూడు ఉలవపప్పు – జోడదని ఒల్లనంతిని

చిప్పకూడు చిరుగటి పప్పు – చిన్నదని దొల్లనంతివా......”

**బుడమలు :**

ఇవికాక కొండరెడ్లు బుడమకాయలను పండిస్తారు. మెట్టపంటల్లో అంతర పంటగా వేస్తారు. బుడమకాయలు వంటలో వినియోగిస్తారు. ఆరోగ్యప్రదాయినులుగా వీటిని భావిస్తారు.

“పల్లాన పండింది పాల బుడమ లేమో ..”

ప్రతి ఇంటిదగ్గర ఇంటికి ముందువెనుకల కొంత స్థలం వదులుకుని ఇల్లు నిర్మాణం చేసుకుంటారు. ఇంటి ఆవరణలో తప్పనిసరిగా చిక్కుడు, కాకర, వంగ, బెండ, గుమ్మడి, దోస, సొర, బీర, మిరపచెట్లు వేస్తారు. జామచెట్లు,

మామిడిచెట్లు, అరటి చెట్లు, నిమ్మచెట్లు వేస్తారు. రకరకాలైన ఆకుకూరలు పండిస్తారు.

"దొడ్డిలోని దోసపండు కో ...కోడలమ్మా

దూరి రాగ దోషాలొడ్డునా ..."

"కొండచేను తువ్వడాలు - కొయ్యగూర విత్తనాలు..."

"నీయింటి నా యింటి నడుమ గుమ్మడాని వేసినాము..."

"అరటికాయలు కోయవాలె - తాళింపులు పెట్టవాలె"

"నీయింటోయ్ నాయింటినడుమ–చిక్కుడానివేసినాము"

"భీమన్న దొడ్డికి బీరకాయలట"

**పశుపోషణ :**

కొండరెడ్లు పోడు వ్యవసాయంతోపాటు పశుపోషణ వీరి ప్రధాన కార్యాచరణ. పశువులను పోషించడాన్ని వ్యవసాయానికి అనుబంధకార్యంగా భావిస్తారు. వ్యవసాయంలో వీరు సేద్యానికి పేడ ఎరువుల్నే వాడుతారు. అందుకోసం తప్పనిసరిగా వీళ్ళు పశుపోషణలో భాగస్వాములై ఉంటారు. వ్యవసాయానికేకాకుండా పాల ఉత్పత్తులకు సైతం రకరకాల పశువులను పోషిస్తుంటారు. ఆ విషయాలను తెలియజేసే గేయాలలోని చరణాలు.

"....చీకటింట దవని గోన్నం –చిట్టియావూల పాలుతెమ్మి

మలకరింటి దవనిగోన్నం–మల్లెటావుల పాలుతెమ్మి...''

''చిర్రికొమ్ము నకర్రియావు–ఇంతముంతనముంతెడుపాలోయా

గుమ్ముగుమ్ముగ చల్లచేయ – గుమ్మనెవ్వడి బాలుడవు

సల్లుసల్లున చల్లచేయ – సాలునెవ్వల బాలుడవోయా.....''

''అవులెల్ల అద్దరిమేసె – దూడలెల్ల దుచ్చరి మేసె

గిత్తలెల్ల బెత్తరిల్లె - పెయ్యిలెల్ల పెండవట్టె ''

''బందమాటి బయలులోన - బయలుదేరి గేదెపోతు.....

చుక్కనుదురు అలమ తోక – నూటిగల్ల గేదెపోతు''

''సూటి గల్ల గేదె పోతు - కారుకోడి లచ్చుమన్న

....చుక్కనుదురు అలమతోక – సూటి గల్ల గేదె పోతయా

గేదెకు పేసో బంటెవ్వడు - కారు కోడి లచ్చుమయ్య'' (చిత్రం.5,6)

**జల వనరులు :**

వాగులు, కొండచరియల్లోని జలపాతాలు, కొండచెలమలు, వాగులునుండి నీటిని వినియోగించి వ్యవసాయం సాగిస్తారు. నూతులు ఎక్కడో ఒకటి అరా ఉంటాయి. నీటి వనరులు సమృద్ధిగా ఉండవు. వ్యవసాయానికి వర్షాధారం లేదా కొండల్లోనుండి దుమికే జలపాతాలనుండి పారే నీళ్ళు, చెలమలు

తప్పితే ఊట ఉబికిన నీరు తప్ప వేరే ఆధారంలేదు. పంట ఎండిపోతున్నప్పుడు దూరంనుండి నీటిని కుండల్లో మోసుకొచ్చి తమ పంటను కాపాడుకుంటారు. తాగు నీరుకూడా చాలా దూరాలనుండి తలలపైగాని, కావడులతోగాని మోసుకు వస్తుంటారు. వ్యవసాయపనులు వర్షాధారంతో ముడిపడి ఉండడం, అన్ని కాలాలల్లో నీళ్లు అందీఅందక ఇబ్బందులకు గురికావడం కనబడుతుంది. ఆ అంశాలతో సాగే చరణాలిక్కడ కనబడుతున్నాయి. (చిత్రం.7,8,10)

"ఎకురు వాగుకు పొయీ మారే -ఎర్కలు తెచ్చుకువత్తాడో..."

"నూనె కొప్పుల పొన్న చిలుక - నూతి నీళ్లు ముంచబోగ...."

**నీటి ఎద్దడి :**

కొండరెడ్లు నివాసమున్న కొండల్లో నీళ్ళులేక పడుతున్న అవస్థలను కథల్లోనూ పాటల్లోనూ ఎక్కువ సందర్భాలల్లో వివరించారు. సాధారణంగా కొండరెడ్లు అడవులను తగులబెట్టి సేద్యానికి అనుగుణంగా మార్చుకొని వానకోసం ఎదురుచూస్తుంటారు. వానలు కురిస్తే పంటలు పండుతాయి. పశువులకు మేత లభిస్తుంది. అలాగే తాగటానికి నీరు లభిస్తుంది. వీరు అడవులపై ఆధారపడి జీవిస్తుండటంవల్ల కొన్ని మైళ్ళ దూరం నీళ్ళకోసం స్త్రీలు, పురుషులువెళుతుంటారు. స్త్రీలు కుండలతోను పురుషులు కావళ్లతోను నీళ్ళు మోసుకొస్తారు. నిత్యకృత్యాల

అవసరంకోసంకూడా మైళ్ళకొద్దీ  వెళ్తుండటం అనునిత్యం కనిపించే దృశ్యాలు. నీళ్ళులేక చెట్లకు కాయలు కాయక పక్షులకు పండ్లు లేవని, పిల్లలకు స్నానానికి నీళ్ళు లేవనీ, వంట పాత్రలు కడుగడానికి నీళ్ళు లేవని, పొలంలో వేసిన పంటలు నీళ్ళులేక ఎండిపోతున్నాయని, ఇంటిముందు వేసుకున్న ఆకుకూరల  చెట్లు కూడా నీళ్ళులేక ఎండిపోతున్నాయని తెలియజేసే అంశాలు అనేకం గేయసాహిత్యంలో కన్పిస్తున్నాయి. నీళ్ళకోసం చాలా దూరం వెళ్ళాల్సి వస్తుందని తెలిపే గేయంలోని చరణం  (చిత్రం.9,11,12)

"నీళ్ళకెంత దూరమప్పా – సంపెంగ దోసెలు దాటి

చారు మన్నెలు పారజూదమా......."

కొండ కోనలన్నీ తిరిగినా, రాతి చలమలు వెతికినా వంట పాత్రలు కడగడానికి చుక్కెడు  నీళ్ళు దొరకడం లేదనే పాట

"కొండకొండలు తిరిగినగాని – కుండకడుగా నీళ్ళేలేదోయా

రాతిచలమ నీళ్ళకోసం – రాగిచెంబులోడ్డినా మోయా....."

ఆకుకూరకై విత్తనాలు చల్లితే మొలకలొచ్చినచెట్లు నీళ్ళులేక ఎండిపోతున్నాయని  తెలిపే గేయంలోని చరణాలు

"సిలేటో సిమిలి కూర – వానలేక వాడిపోయింoదా........."

నీళ్ళులేక చెట్లుఎండిపోయాయని కాసిన కాయలు పండ్లు కాకుండానే ఎండిపోవడంవల్ల పక్షులకు పండ్లుకూడా లేవనే గేయం చరణాలు

"పుట్టలోనో బుడమరిచెట్టు –భూమికోన సాగేయా

ఆకాశానికి కొనసాగు – అడ్డురంతన కాయకానోయా......

ఎండునేల పండునేల – పక్షులకో కాని పండ్లయా"

కొంచెం సినుకు రాలితే ఆ చినుకు నీరుని పట్టుకుని తమ కుండల్లో నింపుకోవాలని వాన చినుకును పట్టుకోవడం కోసం పడే తపన ఈ చరణాలల్లో కన్పిస్తుంది.

"మన్నెమంతా చినుకు తగిలే మట్టికుండ లొడ్డుడన్న

రాజ్యమంతా చినుకు తగిలే రాగికుండ లొడ్డుడన్న"

**వానకై పూజలు :**

తొలకర్లకోసం వ్యవసాయం చేసేవాళ్లు ఎదురుచూస్తుంటారు, నీళ్లులేక పైర్లు ఎండి పోతుంటే వ్యవసాయదారులు వర్షంకోసం ఆక్రోశిస్తారు, కురవని వర్షాన్ని కురవాలని వ్యవసాయదార్లు రకరకాల పాటలతో వానదేవున్ని ఆహ్వానిస్తారు. భూమికి నైవేధ్యాలు సమర్పిస్తారు. ఈ అంశాలు గల జానపద గేయం .

"కురువు కురువు వాన – కూటిముద్ద ఇత్తుం

ఎండకాయ ఎండకాయ – ఎరిపోతో

తొండలు మెడలు వలిపొట్ట "

ఒక్కొక్కసారి వర్షం మేఘం కమ్మకుండానే కుంభవృష్టి కురుస్తుంది ఆ విషయాన్నే గేయంలో

"ఆకసాన మేగములేదు అగ్గినిప్పుల వానకురిసె

నింగినింత మేగములేదు నీలికెంపుల వానకురిసె

జాడినింత మేగములేదు జగజెంపుల వానకురిసె"

**వేట :**

కొండరెడ్డి తెగలోని పురుషుల్లో ప్రతి ఒక్కరిదగ్గర చిన్నపిల్లలనుంచి పెద్దలవరకు 'కత్తి'ని ఆయుధంగా కలిగిఉండడం సాధారణ విషయం. అలాగే ప్రతిఒక్కరు విల్లంబులు ధరించి ఉంటారు. అంబుల్లో అనేక రకాలు ఉంటాయి. కొండరెడ్లు వేటకోసం వినియోగించే వస్తువుల్లో ప్రధానంగా ధనుస్సు, విల్లు, అంబు, బరిసె, కత్తులు, ఉచ్చులు, కంజుపాదులు, పురేడుపాదులు, మిట్ట, మొగలం ఉంటాయి. జంతువులపై 'అంబు' అనే ఆయుధాన్ని వినియోగిస్తుంటారు. అంబుల్లో అనేక రకాలున్నాయి. క్రూరజంతువులను వేటాడేందుకు విల్లంబులు, చేవులంబులు, శోభంబులు వినియోగిస్తారు. వీటితో దూరంలో ఉన్న పెద్ద జంతువులను వేటాడవచ్చు.

మిద్దెంబుతో పిట్టలు, బోడ గువ్వలు వేటాడుతారు. రెండోమిద్దెంబుతో జాజు, నెమలి, కారుకోడివంటి వాటిని వేటాడుతారు. మిట్ట అనే ఆయుధంతో ఆకాశంలో ఎగిరే పక్షులను వేటాడుతారు. పాకారుకోడి, నెమలివంటి పక్షుల వేటకై మొగలం అనే ఆయుధాన్ని వాడుతారు.

ఏ జంతువునైన గ్రామంలో నివసించే వారికంంతా సమాన భాగాలుగా పంచుకుంటారు వీరు అలా వేటకు వెళ్ళినప్పుడు వేటాడిన వ్యక్తికీ ఇచ్చే అదనపు భాగాన్ని "కర్రపోగు" అంటారు. కొండరెడ్ల ఐక్యతకు చిహ్నంగా వేటను చెప్పుకొనవచ్చు. వేటకు వెళ్ళాలంటే ముందుగానే ప్రణాళిక వేసుకుని ఊరిలోని పురుషులందరూ తగు సామగ్రితో బయలుదేరుతారు. భూదేవి పండుగకు ముందు వీరు విధిగా వేటకువెళ్తారు. కొండరెడ్లు వేటాడటంలో సమర్థులు. వేట వీరికి దినచర్యలో భాగం లాంటిది. వీరు సాధారణంగా సాముహికంగానే వేటకు వెళతారు. అరుదుగా ఒంటరిగా వెళ్తుంటారు, వేటలో అడవిలో నివసించే వివిధ జంతువులను, పక్షులను, క్రూరమృగాలను కూడా వేటాడతారని తెలియజేసే గేయం. (చిత్రం.13,14)

"వేట మనదే పెట్టి మనదే –వేయి విద్యలు గల్లవారము ....."

"తగ్గవారు తండ్రిద్దరు –తగరపు విండ్లవారు

జోడురిండ్లు జోడించుకొని –బోలకొండ వేటకు వెళ్ళో ......"

"పులికాదో ఎలుగుకాదో –పూరి పిట్టల వేట గాడోయా

ఊరి కెదురుగా కొండలోన –ఉడుముల వేట గాడోయా ......"

"వేటకు వెళ్ళి దెచ్చో వేడికిల ముంగిపిల్ల ..."

"పందిని కొట్టవాలె – పాలవిందు పెట్టవాలె .."

కొండరెడ్లలో శౌర్యానికి ప్రతీకగా వేటను భావిస్తారు. ఎందుకంటే వేటకు వెళ్లి జంతువులను వేటాడి వాటి కొమ్ములను తెచ్చిన పురుషుల్ని వీరులుగాను, శూరులుగాను భావించి వయస్సులోని ఆడపిల్లలు మోహిస్తారు. అందుకోసం కొండరెడ్ల యువకులు అమ్మాయిల మనసు గెలవాలని వేటాడడంలో పోటీ పడుతుంటారు.

"దుప్పికొమ్ములు విరుచుకుంటూ - దుమికి వచ్చేడు

జింకకొమ్ములు విరుచుకుంటూ - దుమికి వచ్చేడు"

"గడకొమ్ములు విరుచుకుంటూ – గతులువేసిడి నల్లమయ్య

ఈలికొమ్ములు విరుచుకుంటూ –ఈదివచ్చెడి నల్లమయ్య"

వేటకు వెళ్ళకుండా ఇంటిలో ఉంటూ తినికూర్చునే వారిని ఈసడించుకునే సందర్భాలుకూడా పాటల్లో కన్పిస్తున్నాయి. ఇవి కొండరెడ్లలో వేట ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి.

"పని కొల్లవు పాటు కొల్లవు-పగిలు పొద్దున తిందేనందువు

వేట కొల్లవు పెట్టి కొల్లవు - రేగిన పొద్దునే తిందేనందువు

కూలి కొల్లవు నాలి కొల్లవు –కుగుడుండి తిందేనందువు ”

వేటకు వెళ్ళడానికి సుముకంగా లేని వారిపై కొండరెడ్ల స్త్రీలు బురదనీరు చల్లి వేటకు వెళ్లేంతవరకు వెంబడిస్తారు. వేటాడి వచ్చే మగవాళ్ళను వీరులుగా భావించి ఊరిలోని స్త్రీలందరు గుంపుగా వెళ్లి మంగళ హారతులతో ఎదురేగి ఆహ్వానించే సంప్రదాయమూ వీళ్ళలో ఉంది.

వేటకు వెళ్లి వచ్చిన రోజు గూడెంలో పండుగ వాతావరణం కన్పిస్తుంది. సందడి చేసుకుంటారు. వేటాడిన జంతువుల మాంసాన్ని ఊరివారందరు కలసి పంచుకుంటారు. అలా మగవారు వేటకు వెళ్ళగా మహిళలు ‘రేల’ పాటలు పాడుతూ బాటసారులనుంచి విరాళాలు సేకరించి వాటిని పండుగ చివరిరోజున ఖర్చులకు వినియోగిస్తారు.

**అటవీ ఉత్పత్తుల సేకరణ :**

కొండరెడ్లు పుట్టుకతోనుండి కొండల్లోనూ అడవుల్లోనూ తిరుగాడుతూ ఉండడంవల్ల అడవికి సంబంధించిన జ్ఞానాన్నికలిగిఉంటారు. కాలానుగుణంగా అడవిలోనూ కొండల్లోనూ లభించే అనేక వస్తువులను సేకరించడం వీరి ప్రవృత్తి. వీటిలో ఔషధ గుణాలున్న వేర్లు, కాయలు, గింజలు, బెరడులు, ఆకులు వంటివి చాలా తెలుసు. అలాగే ప్రజలకు తినే పండ్లు, కాయలు, వంటకి ఉపయోగపడే దుంపలు, గింజలు మొదలైనవి తెలుసు. ఏవి ఆరోగ్యవంతమైనవి ఏవి

కావు అన్నది ఎరిగి వాటిని సేకరించి తమకు కావలసినవి తిని కొన్నింటిని దాస్తారు.

వెదురును సేకరించి ఇంటినిర్మాణానికి కావలసిన కలపగా వినియోగిస్తారు. ఇంకా చేటలు, బుట్టలు, గంపలు మొదలైనవి అల్లి ఇంటికి కావలసినవి వాడుకుని మిగిలినవి దాస్తారు. అడవిలోనున్న చింతచెట్లనుండి చింతపండు దింపి దానిని సరిచేసి దాస్తారు. కొండరేగు, ఉసిరిక పండ్లను కోసుకొస్తారు. ఇవే కాక అడవిలోని పలురకాల చెట్లపై నుండి తేనెతుట్టెలను దించి తేనె తీస్తారు. కొన్ని రకాల చెట్లనుండి జిగురును సేకరిస్తారు. ఇంకా చీపుర్లు సేకరించడం, కుంకుడు కాయలు కరక్కాయలను కోసి ఎండ బెట్టి దాచడం. ఇలా అనేక వస్తువులను అడవుల్లోనుంచి, కొండల్లోనుంచి సేకరించి తమ అవసరాలకు వినియోగిస్తూ తక్కినవి దాస్తారు. ఈ విషయాలన్నీ పాటల్లోని చరణాలల్లో గమనించవచ్చు.

**తేనె :**

కొండరెడ్ల అటవీ సంపదలలో వెదురుబియ్యం, తేనె ప్రధానమైనవి. తేనెతుట్టెలను గుర్తించి చెట్లపై నించి దించి తేనెను సేకరిస్తారు. ఈ అంశాన్ని తెలుపుతూ

"కొండ దుంపలు తింటాం – చెట్టులో తేనెలు కోస్తాం...."

"తొర్రెల్లో తేనెల్లు తీస్తాం...."

"కర్ర తేనెలకి తెర్ర తేనె లకి –వాడు వెళ్ళినాడు..."

**వెదురు :**

కొండరెడ్ల జీవనవిధానంలో పోడువ్యవసాయంలో సాగు చేసిన గింజలు చేతికి రానప్పుడు వీరు అటవీ సంపదలను సేకరించి, వాటిని సంతలలో అమ్మి వారి జీవనభ్రుతికై వినియోగిస్తారు. వెదురుతో బుట్టలు, చేటలు, చాపలు, తడికలు అల్లి వాటిని అమ్మి నిత్యవసర సరుకులను పట్టుకుని వెళ్తారు.

"అడవి ఒడిలో వెదురు వుంది అన్న

బుట్టలు అల్లుతాము –అద్దిరబన్నా

చేటలు అల్లుతాము –అద్దిరబన్నా

చాపలు అల్లుతాము –అద్దిరబన్నా

తడికలు అల్లుతాము –అద్దిరబన్నా"

కొండరెడ్లు కొండల్లోని వెదురు నరికి ఇండ్లు కట్టుకుంటారు. ఇంటికిలోపల గదులుగా వెదురు తడికలను వాడతారు. ఇంటికి బయట ప్రహారీగా వెదురు పుల్లలతో చేసిన తడికలతో అమరుస్తారు.

"కొండకొండ వెదురు నరికి – గండిమీద ఇల్లుకట్టి

ఇత్తువద్దు పొత్తువద్దు – ఇద్దరమే కూడి తిందాం"

**సంతలు :**

సంతలు వర్తకవాణిజ్య వ్యాపారాల నిలయాలు. ఈ సంతల్ని ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వారానికి ఒక్కోప్రాంతంలో ఒక్కోరోజు నిర్వహిస్తారు. కొండరెడ్లు పండించిన పంటలో మిగులు భాగాన్నికూడా ఇక్కడ అమ్ముకుంటారు. పశువుల్నికూడా అమ్మడం జరుగుతుంది. విక్రయంతోపాటు తమకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసుకుంటారు. కొండరెడ్లు అడవికి వెళ్లి ఔషద గుణాలున్న వేర్లు, కాయలు, గింజలు, బెరడులు, ఆకులు వంటివాటిని, రకరకాల పండ్లు కాయలు వంటకి ఉపయోగపడే దుంపలు గింజలు సేకరించి తమకు కావలసినవి దాచుకుని మిగిలినవి సంతల్లో అమ్ముతారు. వెదురును సేకరించి ఇంటినిర్మాణానికి కావలసిన కలపగానూ, చేటలు, బుట్టలు, గంపలు మొదలైనవి అల్లేందుకు వినియోగిస్తారు. వీటిలో అవసరమైనవి వాడుకుని మిగిలినవి సంతలో అమ్ముతారు. అడవి నుండి సేకరించిన చింతపండు, కొండరేగు, ఉసిరిక పండ్లను సంతలో అమ్ముతారు. ఇవే కాక తేనెతుట్టెలనుండి సేకరించిన తేనెను, కొన్ని రకాల చెట్లనుండి సేకరించిన జిగురును సంతల్లో అమ్ముతారు. ఇంకా చీపుర్లు, కుంకుడుకాయలు, కరక్కాయలు ఇలా అనేక వస్తువులను అడవుల్లోనుంచి, కొండల్లోనుంచి సేకరించి సంతలో అమ్ముకుని తమకు కావలసిన వస్తువులను సంతనుండి తెచ్చుకుంటారు. వీళ్ళల్లోనే కొందరు వ్యాపారార్థం యితర ప్రాంతాలనుండి సరుకులను తెచ్చి ఈ సంతల్లో అమ్ముతారు. ఈ

సం౦తలద్వార కొంతమేరకు కొండరెడ్లు ఆర్థికస్థిరత్వాని పొందుతుంటారు. మిగులు డబ్బుతో కల్లు, సారాయి, నల్ల మందు కొనుక్కుని వినోదిస్తారు. ఏలేశ్వరం సంత, పిఠాపురం సంతలలో యితర ప్రాంతాలనుండి బట్టలు తెచ్చి అమ్మడాన్ని సూచి౦చే గేయ భాగాలు. (చిత్రం.15-18)

"ఎర్రరైకలెక్కటివమ్మా-ఏలేశ్వరం సం౦తల కాటివి "

"పచ్చరైకలెక్కటివమ్మా –పిఠాపురం సంతల కాటివి .."

**బేరసారాలు :**

సంతల్లో బేరం లేనిదే వస్తువుల కొనుగోలు జరగదు. బేరం కుదిరేవరకు అమ్మేవాళ్ళు కొనేవాళ్ళు వస్తు విక్రయం సాగనివ్వరు. ఈ విషయంతో...

"నయ్యకానో నల్లటివాడు –నల్లపూసల బేరగాడోయా

నయ్యకానో రంగులవాడు –రంగు పూసల బేరగాడోయా"

"కొ౦డసంత మండువలోన కొన్నాడయ్యో మొగ్గల చీర

చింతలు చెల్లివి సంతకు పోదాం –చిట్టిచిట్టి గాజులు కొందాంరా

కిక్కిడి గిడిగిడి సంతలదారో –నత్తగుల్ల వర్రే పాపయా......."

"కూరలమ్మి నారలమ్మి –కరకవన్నె చీరగోన్నామా

అత్తమామ లెరుగకుండ –అంటివన్నెచీరగొన్నమా

తోటికోడలెరుగకుండ –తొగరువన్నె చీరగొన్నమా

గంతకోడలెరుగకుండ –గాగావన్నె చీరగొన్నమా

ఇంటి కోడలెరుగకుండ-ఈత వన్నె చీరగొన్నమా

చెల్లెలు మరదలెరుగకుండ-సేనగపువ్వు రైక గొన్నమా

అనే పాటలోని చరణాల ద్వార భయంతోనో ఆశతోనో కుటుంబ సభ్యులకి తెలియకుండా బట్టలు కొనడం, అంతేకాకుండా ఇంటిపెరట్లో పండించే కూరలను అమ్మి బట్టలు కొనడం అనే అంశాలు కన్పిస్తున్నాయి.

**కొలతలు :**

**ధాన్యం కొలతలు :**

కొండరెడ్ల జానపద గేయాలలో ధాన్యం కొలవడానికి పుట్టెడు, ఏందూము, పందూము, మానిక అను పరిమాణ వాచకాలు కన్పిస్తున్నాయి.

**పుట్టి :**

"పుట్టాడి బియ్యామో ఉడుకబోపించి

కడవాడి బియ్యమో కడగలోంపించి ..........."

**ఏందూాము :**

"ఏందూాము చిప్ప బియ్యం ఎద్దుతోటి విందో ........"

**పందూాము :**

"పందూాముచిప్ప బియ్యం పంది తోటి విందో .........."

**మానిక :**

"ఆటగల్ల మానిక వేసి పాట పాడి కొలువుడన్నా ....'

**పుడుకులు (గంపలు) :**

పండ్లను కొలవడానికి పుడుకులు అనే కొలతను వాడుతారు. ఈ వాడుక ఇప్పటికీ ఉంది. అధిక మొత్తంలో పండ్లను అమ్మేటప్పుడు గంపల లెక్కన పండ్లను కొలుస్తారు. ఆ గంపను పుటిక అంటారు. పుటికతో కొలిచే కొలతను పుడుకులు అంటారు. పండ్లనే కాదు అధిక మొత్తంలో కొలవడానికి వీలుకాని వాటిని పుటికలతో కొలుస్తారు. పేడను దిబ్బ ఎరువును, పచ్చి గడ్డిని కూడా పుటికలతో కొలుస్తారు.ఈ అంశంతో పాటలోని చరణాలు..

"ఇప్పుడే పుట్టింది ఆ లేగదూడ ఇరపై పుడకల గడ్డి తిన్నది

ఇరుపై పుడుకల గడ్డి తిన్నది మళ్ళి వచ్చి వాకిట పెడకడి వేసే...."

**కల్లు కొలతలు** :

కల్లును చెట్టు మీద నుంచి దించేటప్పుడు సొరకాయ దిప్పల్లో పోసుకు వస్తారు. అలా దించిన కల్లును చట్టితోనూ, ముంతలతోను కొలుస్తారు అనే అంశాలు గల పాటలు ఇలా ఉన్నాయి. (చిత్రం.19-22)

**దిప్ప :**

సొరకాయ ముదిరినాక ఎండబెట్టతారు. ఎండిన కాయ కొమ్మను కోసి వేస్తారు. లోపలున్న గింజలను గుజ్జుపీచును తీసివేసి ఆ డిప్పను కల్లు తాగేందుకు, కల్లు నిలువ ఉంచుకునేందుకు, దూరాబారం వెళ్ళేప్పుడు నీటిని తీసుకు పోవడానికి వీటిని వాడతారు. దీన్నే కొండరెడ్లు దిప్ప అంటారు.

"దిప్పతోనో దిప్పేడు కల్లు –దిగ గోందిన దాచిడుకున్నడు ......"

**చట్టి :**

వెడల్పు మూతి కలిగిన మట్టి పాత్ర. దీన్ని కల్లు తాగడానికి వినియోగిస్తారు. లెక్కకు ఇన్ని చట్లు అనికూడా కొలమాణంగా వినియోగిస్తారు

"చట్టితోనో చట్టేడు కల్లు –చాపచాటున దాచిడుకున్నడు ........"

**ముంత :**

మూతి కుండకు మల్లే ఉంటుంది. దీన్నిజీలుగు కల్లు తీసేందుకు జిలుగు చెట్లకు కడతారు. కల్లు కొలిచేందుకు కొలమానంగాకూడా దీన్ని వినియోగిస్తారు.

"ముంతతోనో ముంతెడు కల్లు - మూల గొందిన దాచిడుకున్నడు.."

**బుక్కెడు :**

**నోటిలోని బుగ్గల నిండుగా నింపుకుంటే బుక్కెడని అర్థం**

"పులికనుమలవర్రేపాప–పూటకు బుక్కెడు బుర్రెడియ్యవా...."

**సారా కొలతలు :**

సారాకొలతల్లో డ్రాము కొలమానం కనబడుతున్నది. నైవేధ్యంగా సమర్పించిన సారాను తాగి తమ వ్యాపారానికి అమ్మవారు అడ్డుపడుతున్నారనే భావనగల చరణం

"తోటపల్లి చెల్లమదేవి –ఆరు డ్రాముల సారాతాగి

......అమ్మకుండ అడ్డుపడ్డదా ........"

**ద్రవ్యం :**

ప్రాచీన కాలంలో వినియోగించిన ద్రవ్య సంబంధ వస్తువుల పేర్లు వీరి పాటల్లో అక్క డక్కడ కన్పిస్తున్నాయి. ఇవి నేడు చలామణిలో లేవుగానీ

వీరి పాటల్లో భాగంగా కన్పిస్తున్నాయి. కొండరెడ్ల జానపద గేయాలలో ద్రవ్యంగా వెండిరూకలు, గవ్వల దుడ్డు, రాగిరూకల ప్రస్తావనలున్న పాటలు కన్పిస్తున్నాయి. వీటినిబట్టి ఆ పాట ఆ ద్రవ్యం చలామణిలో ఉన్నప్పటినుంచి ఉందని కాలనిర్ణయం చేయవచ్చు. ఆధునికంగా వినియోగంలోనున్న డబ్బు, పావలాడబ్బు, రూపాయి అనేవి పాటల్లో వచ్చాయి. కాలగతిలో ద్రవ్యంలో ఏర్పడిన మార్పులన్నీ ఈ పాటలో కన్పించడం విశేషం. ఈ అంశాలను తెలుపు పాటల్లోని చరణాలు.

**వెండి రూకలు :**

"పేగినింత పాడవాలె –వెండి రూక లేరవాలే.....

పగలింత పాడవాలె –పాత రూక లేరవాలే ......"

**గవ్వలు :**

"పాత పాత గవ్వల దుడ్డు –పంది గుండెలు తిందే నన్నది

మేలైన గవ్వల దుడ్డు – మేక గుండెలు తిందే నన్నది

కొత్త కొత్త గవ్వల దుడ్డు –కోడి గుండెలు తిందే నన్నది ...."

**రాగి :**

"రాగి డబ్బు లివ్వలేవు – రంకు ......"

**డబ్బు :**

"పావలా డబ్బు లివ్వలేవు –పట్టిపట్టి ......."

**వృత్తులు/కులాలు :**

కొండరెడ్ల జీవన వ్యవస్థలో అనేక వృత్తులు నిర్వహించే వారు వీరిలో ఉన్నట్లు కన్పిస్తుంది. చేనేత, చాకలి, మంగలి. కొండరెడ్లకు సహకరిస్తున్న చేనేత, మంగలి, చాకలి మరికొన్ని వృత్తులవారికి సంబంధించిన గేయాలు.

**చేనేత :**

"నూలు తేవో సాలెవాడ –సావుతామో వడికిన నూలు

సావుతామో వడికిన నూలు –బొక్కలేక జాలెతీద్దాం

బోల్లోం బొరికిడి వడికిన నూలు –మలికీ లేక జాలెతీద్దాం

కోయగుంటడు వడికిన నూలు –కొలికిలేక జాలెతీద్దాం ............."

**క్షురక :**

గ్రామస్థాయిలో కుటుంబపరమైన సాంస్కృతిక కార్యక్రమాలల్లో చాకలి మంగలి లేకుండా కార్యక్రమం సాగాదు. కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలో ఈ కులాల ప్రస్తావనలు కన్పిస్తున్నాయి. ఉదా :

"దక్షిన్నుంచి వచ్చిండోయ్ దొడ్డమంగలి

కాలిగోళ్లు తీయు మంగలికి ఏమితో విందు

గోరుతీయు మంగలికి గొర్రెతో విందు......."

**పేదరికం :**

కొండరెడ్ల ఆడపడుచు తమ పుట్టింటి వైభవాన్నీ,అత్తింటి పేదరికాన్ని తలుచుకొంటూ తన వేదనను వ్యక్తంచేస్తుంది. వారి పుట్టింటిలో జరిగే శుభకార్యానికి వెళ్ళడానికి తనవద్ద కట్టుకోవడానికి కోకలు లేవని, రంగురంగుల చీరలు లేవని, ఆభరణాలు లేవని, తన భర్త ఆర్థిక స్థితిని గుర్తించి ఉన్నవాటిలో మంచివి కట్టుకోనివ్వడంలేదని, శుభకార్యానికి ఏమైనా తీసుకువెళ్ళడానికి తమ వద్ద ఏమి లేని తనాన్ని సూచించే గేయం.

"కొండ బాలుడు కొన్న చీర –కట్టనివ్వడు పెట్టనివ్వడు

పుట్టింటయున్నప్పుడు –పట్టుచీర కట్టేదానను

అత్తమామలింటికిపోగా –ఉల్లిపొర బల్లి బందరం

చూట్టాలబియ్యము లేదు –సూటి గల్ల కొకలేదోయా

నయ్యి దాపురాగి లేదు –రంగు గల రవికే లేదోయా

నగరికి వేల్లుదమన్న –జాజివలుస నగరిలోన

పుట్టిదయ్యా పూవులపొడు –కూత లేదు మేత లేదోయా"

సంతానం కలిగిన వాళ్ళల్లో కొంతమందికి ఆర్థికస్థితి కావలసినంత లేకపోవడంతో బిడ్డలకు కనీస అవసరాలు తీర్చలేని లేమితో బాధపడుతుంటారు.

"కలిగిన బిడ్డకు బట్ట కప్పలేనే

లేమి బతుకున లేని తనమే నాది .... ''

కన్నబిడ్డకు బట్టలు కొని ఇవ్వలేని లేమిని తలచి బాధపడుతూ ఉన్న చరణాలు

"...బొంగరాల సేకు దగిలి –బంగారాల బాలుడుట్టే

బాలుడొంటిన బట్టలేదయా..."

ఇదే విషయం మరో పాటలో

"పండు తింతే ఫలముంతాది -తినగ తినగ తీపులోట్టి

తీపికొక్క బాలుడుట్టె - బాలుడోంటిన బట్టలేదు...."

అత్తింటి పేదరికాన్ని ఒలకబోస్తూ ఒక కోడలు పుట్టింట తను పెరిగిన వాతావరణాన్ని, వైభవాన్ని తలచుకుని చింతపడుతున్న పాటలో

"పుట్టింట యున్నపుడు –పప్పుకూడు భోజనాలు

అత్తమామ లింటికి పోగా –చల్ల లేని పుల్ల నంబలి

పుట్టింట యున్నపుడు –పట్టు చీర కట్టే దానను

అత్తమామ లింటికి పోగా – ఉల్లిపొర బల్లి బందరం"

**ఇంటి నిర్మాణం :**

కొండల్లో లభించు కలపతో అడ్డు దూలాల్ని వెదురు బొంగుల్ని నిలువుకి అడ్డంకి వినియోగించి రెల్లుగడ్డితో కప్పు వేసుకుని ఇల్లు కట్టుకుంటారు. ఇంటికి వెనుక ముందుకూడా కొంత స్థలం వదిలి అడవిలోని కంప చెట్లతోగాని, వెదురు పుల్లలతోగాని కంచె వేసుకుంటారు. ఇంటి ముందువెనుక తోటలు పెంచుకొనడం వీరికి అలవాటు.

"కొండకొండ వెదురు నరికి –గండిమీద ఇల్లుకట్టి ........."

**ఇళ్ళ రకాలు :**

మూడు స్తంభాలు నిలిపి ఇల్లు కట్టినా అటుఇటు తిరుగను వీలు కావడం లేదని, దీప కంబాలతో కట్టిన ఇంటిలో మసలలేక పోతున్నానని, ఒంటి కంభం ఇంటిలో ఒక్కదానినే ఉండలేను అంటూ తన అసక్తతను తెలుపుతూ పాడుతున్న కొండరెడ్ల గేయం .

"మూడు స్తంభాల మావారిల్లు –ముడ్డితిప్ప వశము కాదు

దీప కంబాల మావారిల్లు –దీపెలు లేక మసలలేను

జోడు కంబాల మావారిల్లు –జోడులు లేక మసలలేను

ఒంటి కంభాల మావారిల్లు–ఒక్కదానిని మసలలేను....."

**ఇంటి తలుపులు :**

అడ్డు దూలాలకు అమర్చిన బోరుతలుపులతోనూ, ఇనుపు సీలలు అమర్చిన బోరుతలుపులుగల ఇల్లు మావారిదంటున్న పాటలో తలుపుల ప్రస్తావనలున్నాయి .

"అద్దరిన మావారిల్లు –అడ్డు దూలాల బోరు తలుపు

ఇద్దరిన మావారిల్లు –ఇనుపు సిలల బోరు తలుపు ......" (చిత్రం.23-36)

**వెట్టి :**

సాధారణంగా కొండరెడ్లకు పోడువ్యవసాయం జీవనాదారం కల్పించలేనప్పుడు వీరు వేరే ప్రాంతాలలో కూలి పనులకు వెట్టి చాకిరి సైతం చేస్తారని తెలియజేసే గేయం .

"పేట మనదే వెట్టి మనదే –వెయ్యి విద్యలు గల్లవారము

కొలువుమనదే కొలతమనదే –కోటి విద్యలుగల్ల వారము.'

కొండరెడ్ల జానపద గిరిజన గేయాలలో చిత్రితమైన జానపద జీవన సమాజాన్ని తిలకించడమైంది.

**కాల సూచికలు :**

సంవత్సరం, నెల, పూర్ణిమ, అమావాస్య, దినం, పూట, గడియ, నిమిషం, క్షణం అనేవి కాలాన్ని తెలిపే నిర్దిష్ట కొలతలు. కాని కొండరెడ్ల గేయాల్లో యేడు, నెలలు, రోజులు, ఉనికి పుట్టనికాలం, పోడుపేటకాలం, పొక్కపూవు పూసెవేళ, పొద్దుపోయేవేళ, జాముపొద్దు, పలుకర్రవేళ, జావతాగేవేళా, జలకాలవేళ, బొమ్మెత్తుపొద్దు, బొట్టుపెట్టు వేళ, సారతాగేవేళ, దీపాలెత్తేవేళ, మందేసేవేళ, అని కాలవిభజన తమ పనులతోనూ, అలవాట్లతోను ప్రకృతి చర్యతోనూ, కాలకృత్యాలతోనూ సూచించి ఉన్నారు. ఈ అంశాలు పాటల్లో భాగమై అలరారుతున్నాయి.

"ఈ యేడు ఈలాగుందాం

కన్నెకు కలుసుకుందాం

దసరాకు దంచుకుందంరా .......

నెలలు మరిచో నేనుండగా

నేదునూరు పోవోయ్ ఘూట...

ఏడేడు రోజుల ఏక లగ్గేనం

పదిరోజుల పెండ్లిపాప చినవాడిది ......

డెబ్బైయారు తానాలకు

మద్దివీడు మావిలి దుర్గమా ...........

దక్షిణాది వడ్లు ఐన ఉండా గొల్పించేయ .....

అప్పుడు ఎత్తైనో డబ్బైయేగల పెళ్ళో .......

ఉందాము ఉందమనగా –ఉనికి పుట్టని కాలాలాయే

పోదాము పోదామనగా –పోడుపేట కాలాలాయే ...

వెళదాము వెళదామనగా –పేడుకల కాలాలాయే .....

పొగడ పూవుపూసె పేళా-రేవు దొక్కే బాలలము ..........

ఉసిరిక వాగులోన –పసిరిక పాములున్నావా

ఎక్కివెల్లి లెక్క పెట్టగ –ముప్పై ఆరు తుమ్మెదలోయి ...

తోటపల్లి చెల్లమ దేవి –ఆరు డ్రాముల సారాతాగి ...

కొలువు మనదే కొలత మనదే కోటి విద్యలు గల్ల వారము .........

**పొద్దు–వేళ :**

కొండరెడ్లు కాలాన్ని తమ నిత్య జీవన పనులతో గణించేవారు. వీరి మౌఖిక సాహిత్యంలో ఈ అంశాలు కన్పిస్తున్నాయి

బాలబాల పోద్దులాయే-పలుకర్ర వేళలాయివా

జాముజాము పోద్దులాయే

జాలుకాల వేళలాయివా జావతాగే వేళలాయివా

బొమ్మొత్తు పొద్దులాయే–బొట్టు పెట్టు వేళలాయివా

చరచర పొద్దులాయే –దీప పెత్తు వేళలాయివా

మసక మసక పొద్దులాయే –మందు వేసో వేళలాయివా

పొద్దు పొయే జంగమయ్య –పోయ్యలోనమంటబెట్టి ....

కొండరెడ్ల సామాజిక జీవన విధానంలో కొండరెడ్లు అనుసరించే వ్యవసాయ విధానాలు, అందుకై ఉపయోగపడే నీటివనరులు, పండించే పంటలు, వేటాడే విధానాలు, పశుపోషణ, అటవీ వనరుల సేకరణ వ్యాపార విధానం, కొలతలు, సమయ సూచికలు, పేదరికపు అవస్థలు పరిశీలించినపుడు కొండరెడ్ల జీవన పరిమితులు దర్శించడం జరిగింది.

# నాల్గవ అధ్యాయం

## కొండరెడ్ల మౌఖిక సాహిత్యం – సంస్కృతి

అనంతమైన కాలవాహినిలో మనవ సముదాయాలలో తమకుతాముగా ఒక రీతిని, ఒక విధానాన్ని ఏర్పరచుకొని వాటితోనే తమ ఉనికిని చాటుకుంటూ సంఘటితమై స్థిరీకృత కట్టుబాటును పాటించడం ఆజాతి సంస్కృతి అవుతుంది. ఒక జాతి సాంస్కృతిక జీవన విధానాన్ని జాతిజనుల జీవనగతితోనూ, అనుసరించే అచార వ్యవహారాలతోను, పాటించే పద్ధతులతోను గుర్తించవచ్చు. స్థూలంగా సంస్కృతిని నిర్వచించాలంటే 'ఒక మానవ సముదాయంలోని ప్రజల జ్ఞానం, విజ్ఞానం, విశ్వాసం, రీతి, కళ, నీతి, చట్టం, అలవాట్లు, ఆచారవ్యవహారాలు, నమ్మకాలు, మానవుడు సంఘజీవిగా ఆర్జించిన శక్తియుక్తుల సమాహార రూపమే సంస్కృతి' అని జర్మనీ దేశస్థుడైన ఇ.బి.టైలర్ నిర్వచించారు. సంస్కృతి అంటే సంకేతాలద్వారా ఆర్జించిన లేదా బదిలీ అయిన ప్రవర్తనల

రూపాలు. ఇవి ఆంతరంగికాలు కావచ్చు లేదా బాహ్యాలు కావచ్చు... "సనాతనంగా వస్తున్న భావాలు ఈ భావాలకు అనుసంధించి ఉన్న విలువలు సంస్కృతిలో ఉన్నాయని"-ఏ.ఎల్.క్రొబర్ సూచించారు. "మానవ నిర్మితమైన వస్తువులు, అతడు అనుసరించిన తీరుతెన్నులు, అతని సాంకేతిక ప్రక్రియలు, భావాలు, అలవాట్లు, ప్రవర్తనలు, ఆచారవ్యవహారాలు, విలువలు – వీటన్నింటితో సంబంధమైన మానవుని అనుభవ వ్యవస్థ సంస్కృతి" అని అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.(–సంస్కృతి విన్యాసం పేజి 52) ఈ క్రమంలో మానవ శాస్త్రవేత్తలు మానవ జీవన పరిణామ క్రమాన్ని 3 దశలుగా వింగడించారు. అవి 1. అరణ్యజీవనస్థితి, 2. అనాగరికస్థితి, 3. నాగరికస్థితి. ఈ మూడు దశలు మానవుని సాంస్కృతిక జీవన వికాసంలో భాగమని మానవ శాస్త్రవేత్తల అభిప్రాయం. పై మూడింటిలో మొదటిది ఆదివాసీ సంస్కృతి అనీ, రెండవది గ్రామీణసంస్కృతి అనీ, మూడవది నగరసంస్కృతి అనీ విభజించారు. మానవుడు గిరిగీసుకున్న తనదైన జీవన దశలోని కళలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మొదలైన వాటిని సంస్కృతిలో భాగంగా గుర్తించవచ్చు. గిరిజన తెగల్లోని కొండరెడ్ల సంస్కృతిని, వారి మౌఖిక సాహిత్యంలో దర్శించినపుడు వారి జీవన సంస్కృతిలో నాగరక సమాజంలో వారు పాటించే ఆచారవ్యవహారాలు కొన్ని కనబడుతున్నాయి. పాటించే విధానంలో వైవిధ్యం ఉండవచ్చు కాని అంత:సూత్రం ఒకేలా ఉండటం తెలుస్తుంది. కొండరెడ్ల సంస్కృతిని ఆ తెగకు

సంబంధించిన జీవనవిధానాలను వారి మతం, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, అలంకరణ, విద్య, వైద్యం, వినోదం మొదలైన అంశాలతో పరిశీలించినప్పుడు వారి మౌఖిక సాహిత్యంలో కింది అంశాలన్నీ కన్పిస్తున్నాయి.

**మతం :**

కొండరెడ్లు ప్రకృతి ఆరాధకులు. వీరి మతంలో పంచభూతాలను ఆరాధించే విధానం కనబడుతుంది. వీటితోపాటు 'శక్తి' పూజ కనబడుతుంది. కొండరెడ్లు ద్రావిడ సంతతికి చెందినవారు. కాబట్టి వీరి ఆరాధనల్లో ప్రకృతి, పంచభూతాలు, శక్తి కన్పిస్తుంది. నాగరిక సమాజంలోలాగా మూర్తి ఆరాధన వీరిలోలేదు. చెట్లు, పుట్టలు, జంతువులు, రాళ్లురప్పలకు పూజలు చేయడం కన్పిస్తుంది. ప్రకృతే వీరికి దేవత, దేవుడు. వీరి జీవనానికి నిలయమైన కొండలు అడవులు వీరి ఆరాధ్య మూలాలు. అందుకే వీరి మౌఖికసాహిత్యంలో ఎక్కువగా కొండతల్లిని, అడవితల్లిని, భూదేవిని ఆరాధించిన తీరు కన్పిస్తుంది, ఈ అంశం చాల పాటల్లో చరణాలుగా సందర్భోచితంగా విన్పించారు.

"అడవి తల్లినే నమ్మితిమయ్యా

అడవితల్లికే మొక్కితిమయ్యా

కొండతల్లికే దండం పెట్టి

కోళ్లు కొబ్బరి కోసితిమయ్యా

గటం సాంబ్రాణి గప్పున వేశో

గప్పున పొగ వచ్చేనయ్యా......"

" అడవి తల్లి మాకు అండ అన్నో

అడవి తల్లే ఉంటే మాకు హాయి అన్నో"

**శక్తి పూజ:**

భారతదేశంలో శక్తి శివం మూలవాసులైన ఆదివాసీల ఆరాధ్య దేవుళ్ళు. వీరి అంశగానే శక్తిదేవతలుగా అనేక మందిని కొలుస్తారు. గంగాలమ్మ, ముత్యాలమ్మ, పోతురాజు అని అనేక రూపాలతో కొలుస్తుంటారు.

**గంగాలమ్మ**

గంగాలమ్మ ఉత్సవానికి అమ్మవారిని ఆహ్వానిస్తే రంగురంగుల చీరలతో గంగాలమ్మ దర్శనమిచ్చినట్లు భావిస్తూ పాడిన పాట .....

"ఓ...ఆడవాలే పాడవాలె –వేడుకీలు సేయవాలే

పచ్చకోకలు కట్టుకొని –బయలు దేరిందమ్మవారు

నిలువు కోకలు కట్టుకొని –నిలబడ్డదమ్మవారు

పెల్ల కోకలు కట్టుకొని –వెనుక నిలిచిందమ్మవారు

కోట కొప్పుల గంగాలమ్మ ....."

శక్తి పూజలో దేవతల్ని తిట్టడం సంప్రదాయం. నేటి నాగరక

సమాజంలోకూడా  జాతరల సమయంలో అమ్మవారిని తిట్టే సంప్రదాయం ఉంది. తిరుపతి గంగజాతరలో నోరు పారేసుకోనివారు పాపాత్ములు అనే సంప్రదాయం వాడుకలో ఉంది.  తమ సమూహాన్ని కాపాడమని నైవేధ్యంగా సమర్పించిన సారాయిని గ్రహించి అమ్మవారు  మేలు చేయకుండా సారా అమ్మకాన్ని అడ్డుకుని  సారాయిని మగవాళ్ళకు దక్కకుండా చేస్తుందని ఆగ్రహంతో అమ్మవారిని తిడుతున్నారు అన్నట్లున్న చరణం.

"....తోటపల్లి చిల్లమదేవి - ఆరు డ్రాముల సారాతాగి

అమ్మకుండా –అడ్డుపడ్డాదా –

బూతులది గంగాలమ్మ –పోతులకు  పడ ....."

**ముత్యాలమ్మ :**

ముత్యాలమ్మకు  శక్తి పూజను చేసే విధానాన్ని కొలుపు అంటారు. ఈకొలుపుకు కొండలను, కొండదేవతలను, భూదేవిని, కొండరాజుగా కాటంరాజుని ఆహ్వానిస్తూ పూజ నిర్వహించువిధానం వీరి సాహిత్యంలో కన్పిస్తుంది. పాటలో చరణంగా ఈ అంశం...

"ఓ గొగులపూడి ముత్యాలమ్మ

నీ కొలువు చేస్తున్నాము తల్లి

కొండలు, కొండదేవతలు రావాలి తల్లి

భూమిలో ఉండే నేలతల్లి

కోపెల కొండ కన్నమా రాజు

నువ్వు దప్పక రావాలి “

మరో పాటలో ముత్యాలమ్మకు అఖండ దీప దర్శనం, చందన చర్చ అందినవో లేవోనని ఆరాటపడుతున్న తీరుతో పాడుతున్న పాట.

“....ముగ్గుముత్తేలమ్మ వారికి ముగ్గుముత్తేలు చెల్లివోలేవో

ఘనమైన అమ్మవారికి -గంటే దీపము చెల్లివోలేవో

గండ పుండలమ్మ వారికి –గందపుండేలు చెల్లివోలేవో .....’

మరో పాటలో ముడుపులతో సంతృప్తి చెంది తమకు ముచ్చట గూర్చమని, రాజులను, గ్రామ రక్షకులను సంతోష పెట్టమని, అడవితల్లిని నమ్మిన మాకు అండగా ఉండమని, నిండుగా జూడమని ముత్యాలమ్మను ప్రార్థిస్తున్న తీరు.

“.....ముడుపు కట్టు ముత్యాలమ్మకు, ముచ్చట గురమ్మా

రాజులన్న సారలమ్మ సంతోష పడరమ్మా

అడవి తల్లి అండగా వున్నావు

చల్లా జూడవమ్మా మాకు నిండుగా జూడవమ్మా ......”

ముత్యాలమ్మను కొలిచే సమయంలో తమ ప్రాంతంలో ఉన్న

ముత్యాలమ్మనే కాక ఇతర ప్రాంతాల్లో కొలువుదీరిన ముత్యాలమ్మను కూడా ఆహ్వానం చేస్తూ ప్రార్ధనలు సల్పడం కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలో కనబడుతుంది.

"…..ములకపల్లి నా నిలుచున్నా ఓ ముత్తేలమ్మా

కొటారు గొమ్మున నిలుచున్నా ఓ ముత్తేలమ్మా

ఇప్పూరునా నిలుచున్నా ఓ ముత్తేలమ్మా

పోచారమున నిలుచున్నా ఓ ముత్తేలమ్మా

తుమ్మిలేరున నిలుచున్నా ఓ ముత్తేలమ్మా

ఈచరణాలద్వారా ముత్తేలమ్మా అనుపేరుగల శక్తిదేవతఅన్ని ప్రాంతాలలోను నిలుచున్న రూపంతోనే ఉన్నట్లుంది. కొండరెడ్లు కన్నెపిల్లలను "గుబ్బట్లు" అని యవ్వనంలోని యువకులను "గోవులు" అని వ్యవహరించటం ఆనవాయితీ. యువతీయువకులు కలిసి ముత్యాలమ్మను పూజించేతీరునుతెల్పుజానపద గేయం

"……ముత్యాలమ్మకు సందడి చేద్దాం రండి గోవులారా

గుబ్బట్లని పిలుచుకురండి ఓ గోవులారా

డొల్లు, బొజాలు తెచ్చుకు రండి ఓ గోవులారా

గుబ్బట్లతోని కలిసి ఎగురుదాము ఓ గోవులారా …."

**దేవరమొక్కు :**

కొండరెడ్లలో పూజాపునస్కారాలు నిర్వహించే పండుగరోజుల్లో ఓరెం(నైవేధ్యం) పెట్టి దేవతలకు ఇలా మొక్కుకుంటారు. అమ్మా మీరు మాకు తాత ముత్తాతల కాలంనుంచి ఉన్నారు కాబట్టి, ఈ రోజు మేము "కొత్త మామిడికాయ అంటుకొను ముట్టుకుంట్టినన్, నీవుకూడా గంటకాపు నేలకాపు కాన్కో, నేను అడవుల వంక తిరిగిన ఊరుజాలు పోయినా, సంసేడుపోయినాకాని, కార కాపు నేల కాపు ఆకు నిల పాలూ పోయినా గాని నీవు కూడా ఈ కబురు అందుకు తల్లీ...." అని మొక్కుతారు.

**పోతురాజు :**

కొండరెడ్లు దేవతలనే కాక దేవుళ్ళనుకూడా కొలుస్తారు. పోతురాజు కొండరెడ్లకు ఇష్టమైన దేవుడు. పోతురాజునే వీళ్ళు రాజులన్నగా కొలుస్తున్నారు.

".....ముత్తేలమ్మను చూడు –ఆ పోతురాజును చూడు

కొండరెడ్లు కొలిసే ముద్దుల దేవులంటా ........"

**పెతర్లు :**

పూర్వీకులైన కుటుంబస్థులలో చనిపోయిన వారిని పెతర్లు అంటారు. పెద్దలు అనే మాట పెతర్లు అయి ఉండవచ్చు. కొండరెడ్లు చనిపోయిన తమ

పూర్వీకులు తమకు అండదండలుగా ఉండి తమను, తమ సంతానాన్ని కాపుకాస్తుంటారని నమ్ముతారు. అంతే కాదు పెతర్లని పండుగవేళల్లో ప్రత్యేకంగా పూజించి నైవేధ్యాలు సమర్పించకుంటే పెతర్లకు కోపంవచ్చి తమకు తమ పిల్లలకు పంటలకు పశువులకు కీడు కల్పించి గుర్తుచేస్తారని కూడా నమ్ముతారు. వీరు పెతర్లకు మొక్కు చెల్లించే విధానం ప్రత్యేకంగా ఉంటుంది. ఇంటికి లోపలే ఒక పక్క గోడకి నీళ్ళు పెట్టి కడిగి పసుపురాసి కుంకుమ బొట్లు దిద్దుతారు. అక్కడ నైవేధ్యంగా కొత్తబట్టలు పెట్టి కొబ్బరికాయలు కొడతారు. కోళ్ళు మేకలు, పందులు కోస్తారు. దేవరలు పడతారు. పెద్దలందరినీ 'మహతల్లీ' అని తలుస్తూ తమ వంశస్థులని ప్రమాదాలనుండి, రోగాలనుండి కాపాడమని మోకాళ్ళమీద కూర్చుని ప్రార్థిస్తారు. చనిపోయిన వారు తిరిగి తమ వంశంలో పుడుతారని కొండరెడ్లు నమ్ముతారు. పేతర్ కాని పేతర్ పిల్ల లంతాం" అని చెప్పుకుని ఆత్మలైనమీకు ఆత్మీయులైన పిల్లలుమేము నైవేధ్యం సమర్పిస్తున్నాం. స్వీకరించి మమ్మ చల్లంగ చూడండి అని అర్థం

**నైవేధ్యం:**

పండుగ వేళల్లో ముత్యాలమ్మకి ఓరెం(నైవేద్యం) పెట్టి సందడి చేస్తారు ఈ అంశంతో

".....ఆనతులు వాయిదాలు కూడాబెట్టండి

టెంకాయలు, కోళ్లు జామ చేయండి

ముత్యాలమ్మకి మొక్కుదాము

.........................................

ముత్యాలమ్మకి సందడి చేద్దాం రండి గోవులారా ....

ఓరపుకూడు పెట్టవలె రండి గోవులారా.....''

పండుగ వేళల్లో ముడుపులు తీర్చి అమ్మవారికి ముచ్చటలు తీరుస్తారు. ఆ కానుకలను స్వీకరించి సంతోషపడమని, తమ గుంపును అన్ని రీతులా కాపాడమని దేవతను ప్రార్ధిస్తారు.

''....ముడుపు కొట్టు ముత్యాలమ్మ ముచ్చటగురమ్మ

రాజులన్న సారలమ్మ సంతోషపడరమ్మ

సంతోషపడేరమ్మ .................'

పండుగ పూర్తి అగు సందర్భంలో చేసిన కొలుపుల సందడికి, పెట్టిన నైవేధ్యాలకు చల్లబడి, సంతోషపడి, తృప్తి చెంది కొండదేవతలైన ముత్యాలమ్మ, సారలమ్మ, రాజులన్న, అడవితల్లిని క్షేమంగా చూడాలని, గోవులను చల్లగా చూడాలని, బిడ్డలను చల్లగా చూడాలని, అండగా నిలవాలని ప్రార్ధిస్తారు. ఈ అంశంతో

''అడవి తల్లి అండగా వున్నావు చల్లా జూడువమ్మా

మాకు నిండుగా జూడవమ్మా

ఆటకు వచ్చిన గోవులకంతా చల్లా జూడవమ్మా ........"

**బలి :**

కొండరెడ్లకు ముత్యాలమ్మ, భూదేవి, గంగాలమ్మ, సారలమ్మ, గంటమ్మ వంటి కొండదేవతలు దేవుళ్లు, కొండరెడ్లలో ఎవరికైనా జబ్బు చేస్తే అందుకు దెయ్యాలు, మంత్రాలు కారణమని నమ్ముతారు. రోగాలు నయం కావడానికి వేపమండలతో రోగిని మంత్రగాడి చేత (వెజ్జు)కొట్టిస్తారు. ఒక్కొక్క సారి నయమవుతుంది, ఒక్కోసారి రోగం ముదిరి చనిపోతుంటారు. పంట చేతికి వచ్చిన వేళ తాము నమ్మిన దేవతలకి నైవేద్యం మనస్ఫూర్తిగా సమర్పించి పూజలు నిర్వహించకుంటే దేవతలకి కోపం వచ్చి ఇలా రోగాలు తెప్పిస్తారనే భయోత్పాత నమ్మకం బలీయంగా కలిగి ఉన్నారు. అలాంటి ఇబ్బందులు కలిగిన వేళ దేవతలను శాంతింపజేయడానికి బలి ఇస్తారు. అంతేకాక పంటలు బాగా వస్తే అమ్మవారే అందుకు తోడుండినదని ఆనందంతో బలి ఇస్తారు. ఉత్సవాలు చేసే రోజుల్లోనూ ఊరి బాగు కోసం బలి ఇస్తారు. బలి అగు జీవుల్లో మనుషులు కూడా ఉంటారన్నది రహస్య సత్యం. ఇటీవల నరబలి తగ్గింది. దున్నపోతులను, పందులను, మేకలను, గొర్రెలను, కోళ్ళను బలి ఇచ్చే రీతి నేటికీ ఉంది. ఈ అంశాలన్నీ కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలో కన్పిస్తున్నాయి.

**మేకలు :**

అమ్మ వారి పూజకు మందలోని మేకలను బలి ఇస్తారు.

"....మేలైన అమ్మ వారికి మేక పోతులు చేల్లివోలేదో

మావూరి అమ్మవారికి మంద మేకలు చేల్లివోలేవో ........."

**గోవులు :**

ముత్యాలమ్మకు మేకపోతులు, గొర్రెపోతులు, కోళ్లు, పందుల్ని బలి ఇస్తారంటు తెలుపు చరణాలు.

"మేకపోతులంటా గొర్రె పోతులంటా

పందులంటా కోళ్ళంటా

తల్లులకి పెట్టేరంటా ........"

**దున్నపోతులు :**

దురుసైన అమ్మవారికి దున్నపోతులు బలి ఇస్తామనుకొంటున్నారు

"దురుసైన అమ్మవారికి దున్నపోతులు చేల్లివోలేవో ......"

**కోళ్లు,పందులు :**

పందులను, కోళ్ళను తల్లి దేవతలకు నైవేద్యంగా పెడుతున్నట్లు తెలుపుతున్న చరణాలు .

"పంది కోళ్ళం టా తల్లులకి పెట్టేనంటా ........"

ఆదివాసీల జీవన విధానంలో బలి ఇవ్వడం సర్వ సాధారణ విషయంగా భావిస్తున్నారు. నిషేధం ఉన్నప్పటికీ యిప్పుడు కూడా

బలులు ఇవ్వడం అనే ఆచారం కొనసాగుతూనే ఉంది. ఉగ్రరూపులైన ఆగ్రహించిన దేవతలను శాంతింప జేయాలంటే బలి తప్పనిసరి అని నమ్ముతున్న వాళ్ళు వీరిలో నేటికీ ఎక్కువమందే ఉన్నారు.

**వెజ్జు :**

కొండరెడ్ల తెగలో కులపెద్ద, పూజారి, వెజ్జు చాలా ముఖ్యమైన వాళ్ళు . ఈ ముగ్గురి ఆధీనంలోనే పంచాయితీలు నిర్వహించి ధర్మాధర్మాలను నిర్ణయిస్తారు. ఈ ముగ్గురి అదుపు ఆజ్ఞలను కొండరెడ్లు గౌరవిస్తారు.

కొండరెడ్లకు మంత్రంతోనూ వనమూలికలతోనూ వైద్యం చేసే వ్యక్తిని వెజ్జు అంటారు. ఇతను శక్తి ఆరాధకుడుగా ఉంటారు. దేవతలను ఉపాసించడం ద్వారా కొన్ని అపూర్వ శక్తులను వశం చేసుకుని ఉంటారని నమ్ముతారు. దేవతారాధన విషయాలలోనూ, కుటుంబ సంబంధ వేడుకల్లోను వెజ్జు పాత్ర ప్రాధాన్యాన్ని సంతరించుకుని ఉండడం కొండరెడ్ల ప్రత్యేకత. పూజారి లేని చోట వెజ్జు పూజారి పాత్రను కూడా వహిస్తాడు. ఇతనికి కుల పెద్దకు ఉన్నంత ప్రాధాన్యత ఇస్తారు. రోగిని మంత్ర దండంతోనూ, వేప మండలతోనూ మంత్రించి కొడుతుండడం వెజ్జు వైద్యంలో ప్రథమ చికిత్స. వెజ్జు దగ్గర వడ్డెదండ, పరుశగొడ్డలి, గలిబి, ముయ్యనపాదులు ఉంటాయి. పాము, పురుగు కుట్టినపుడు, దెయ్యాలను భూతాలను నమ్మి భయోత్పాతులైనపుడు, చేతబడులనే మూఢ నమ్మకాలకు లొంగినపుడు వెజ్జు తన చేతిలోని మంత్ర దండాల లోని ఒక

దానితో మంత్రించడం కద్దు. అందుకు వెజ్జు చేసే మంత్ర తంత్ర విద్యల వైద్యంపట్ల వీళ్ళకి విపరీతమైన నమ్మకం.

**పండుగలు :**

కొండరెడ్లు దసరాపండుగ, చికురుకొయ్ పండుగ, కొండరాజుల పండుగ, జీలుగుకల్లుపండుగ, జొన్నకొత్తపండుగ, మామిడిపండుగ, భూదేవిపండుగ, సామకొత్తపండుగ, పచ్చపండుగ అని అనేక పండుగలను చేసుకుంటారు. కొండరెడ్లలో కాస్త ఆర్థిక ఒనరు చేకూరుతుంది అంటే చాలు పండుగ వాతావరణం చుట్టుముట్టేస్తుంది. అందరు కలసి విందులు చేసుకుని తినడం తాగడం ఆట పాటలతో వినోదించడం వీరిలో ఎక్కువగా కన్పిస్తుంది.

**దసరా పండుగ :**

ఉత్సవ వేళలంటే యువతీ యువకులకు ఉత్సాహం. ఇల్లు వదలి బయటి ప్రపంచంలోకి వెళ్లి అద్భుత ప్రపంచాన్ని దర్శించబోతున్నామన్న యువతుల ఆతురత, గడపదాటి వస్తున్న కన్నెపిల్లల మనసు దోచుకోవడానికి ఇదే అదును అని యువకుల ఉత్సాహం. పండుగ వాతావరణమంతా యువతీ యువకుల్లోనే కలగలుపుగా కనిపిస్తుంది. ఈ అంశాన్ని ప్రతిఫలించేలా కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలో తీరికలేని ఇతర

కాలాలల్లో కన్నా ఉత్సవ వేళల్లో కలిసి పయనిస్తామంటు దసరా ఉత్సవాన్ని ఉటంకిస్తూ చరణాలున్న పాట.

"ఉందాము ఉందమనగా ఉనికి పుట్టని కాలాలాయే

పోదాము పోదామనగా పోడుపేట కాలాలాయే

వెళదాము వేళదామనగా వేడుకీల కాలాలాయే

ఈ కన్నెకు కలుసుకుందాం –దసరాకు దంచుకుందాం ......."

**మామిడికాయ కోత పండుగ :**

కొండరెడ్లు మామిడికాయకోత పండుగను అత్యంత ఉత్సాహంగా జరుపుకుంటారు వీరికి ఈ పండుగ ఎంతో ముఖ్యమైంది, ఈ పండుగను వేరువేరు కుటుంబాల వాళ్ళు వేరువేరు దేవతలను మామిడికాయ పండుగ సందర్భంలో పూజిస్తారు. పూజార ఇంటిపేరుగల వారు ముత్యాలమ్మ తల్లిని, నిమ్మకాయల వాళ్ళు పోతురాజును, విద్దెల వాళ్ళు పుట్టలమ్మ తల్లిని, వాల్లలవాళ్ళు దేవతమ్మను కొలుస్తారు. కొండరెడ్లు మామిడి కాయ కోతపండుగ, భూదేవిపండుగా, రాజులపండుగ, టెంకపండుగ లను పూర్వం వేరువేరుగా ప్రత్యేకమైన రోజుల్లో చేసుకునేవారు. కానీ యిప్పుడు ఈ పండుగల నన్నింటిని వరుసగా మూడురోజులు చేసుకుంటున్నారు. పూర్వ కాలంలో కొండదేవుళ్ళకి పులి మొక్కుల పండుగ జరుపుకునే వాళ్ళు. ఈ పండుగరోజు కొంతమంది తమకు తాముగా కొండ దేవరకు ఆత్మార్పణం చేసుకునేవారంట. అంటే

నైవేద్య వేళల్లో కొండపైనుండి కిందకి దూకి కొండ దేవరకి ఆత్మార్పణం చేసుకునేవారని హైమండార్ఫ్ తన రెడ్డిస్ ఆఫ్ ది బైసన్ హిల్స్ అనే గ్రంథం లోని 202పేజిలో Human Sacrifice అనే శీర్షికన తెలియజేశారు. కానీ నేడు ఆ విధానం మార్చుకున్నామని కొండరెడ్లే తెలియజేశారు.

సాధారణంగా మామిడిచెట్లు పూతకొచ్చి పిందె కాయలతో ఉన్నప్పుడు ఒకరోజు గ్రామస్తులంతాకూడి రచ్చబండ దగ్గర పండుగ చేసుకుందామని నిర్ణయించుకుంటారు. మామిడికాయ కోతపండుగను సోమవారంనాడు, దేవర్లపండుగను మంగళవారం నాడు, భూదేవిపండుగను బుధవారంనాడు జరుపుకుంటారు. దేవర్లపండుగనే పరమరాజుల పండుగ అని కూడా అంటారు. ఈ పండుగ రోజుల్లో ఒక్కొక్కరోజు ఒక్కోరకమైన జీవాన్ని బలిఇస్తారు. కోళ్ళని, మేకల్ని, పందిని బలి ఇచ్చి కప్పెడుతారు. మామిడికోత పండుగ రోజు ముత్యాలమ్మను పసుపు, కుంకుమ, సామన్నం, వరన్నం, గోంగూర, సేమకూర, తోటకూర, మొక్కజొన్నన్నం, కోడికూర మొదలగునవి నైవేద్యంగా పెట్టి మొక్కుతారు. రెండవరోజు పూర్వం దేవతమ్మకు దున్నపోతును ఊరేగింపుగా వీధంతా తిప్పేవారు. కానీ యిప్పుడు దున్నపోతు స్థానంలో మేకపోతుల్ని బలి ఇస్తున్నారు. మూడోరోజు భూదేవి పండుగ నాడు పందిని బలియిస్తారు. కొండరెడ్ల పండుగలలో ప్రాధాన్యత యిచ్చే పండుగ మామిడిపూత పండుగ. ఇంతకు మునుపు ఈ పండుగను పూత కాలంలో చేసే వాళ్ళు. యిప్పుడు దీనిని మామిడికాయల కోత పండుగగా

మార్చారు. ఈ మార్పుకి ప్రధాన ఉదేశ్యం పంట చేతికి రావటం పండుగకు ఆనవాలు. ఈ అంశాన్ని  తెలుపుతూ కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోని కథల్లోనూ పాటల్లోనూ చాలా చోట్ల ప్రస్తావనలున్నాయి. ఉదా.

"లే...లే...లే...లు లే...లే...లన్నా ఓ లే...లేలు లేల్లా..

లే...లే...లేలు లేలమ్మా లే...లె...లు లెల్లా..

మామిడి పూత పూసెనన్నా

పూవులు, దండలు గట్టి

మొద్దిగా తీగ పూసెనన్నా మొకారించి కొట్టు ........."

మామిడి పండుగ రోజుల్లో

అవిజం కొట్టు అరజన్న

డోలుకొట్టు భీమన్న

అంటూ  పాటలున్నాయి.

ఈ పండుగ రోజున యౌవనప్రాయంలోని ఆడపిల్లలు, మగపిల్లలు కలిసి  వరసైనవారితోనూ, జతకట్టాలనుకొన్నవారితోనూ  సరసోక్తులతో ఆటపాటలతో, మాటలు కలుపుతుంటారు. ఈ అంశాన్ని తెలియజేసే గేయ చరణాలు  (చిత్రం.37-45)

"రండి గోవులారా

వచ్చిందో పండుగ రండి గుబ్బట్లలార

.................................................

గుబ్బట్లని  పిలుచుకు రండి ఓ గోవులారా

డోల్లు బౌజలు తెచ్చుకు రండి ఓ గోవులారా

గుబ్బట్లతో కలిసి ఎగురుదాము ఓ గోవులారా .......''

ఈ పండుగలు నిర్వహించే మూడురోజులు కుటుంబసభ్యులు మొత్తం స్నానాలుచేసి కొత్తబట్టలు ధరిస్తారు. దేవుళ్ళకి జంతువుల తలల్ని, రక్తాన్ని, వాటి శరీరంలోని ప్రత్యేకనరాన్ని నైవేధ్యంగా పెడతారు. మెత్తటి మాంసాన్ని ప్రత్యేకంగా వండి దేవతలకు నివేదన చేస్తారు. అదేవిధంగా వరిఅన్నం, సామన్నం, సజ్జన్నం, పప్పన్నం, మొదలైన పండించిన పంటలకు సంబంధించిన ధాన్యాలు వండి మొత్తంగా దేవుళ్ళకి తూనికాకులో  నైవేధ్యం పెట్టి మొక్కు చెల్లిస్తారు. బలి ఇచ్చిన కళేబరం నుండి  వృథా అవుతున్న భాగాలను విత్తనాలతో కలిపి పొలంలో చల్లుతారు. దీన్నే పొలంలో, చేన్లో 'పొలకట్ట చల్లడం', అంటారు.  పండుగ రోజుల్లో స్త్రీలు, పురుషులు వారి వారి పూర్వీకులను తమ తమ ఇండ్లల్లో పసుపు, కుంకుమ, టెంకాయలు సమర్పించి  పూజిస్తారు. తర్వాత వారు వండిన వంటలను, భోజనాలను వనాలకు తీసుకువెళ్ళి అక్కడ ప్రతిష్టించిన దేవుళ్ళ దగ్గిర గ్రామస్తులందరూ ఒకే దగ్గర పోగుపోసి ప్రత్యేకంగా వండిన నైవేధ్యం పెట్టి మొక్కుతారు అలా మొక్కిన తర్వాత

తెచ్చుకున్న వంటలను అక్కడే పంచుకొని సహపంక్తి భోజనాలు చేస్తారు. దేవుళ్ళకి కోసి నైవేధ్యానికి వండగా మిగిలిన పంది మాంసాన్ని ఊరి వాళ్లందరూ సమానవాటాలుగా పంచుకుంటారు. భోజనాలు ముగిసిన తర్వాత సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకొని చిన్నపెద్ద అందరు ఆటపాటలకు ఉపక్రమిస్తారు. ఈ సందర్భంలో చిన్నపెద్ద అందరూ కల్లు, సారాయి సేవించి మధ్య రాత్రినుంచి  తెల్లారేవరకు ఆటపాటలతో గడుపుతారు. భూదేవి పండుగరోజు గూరెం  (బొమ్మను)తయారుచేసి సరదాగా ఆడుకుంటారు. భూదేవి పండుగ రోజున జంగమయ్య వచ్చి పండుగ నిర్వహిస్తారు. ఈ అంశం పాటల్లో

"లేలే లయ్యో లేలేల  లేలే లయ్యో లేలేల

చింతాకున తెప్పగట్టి మామిడాకున తెప్పగట్టి

తేల రావోయ్ జంగమోడ

గువ్వగువ్వపిట్ట గువ్వగువ్వపిట్ట

నెలచూసి గువ్వపిట్ట

లేలే లయ్యో లేలేలా లేలే లయ్యో లేలేల

మరుకాకున తెప్పగట్టి మరుకాకున తెప్పగట్టి

తేల రావోయ్ జంగమోడ

గువ్వగువ్వపిట్ట గువ్వగువ్వపిట్ట

సెలచూసి గువ్వపిట్ట

లేలే లయ్యో లేలేలా లేలే లయ్యో లేలేల

మేకల మంద మేకల మందా మనకాలం దిగు రామోయ.

**గూరెం :**

భూదేవి పండుగలో సరదాగా ఆడుకోవడానికి నిజమైన గేదెకోమ్ములతో అడవి గేదెను పోలిన ఒక బొమ్మను రెండు మంచాలు, వెదురుబొంగులను, నల్లటి గొంగళ్ళను ఉపయోగించి తయారుచేస్తారు. దానిలోపలికి ఒక మనిషి దూరి నిజమైన గేదెవలె గ్రామమంత తిరుగుతుంటే గ్రామస్తుల్లో కొందరు కుక్కలను ఉసి గొల్పినట్లు మరికొందరు విల్లంభులవలె మంచం కోళ్ళను భుజానికి తగిలించుకొని మాంసంకోసం ప్రయత్నించే వేటగాళ్ళ వలే వేషాలు కట్టారు. వీరిని కమ్మర్లు (వేషగాడు)అంటారు, వీరు కుర్రేయ్ అంటు పెద్దగా అరుస్తూ హాస్యం చేస్తు గూరేన్ని చుట్టుముడుతుంటే అది పొడిచే దాని వలె మీదకు వస్తుంది. ఈ విధంగా గూరెన్ని ఊరంతా తిప్పి వస్తువులు, డబ్బులు వసూలు చేసి సాయంత్రం 4-5 గంటల ప్రాంతంలో నిజంకాని బాణంతో గూరేన్ని చంపేస్తారు. తర్వాత గూరేన్కి గూరముద్ద (పిండంలాగాచేసి)వేస్తారు. ఈసందర్భంలో దొరలపాట పాడుతారు.

ఏమామ కొట్టాడు, ఏ మామకొట్టాడు

చింత పూల వన్నె గూరెన్ని .....

రావాకు కొమ్మజోడు ఓ మా బావ కొట్టింది

చింత పూలవన్నె గూరెన్ని ......"

అంటూ  పాట పాడుతారు తిరిగి వసూలుచేసిన డబ్బుతో రాత్రి విందు చేసుకుంటారు.

**పచ్చ పండుగ :**

పచ్చపండగ అంటే బొబ్బర్లు, పెసర్లు, కందులు, చిక్కుడు మొదలైనవి పచ్చిగా ఉన్నప్పుడు కోసుకొని నిప్పుల్లో కాల్చుకొని తినే పండుగ. పండుగకు ముందే ఎవరైనా వాటిని చేలల్లోనే పచ్చివి తింటే గ్రామంలో పులులు, ఎలుగులు సంచరిస్తాయని భయపెట్టడం. ఇదే తర్వాతి కాలంలో నమ్మకంగాకూడా మారింది. అందుకని పచ్చపండుగ చేస్తారు.  ఈ విషయం గేయాలల్లో రాలేదు. కథలో భాగంగా వచ్చింది. పచ్చపండుగకి అల్లుడిని పిలిచినట్లుంది.  ఆ రోజు చేలల్లో పండిన బొబ్బర్లు పెసలు కందులు చిక్కుడ్లు కోసుకొచ్చి నిప్పుల్లో కాల్చి నైవేధ్యం పెడతారు. దీనినే పచ్చపండుగ అంటారు. దీన్నికూడా అందరూ సామూహికంగా చేసుకుంటారు. నైవేధ్యం అయిన తర్వాత ఆట పాట విందు వినోదాలు ఉంటాయి.

**వివాహాచారాలు :**

కొండరెడ్ల వివాహాచారాలు పరిశీలించినపుడు ప్రధానంగా వీరు మేనరికానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మేనరికం వ్యవస్థ ద్రావిడసంస్కృతిలో భాగం. ఈ వ్యవస్థకు సంబంధించిన ఆనవాళ్ళు వీరి మౌఖిక సాహిత్యంలో చాలా చోట్ల ప్రస్తావితమైంది.

కొండరెడ్లు కుదుర్చుకొనదలచిన పెళ్లి సంబంధం గురించి ముందుగా వాకబు చేసుకుని తర్వాత ఊరు ఊరంతా వెళ్లి పెళ్లి సంబంధం మాట్లాడుతారు. ''అయ్యా మేము బంధుగులకు దగ్గరమైతిమి, కాయో పండో మీరే చెప్పండి ఇష్టమైతే ఇయ్యండి, కష్టమైతే మానుకోండి, మీకు మాకు ఏరోజు విరోధం లేదు కాబట్టి మా పిల్లను తీసుకో సంతోషవియ్యి వో కాదనము'' అని వియ్యం అడుగుతారు. అలా అడిగిన వియ్యం నిర్ణయమైతే 'వచ్చిన వారందరూ '10 కాల సారా తాగి, పెద్దల సమక్షంలో' వివాహం నిర్ణయిస్తారు. ఈ అంశాలు కథల్లో ఎక్కువగా విన్పించారు. గేయాలల్లో కూడా ఈ విషయాలు కన్పిస్తున్నాయి.

**మేనరికం :**

తల్లి తరపు అన్నదమ్ముల బిడ్డలతోగాని, తండ్రి తరపు అక్క చెల్లెళ్ళ బిడ్డలతోగాని వివాహం కావడం మేనరికం. ఈ రకమైన వివాహాలను మేనరికపు వివాహాలంటారు. మేనబావ చెంగున సెనగలు కట్టి కొంగున కొబ్బరి కట్టి కోరి వచ్చాడని తెలుపుతున్న అంశం

"చెంగున సెనగలు కట్టి చేరి వచ్చెడి మామయ్య కొడుకు

కొంగున కొబ్బరి కట్టి కోరి వచ్చిడి మామయ్య కొడుకు ......"

అలాగే మామకూతురు మరదలు వరుసవుతుంది. మేనబావలు మరదలితో సరసమాడ ప్రయత్నిస్తుంటారు. మేనబావంటే ఇష్టమైతే ఆ సరసాలకి అంతు పొంతు ఉండదు. అలా కాకుండా మేనబావంటే ఇష్టం లేకుంటే అపుడు మరదలికి గయ్యాలితనం మామకొడుకును సిటి గరిటలతో తరుముకొనే దాకా వస్తుందనే అంశంతో గేయం

"గంటె కర్ర గలగల మనగ –గయ్యాళిదో మామకూతురు

సిప్పకర్ర సిటసిట మనగ –చిన్నెలదో మామ కూతురు

చోడి కర్ర జోటజోట మనగ –సోకులదో మామకూతురు......."

వివాహ ప్రయత్నంలో అడుగడుగునా జరుగు అనేక వేడుకలు కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలో చోటుచేసుకొని ఉన్నాయి.

**సంబంధాలు చూడటం :**

సంస్కృతిలో భాగంగానే పెళ్ళి మానవజీవితంలో ముఖ్యమైన ఘట్టాలలో ఒకటి. వివాహబంధంద్వారా స్త్రీ పురుషుల మధ్య ధర్మబద్ధమైన దాంపత్యజీవనానికి, క్రమసంతానానికి, గృహస్థ జీవనం కలిసి నడిపించడానికి ఏర్పడినది వివాహబంధం. ఏ సమాజంలోనైనా

తమతమ పిల్లలు  జీవితంలో పెళ్ళి అనే బంధంతో సుఖసంతోషాలతో తులతూగాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. ఆచితూచి వ్యవహరించి నిర్ణయం తీసుకునే  సందర్భాలలో పెండ్లి ఒకటి. కొండరెడ్ల తెగలోకూడా తమతమ బిడ్డలకు సరిజోడైన వారితో వివాహం జరిపించాలని అందుకోసం వియ్యమందుకోగలవారిని నాల్గు దిక్కులు వెతికి నిర్ణయిస్తారని ఈ చరణాలు తెలుపుతున్నాయి.

"....అమ్మరా ఓ రమ్మా పెళ్ళి కావాలే

...................................................

తూర్పున పోయింది ఏమి కాలేదు

దక్షిణాది పోయిందో ఏమికాలేదు

పడమటి పోయిందో ఏమికాలేదు

ఉత్తరాది పోయినా ఉరికైనా వచ్చిరి

అయ్యారా ఓ రయ్యా సంబందం కుదిరి ......."

కొండరెడ్లు తమప్రాంతంలో అనువైన పెండ్లి సంబంధం దొరకకపోతే పొరుగు రాష్ట్రాలనుంచి కూడా పెండ్లి సంబంధాలు చూస్తారు. తమ ప్రాంతానికి దగ్గర్లో ఉన్న  ఒడిషా రాష్ట్రంలోని  చిత్తడి మాన్యంలోఉన్న తమతెగవారితో సంబంధాలు కుదుర్చుకొంటారు. జాడిదేశం (ఒరిస్సా ప్రాంతం)లో నివసిస్తున్న కొండరెడ్లు తమ ఇంటి ఆడపడుచులను

ఆంధ్రప్రదేశ్ లోని కొండరెడ్లకు ఇచ్చి సంబంధాలు చేస్తారు. కాని ఆంధ్రప్రదేశ్ లోని కొండరెడ్లు అక్కడికి పిల్లనివ్వడానికి ఇష్టపడరు. ఇందుకు ప్రధాన కారణం ఆ ప్రాంతంలో ఈ ప్రాంతపు అమ్మాయిలను ఇస్తే వారికి ఆరోగ్యం కురురుగా ఉండదని నమ్మకం. ఇప్పటికీ ఈ విషయం కొనసాగుతుంది. అతితక్కువ మందే ఇచ్చిపుచ్చుకుంటున్నారు. ఈ అంశాన్ని తెలిపే పాట చరణాలున్నాయి.

“జాడిదేశం జలుబుదేశం –పిల్లకివ్వని పాపదేశం

పాపకియ్యని బాస దేశం............”

**వర నిశ్చయం :**

వధూవరుల నిశ్చయానికి వచ్చిన పేరంటాళ్ళు. బంధువులు అంతాకలిసి అన్నివిషయాలు చర్చించుకొని నిశ్చయించుకున్నాక కల్లు సారాయితో విందు చేస్తారు .

“.......పిల్లజూడ వచ్చిన పెద్ద – పిడికెడెర్కలు చెల్ల తిన్నడు .....”

చుట్టాలు తెచ్చిన కల్లు – మనమే తాగుదాం కన్నవార......”

**బొట్టుకుపోవడం (నిశ్చితార్థం) :**

వధూవరుల నిర్ణయం జరిగిన తరువాత పెళ్ళిని నిర్ణయించే సందర్భాన్ని నిశ్చితార్థంగా పేర్కొంటారు. సాధారణంగా కొండరెడ్లలో ఈ

ఆచారాన్ని వరునివైపు వారు వధువు ఇంటికి వెళ్లి తమ తమ చుట్టాల ఇంటిపేర్లు వివరిస్తూ అమ్మాయికి బొట్టు పెట్టి ఇక నుంచి ఈ అమ్మాయి మా కోడలు అని వెల్లడి చేసే ఆచారం వీళ్ళల్లో ఉంది. అందుకనే ఆ కార్యక్రమానికి వెళ్లడాన్ని బొట్టుకుపోతున్నాం అని వ్యవహారిస్తారు. దీనిని తెలిపే చరణాలు.

"..... కుంకుమేరో బొట్టు పెట్టగ కూడినాము ఇందరము

కాటుకేరి కండ్లు దిద్దగా కలిగినాము ఇందరము....."

సాధారణంగా ఈ నిశ్చితార్థం ఉదయం పూట చేసే కార్యక్రమంగా దీన్ని పాటల్లో విన్పించారు. పండ్లు తోముకునే వేళ తర్వాత జలకాలాడే వేళ అని, తర్వాత జావ తాగే వేళ అని ఈ మూడు రకాల అవసరాలు తీరిన తర్వాత బొట్టు పెట్టే వేళ అని నిశ్చితార్థ సమయ నిర్ణయం చెప్తున్నారు.

"...... బాల బాల పోద్దులాయే పలుకర్ర వేళలాయివా

జామ జామ పోద్దులాయే జాలుకాలు వేళలాయివా

జావా తాగే వేళలాయివా

బొమ్మొత్తు పొద్దులాయే బొట్టుపెట్టు వేళ లాయివా

సాధారణంగా ఈ కార్యక్రమానికి అమ్మాయికి స్నానాలు చేయించి మైపూతలతో అలంకరించి వారు పండించిన ధాన్యంలో కూర్చోబెట్టి తీసుకువస్తారు. ఆ తర్వాత తమ బంధువుల ఇంటి పేర్లు చెప్తూ బొట్టు

పెడతారు. ఆ తర్వాత పెండ్లి కబురు వెల్లడిస్తారు.

**పెండ్లి కూతుర్ని చేయడం :**

**మంగళ స్నానం :**

వేడినీళ్ళను, చన్నీళ్ళని కలిపి చిక్కుడు చెట్టు కింద జలకాలకు కావలిసిన మైపూతలు, సుగంధ ద్రవ్యాలతో సీతాదేవికి జలకాలాడించినట్లు తమ ఇంటి పెండ్లి కూతురును సీతాదేవిగా భావించి పాడుతున్నారు.

"....వెన్నీళ్లు చన్నీళ్లు వెయ్యారో కడవ

చిక్కుడు చెట్టు కింద సీతజాలుకము

ఈ రావి ఆ రావి మట్టెల్ల రావి

తోటి కోడలు పెండ్లి తొగరియ్యి రావి ...."

**పెండ్లి కూతురు అలంకరణ :**

కాలికి అందెలు ధరించి మన్నెల రవికలు తొడిగి అందంగా గువ్వలా ఒదిగి ఉన్న పెండ్లి కుమార్తె వర్ణన.

"....బొంతచాటు బొబ్బర గువ్వా

కాలి అందెల బంగారు గువ్వయా

సామపూవు రైకదాన చన్ను  చక్కని పెండ్లికూతురా ...."

**పెండ్లి పందిరి :**

కొండరెడ్లు 'వాడకొమ్మును' పెండ్లిపందిరి కొయ్యగా వేయడంలో ఒక విశేషం ఉంది. చాటుగా పొంచి ఉండి చూసి వేటాడడానికి 'వాడవేసి కొట్టడం' అంటారు అలాగే పెండ్లి పందిరికి వాడకొమ్మనే వేయాలని కొండరెడ్ల ఆచారం. దీనిని నూలు పోగుల దారాలతో అలంకరించారని తెలిపే గేయం

"....వాడే కొమ్మను జీరుగోడ్డగ - పడ్డ దయ్యో పచ్చపూలగా

అచ్చు కోడలయ్యే కోడలా లాలచ్చిరి బాల కోడలా ......."

**పెండ్లి పందిరి అమరిక :**

పెండ్లిపందిరి, పెండ్లితోరణం, పెండ్లిపీట, అక్షింతలు, బాసికం, తలంబ్రాలు వంటివి పెండ్లిలో ప్రధానమైనవి. ఇవన్నీ కొండరెడ్ల పెండ్లి విధానంలోనూ కన్పిస్తున్నాయి. కాబట్టి ఈ సంప్రదాయం అనాది కాలం నుండి వస్తున్న ఆచారంగా భావించవచ్చు.

"..భూదేవి అంత పీసెలు పోసి –ఆకాశమంత పందిళ్లు వేసి

చుక్కలకు అక్షింతలు – సూర్యుడికి బాసికమే యా

గుచ్చిన ముత్యాలతోరణాలు గట్టి

గుచ్చని ముత్యాల తలంబ్రాలు పోసి

లక్ష్మికళ్యాణమో శుభలగ్నమో – సీతకళ్యాణమో సౌభాగ్యమో....."

**కాలి గోళ్ళ నలుగు :**

పెండ్లిలో పాలధార తాకించి వధూవరుల కాలిగోళ్ళను తీయడమనే ఆచారం కొండరెడ్ల వివాహ వ్యవస్థలో కనిపిస్తుంది. ఈ అంశాన్ని కొండరెడ్లు తమ పెండ్లిపాటల్లో ఇలా వర్ణించారు. దక్షిణ ప్రాంతం నుంచి వచ్చిన పెద్ద మంగళికి కాళ్ళ గోళ్లు తీసినందుకు గొర్రెమాంసంతో విందు ఇస్తామంటున్నారు.

"....దక్షిణ నుంచి వచ్చిందోయ్ దొడ్డ మంగలి

కాలిగోళ్ళ తీయు మంగలకి ఏమితో విందు

గోరు తీయు మంగలికి గొర్రెతో విందు ...."

**కన్యాశుల్కం(ఓలి) :**

సాధారణంగా కొండరెడ్ల పెండ్లిలో ఓలి చెల్లించటం వారి ఆర్థికస్థితిని బట్టి ఉంటు౦ది. మేనమామ అయినాకూడా తప్పని సరిగా ఓలి యిచ్చే పిల్లను కోరాలి. అలా మేనమామ పిల్లను కోరి మేనకోడలిని ఉదాసీనంగా తీసుకెళ్ళలేదు – ఓలిగా బొందులు, బొమ్మలు, మాడలు, డాబాలిచ్చి తనను కొనుక్కొన్నాడని తెలుపుతుంది ఈ పెండ్లి పాట .

".... అందానికొ మేనమామ బోందులిచ్చోనన్నెకొన్నడు

బులుపులకో మేనమామ బొమ్మలిచ్చోనన్నేకొన్నడు

మెప్పులకో మేనమామ మాడలిచ్చోనన్నెకొన్నడు

దరువులకో మేనమామ దాబాలిచ్చో నన్నేకొన్నడు......"

**పెండ్లి :**

లగ్నం కుదిర్చిన వేళకి పెండ్లి జరుపుతారు. పూర్వం కొన్నిరోజుల పాటు పెండ్లి సందడి చేసేవారు. వారం పది రోజులపాటు పెండ్లి సందడి జరిగినట్లు చెప్పు గేయంలోని అంశం.

"..ఏడేడు రోజులు ఏక లగ్గేనం

పది రోజుల పెండ్లి పాప చినవాడిది...." (చిత్రం.47-48)

**పెండ్లికి వచ్చిన పెద్దలు :**

తమ ప్రాంతపు చుట్టుప్రక్కల గల ఊరి పెద్దలంతా వధూవరులను ఆశీర్వదించడానికి గుర్రాలపై వచ్చినట్లున్న గేయం చరణాలు, రాములోరి పెండ్లి అనే కథను చెపుతూ కూడా యి విషయాలను అందించారు. గేయంలోని విషయాలు.

".....జీడితోట చిట్టమరెడ్డి – జోడి గుర్రాన ఎక్కెరమ్మో

చోడిదొర ఎక్కె గుర్రం - బోడ్డులోన నిట్టెగలది....

కర్రిదొర ఎక్కె గుర్రం – కందిపూవు వన్నె గుర్రం

బొ౦దులూరి బొ౦త్రం రెడ్డి - బొ౦ల్లి గుర్రాన ఎక్కిరమ్మో

కానివాడ కాటమ రెడ్డి – కర్రి గుర్రాన ఎక్కిరమ్మో

రాజురాజులవారు రాజ్యాలవారు

రాజులు వచ్చిరో అక్షింతలాకి" ||లచ్చు కల్లెణమో||

**అక్షతలతో దీవెనలు :**

పెండ్లికి వచ్చినవారంతా వధూవరులను మన:స్ఫూర్తిగా దీవించడం ఆచారం. దీవెనలు ఇచ్చే వేళ వధూవరులపై అక్షింతలు వేయడ౦ సా౦స్కృతిక ఆచారం. దేశదేశాలనుండి దేవతలు, మన్నెంనుండి అయినవాళ్లు అక్షింతలు వేయడానికి వచ్చారని తెలియజేస్తుంది ఈ గేయం లోని చరణాలు.

".........దేశదేశాలవారు

దేవతలు వచ్చారో అక్షింతలుకి

మన్నెమన్నేలవారు మన్నేలవారు

మనవారు వచ్చారో అక్షింతలుకి"

అలా వచ్చినవారి ఆశీర్వాదం తీసుకోవడ౦ ఆచారం. దీనిని తెలియజేయు గేయం.

"....పల్లె పల్లెలవారు పడా౦డ్లు వచ్చిరో అక్షతలకి ......"

“లచ్చిమి కళ్యాణము  పెండ్లి కళ్యాణము

కళ్యాణము శుభ కళ్యాణము

బాల శిరసున అచ్చింతలు కళ్యాణము

లచ్చిమి కళ్యాణము  పెండ్లి కళ్యాణము

దేశ దేశ కోమట్లు వచ్చి అచ్చింతలు  వేసే

కళ్యాణము శుభ కళ్యాణము

పెండ్లి సందడిలో వియ్యంకులలో ఒక వర్గానికి చెందిన వారంటే మరో వర్గం వారికి  లోకువ. ఇంతకు మునుపు కాలంలో పెండ్లి కొడుకు ఇంటిలో పెండ్లి నిర్వహించేవారు. ఆడ పెండ్లివారు మగపెండ్లి వారి ఇంటికి వెళ్లి పెండ్లి జరిపించి వచ్చేవారు. సహజంగానే ఆడపెండ్లి  వారంటే సమాజంలో లోకువ. కొండరెడ్లల్లోనూ ఈ రీతి ఉన్నట్లు పాటలద్వారా తెలుస్తుంది. ఆడపెండ్లివారి బంధువులు మగపెండ్లి వారి దొడ్లలోని లేగలకు, అటికలోని అన్నానికి, కుదుటిలోని కంచాలకి, పోయ్యిలోని మాంసానికి ఎగబడుతున్నారని తెల్పు చరణాలున్న  పాట

“దొడ్డిలోని లేగలను చూచి – దొరబడ్డారు బందుగులు

అటుకులోని అన్నానికి చూసి – ఆశపడ్డారు బందుగులు

కుదుటిలోని కంచాలను చూసి – కుదుటబడ్డారు బందుగూలు

పోయ్యిలోని పొట్లానికి చూసి- పోగుబడ్డారు బందుగూలు''

**వియ్యాలవారి పేడుకలు :**

వివాహ సందర్భంగా వధువు తరపువారిని వరుడు తరపువారు, వరుడి తరపువారిని వధువు తరపువారు మేలమాడటం సహజం. ఈ అంశం కొండరెడ్ల గేయాలలో విస్తృతంగా కనబడుతుంది.

**వధువు తరపు వారిని వరుడు తరపు వారు మేలమాడడం :** పెండ్లి సమయంలో వియ్యాలవారు ఒకరినొకరు ఎద్దేవా చేసుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం అనడానికి చాలా ప్రాచీనులైన కొండరెడ్ల ఆచారాలలోకూడా ఈ అంశం ఉండడం ద్వారా తెలుస్తుంది.

''....ఆలవారో సీతమ్మ నీ పెండ్లి వారు

కాకరపూవుల కనకడక్కులు

ఆలవారో సీతమ్మ నీ పెండ్లివారు

గుమ్మడిపూవుల గుబ్బ గొడుగులు

ఆలవారో సీతమ్మ నీ పెండ్లివారు

గున్న చింతలలోన గుర్రాలవారు

ఆలవారో సీతమ్మ నీ పెండ్లివారు

ఎర్రగొప్పలలోన ఏనుగులవారు.....''

**వరుడి తరుపువారిని వధువు తరుపువారు మేలమాడటం :**

ఆడపెండ్లి వారికి మగపెండ్లి వారంటే మనస్సులో ఎంత భయం ఉన్నా మేలమాడే వేళ అ భయాన్ని మరిచి మరింత కీతగా అపహాస్యం చేసుకుంటారు. ఈ పాటలోని చరణాలలో కూడా మగ పెండ్లి వారిని ఇసుమంత కూడా విలువలేని వారని, తమలపాకు విలువ కూడా చేయరని, అతుకుల బొంత వారని, చీపుర పుల్ల విలువ కూడా వాళ్ళకి లేదని పలు విధాలుగా తక్కువ చేసి పాడుతున్నారు. పెండ్లి చేసేవారికి చేయి౦చుకోను వచ్చిన వారంటే విలువు౦డదు. ఆ అలుసులో వచ్చినవారికి మర్యాదలు చేస్తూ అపహాస్యం చేస్తుంటారు. ఈ అంశం ఉన్న పాటల్లోని చరణాలు

"…..ఆకులూరు అ౦గటివారు

అన్నదమ్ముల పెండ్లివారోయా

అతుకుల బొతుకుల పెండ్లి వారు

ఆకుల కట్ట విలువలేదోయా

చితుకుల బొతుకుల పెండ్లివారు

చీపురుకట్ట విలువలేదోయా….."

**పెండ్లికి వచ్చిన వారిని మేలమాడటం :**

పెండ్లికి వచ్చిన బంధువుల్లో కొందరిని చూస్తే ఏడిపించాలని అన్పిస్తుంది. అది వాళ్ళ మీద ఉన్న చనువు కావచ్చు లేదా వారి ప్రవర్తనలోని తేడా కావచ్చు. ఈ పాటలోని చరణాలల్లో ఈ అంశం స్ఫష్టంగా కన్పిస్తుంది. ఉదా 11

"....బొక్కులయ్యో పెండ్లివార – శోభేలయ్యో పెండ్లివార

ఉన్నాగాని లేదనే వారొయో  పెండ్లివారు ...."

**పెండ్లి పెద్దలను మేలమాడడం :**

పెండ్లి కుదిర్చిన పెద్దలను కూడా హాస్యం చేయకుండా వదిలిపెట్టరు. పిల్లకోసం వచ్చిన పెద్దను కూడా విందులో అధికంగా తినేస్తున్నాడని అపహాస్యం చేస్తున్న చరణాలు.

"....పిల్ల జాడ వచ్చిన పెద్ద – పిడికెడేర్కల చెల్లతిన్నడు"

**అప్పగింతలు :**

వరుడి తరపు వారు వధువు గ్రామానికి వచ్చి వధువును పెండ్లి చేసుకోవడానికి  తమ వెంట వరుడి గ్రామానికి తీసుకువెళ్లు సందర్భంలో వధువు ఊరి వారంతా పెండ్లి కుమార్తెనివాళి అందుకొని, పెండ్లి కూతురికి తమ తమ శక్తి మేరకు కానుకలిచ్చి వరుడి తరుపు వారికి అప్పగిస్తారు.

అప్పుడు అందరూ  వధువుకు శుభములు జరగాలని వధువు వెళ్ళే దారంతా శుభప్రదంగా ప్రయాణం సాగాలని ఆశీర్వదిస్తారు. ఈ అంశం తెలిపే గేయం

"సుఖము సేయుడు కన్నవార -చందురుడు తెలివాళ

ఆడవాలే పాడవాలె -వేడుకీలు సేయవాలే

సెలవుసేయుడు కన్నవార -చందురుడు తెలివాళ........"

"అమ్మ నిన్ను పంపెదమే తల్లి నిన్ను పంపెదమే

అత్వారింటికి పోయి మామ దసరదుకూ  మరి సేవ సేయవమ్మా

అమ్మ నిన్ను పంపెదమే తల్లి నిన్ను పంపెదమే

అత్వారింటికి పోయి అత్త కాంతమ్మకూ మరి సేవా చేయావమ్మా"

**అత్తవారింటికి వెళుతున్న ఊరి ఆడపడుచుకు వధువు ఊరి వారు చేయు నివాళి :**

సాధారణంగా కొండరెడ్లవారి పెండ్లిలో  వరుడి ఖర్చుతో వధువు ఇంటికి వచ్చిన బంధువులకూ, ఆ ఊరి వారికీ  విందు ఏర్పాటు చేస్తారు. దీనిసే 'పాలవిందు' అంటారు. విందు అయ్యాక పెండ్లికూతురిని వరుడి ఇంటికి తీసుకెళతారు. వరుని ఇంటికి వెళుతున్న ఆ ఊరి ఆడపడుచైన పెండ్లి కూతురికి ఆ ఊరివాళ్లు 'నివ్వాళి' ఇస్తారు. అది వస్తురూపంలోనైన, ధనరూపంలోనైనా ఉంటుంది, ఇల్లు వదిలి, ఊరు వదిలి, వేరే ఊరిలో, వేరే

ఇంటికి వెళుతునందుకు భయంతో బాధపడుతున్న పెండ్లికూతురికి నివ్వాళి రూపంలో ఇచ్చిన కానుకలను సరసోక్తులమధ్య పడేసుకుంటుంటారు. వాటితో దారిలో కల్లు తాగడమో, దుంపలు తీసుకొని తినడంలాంటి పనులు చేసారంటూతెలుపు సరసపుపాట.

"…..లిక్కుల పిన్నమ్మ లివ్వల పిన్నమ్మ

లివ్వాలేంచు జల్లుకున్నావా

కాపురాళ్ళ బండకాడ కల్లుతాగి జల్లుకుంతివా …..

నార దుంపల దొడ్డికాడ నడుమురాగా జల్లుకుంతివా …"

**పెండ్లి విందు :**

కొండరెడ్లు ప్రధానంగా పోడు వ్యవసాయంలో సామలు, జొన్నలు ఎక్కువగా పండిస్తారు. సామలతోనూ, జొన్నలతోను అన్నం వండి ఉలవపప్పు, ముదిరిన వంకాయకూర, ఉస్తికాయల చింతపులుసు చేసి పెండ్లిభోజనాలు పెట్టినట్లు అందులో చోడిరొట్టెలు కూడా పంచినట్లు ప్రస్తావితమైన విందు పాటలు ఉన్నాయి. మచ్చుకి ఒక పాటలోని చరణాలు

"సర్వేలి నిట్టల సామకూడు – చక్కగా వండుడు పెండ్లి వార

ఉడుకనుడుక ఉలవపప్పు……….

ముదిరిన వంకాయకూర – ఉస్తికాయ చింత పులుసు

......చోడి రొట్టెలు.....”

ముందుముందు రోజుల్లో తిన్న వంటకాలను ఏకరువు పెట్టడంద్వారా కొన్ని వంటల పేర్లు కన్పిస్తున్నాయి నీరుల్లితోను, వెల్లుల్లితోను కారాలు చేసుకున్నట్లు తెలుపుతున్నాయి ఈ చరణాలు.

“నీరుల్లిపాయ కారాలు చేసి నిన్న మొన్న తిన్న చెల్లదు

వెల్లుల్లిపాయ కారాలు చేసి – వేసిన పొద్దున్న తిన్న చెల్లదు.....”

**మందు :**

పెండ్లిలో విందుతోపాటు మందుపుచ్చుకోవడం కొండరెడ్ల సంస్కృతిలో భాగం. ఆ అంశాన్ని సాయంత్రం అయిపోతుంది చీకటిపడే వేళను మందువేళ అంటారు. మందుగా కల్లు, సారాయి వినియోగిస్తారు.

**కల్లు :**

కొండరెడ్లలో స్త్రీ పురుషులిరువురు కల్లు తాగడం అలవాటు. చిన్నాపెద్దా పాటించక వేడుకలకు తప్పనిసరిగా కల్లు ఇచ్చిపుచ్చుకోవడం కనబడుతుంది. ఈ పాటలో (చిత్రం.46)

“చుట్టాలు తెచ్చిన కల్లు మనమే తాగుదాము కన్నవార

కాపురాళ్ళ బందకాడ కల్లు తాగి జల్లుకుంతివా.....”

“చెట్టుకల్లుచెట్టునుండగా –సెమసెమ పాణాలయే

ఒగ్గుకల్లు వగ్గునుండగా –ఒరుగుఒరుగు పాణాలయే

మట్టకల్లు మట్టనుండగా –మత్తుమత్తు పాణాలయే

దిప్పకల్లుదిప్పనుండగా –దిమదిమ పాణాలయే”

“ కల్లయితె కాగిదిగాని –కంటిదోకి కనపడదు

గుమ్మున కాగిన కమ్మనికల్లు –కురిడెపిల్లి నంజుకాలు

కల్లుగీసొ చిన్నయత్తమ్మ –పేనపుడేగలేత్తుకుపోయివా”.

**సారాయి :**

బొమ్మొత్తువేళ అంటే ఉదయం 9-10 మధ్య కాలం. ఆ సమయంలో నిశ్చితార్థం చేసుకున్నాక విందు అయిన వెంటనే సారా తాగాలనే ఉవ్విళ్ళు ఊరింపు ఈ పాటలో కనబడుతుంది.

బొమ్మొత్తు పొద్దులాయే బొట్టు పెట్టు వేళలాయీవా

చరా చరా పోద్దులాయే సారా తాగే వేళలయీవా.....”

**నల్లమందు :**

నల్లమందును పుక్కిట పెట్టుకొనడం అలవాటున్న కొండరెడ్లు బోసిపోయిననోటకూడా నల్లమందును కుక్కుకున్నట్లు తెలుపుతుందీ పాట.

“......డొక్కితినో డొక్కెడు మందు - డెక్కి నోట వేసిడుకోన్నాడా

బరిణేతోడి నల్లమందు – బరివినోట వేసిడుకొన్నడు ......”

**వరుడి ఇంటికి అమ్మాయిఇంటివారు పంపే సారె :**

వధువుతోపాటు సారె రూపంలో వరుడి ఇంటికి చేరవలసిన వస్తు సామగ్రిని సారె అంటారు. సారె పంపడం పెండ్లిలో తప్పనిసరి ఆనవాయితీ. ఈ ఆచారం కొండరెడ్ల కథల్లోనూ గేయాల్లోనూ కనబడుతుంది. వధువు తెచ్చిన సారెను పెద్దమనిషిచేత మదింపు వేయిస్తారు. సారెలో బొడ్డుపోగుతాడు, ఊలులు, కుంకుమ, కురిపేలి, కాటుక, గంధం, తల్లికి తలకట్టు చీరలు ఉన్నాయో లేదో చూడమని చెప్తున్న గేయ చరణాలు.

“......చూచి విప్పు పెద్ద చూచి విప్పయ్యా

తల్లికి తలకట్టు చీరలున్నవా.....”

**పెండ్లి కూతురు పుట్టింటివారు వడిబాల సామాను సమగ్రంగా పంపకపోవడం :**

మరోగేయంలో వడిబాల సామాను ఖచ్చితంగా తేలేదని వరుడి ఇంటివారు ఏకరువు పెట్టడం కనిపిస్తుంది. వడిబాలలో ఉండవలసిన వొడిబియ్యం, చీరలు, రవికెలు, రాగి నాణేలు పంప లేదని తెలియ జేసే చరణాలు

“చుట్టాల బియ్యము లేదా – సుటి గల్ల కోకా లేదోయా

నయ్యదాపు రాగిలేదు – రంగుగల్ల రవికె లేదోయా

చిలుకు గల్లచీర లేదోయా – పట్టు గల్లబట్ట లేదోయా

కొంగు మూట వేటి వప్ప – కొంగు మూట కొలతల బియ్యం

వడి మూట లేటి వప్ప - వడి బాల కొలతల బియ్యం "

**పెండ్లి తిరస్కృతి :**

వరుసైనవారితో సరసమాడితే అందులో అందం ఉందిగాని వావివరుసలు యెరుగక ముచ్చటపడటం ధర్మబద్ధంకాదు. యౌవనప్రాయంలో నిలువరించలేని వాళ్లు, వావివరుసలు మర్యాదలు పాటించక వరుసలేని వారితో జత కట్టే ప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటి సందర్భంలో వరుస లేదని తిరస్కరించు రీతి ఈ విసర్రాయి పాటలో కనిపిస్తుంది.

"వెన్నెలేని పందిరికింద - వేసినామో చోళ్ళ తిరగలి

వాయు పోసో విసరబోగా - వాయు వాయుకు వరుసలడిగేవా

చేరుపోసో విసరబోగా - చేరుకు చేరుకు నెలలడిగేవా

తీగపోసో విసరబోగా - తీగతీగకు తివురులడిగేవా

వద్దురా గుంటడ వరుసలేదు - లేదుర బావ లేత పాయమా ....."

అంటూ తిరస్కరిస్తుంది.

**ఇల్లరికం :**

ప్రాచీన సమాజంలో ఉన్న  మాతృస్వామ్య వ్యవస్థ, పితృస్వామ్య వ్యవస్థగా పరిణతి చెందినదన్నది వాస్తవం. పితృస్వామ్య వ్యవస్థలో అల్లుళ్ళు అత్తగారి ఇంట ఉండడాన్ని ఇల్లరికం అన్నారు. ప్రాచీనజీవన స్థితికి దగ్గరగా ఉన్నప్పటికీ  కొండరెడ్లలో మాతృస్వామ్య వ్యవస్థ లేదు. పితృస్వామ్య వ్యవస్థే నడుస్తుంది. ఇల్లరికం వచ్చిన అల్లుళ్ళకు అత్తగారి ఇంటిలో చలాయించే పెత్తనం తక్కువగాను పనిచేసే బాధ్యతలు ఎక్కువగాను ఉంటాయి.  కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోని హాస్యపు కథల్లో ఇల్లరికపు అల్లుళ్ళ అవస్థలు అనేకం ప్రస్తావితం అయ్యాయి. కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోని గేయాలల్లో ఇల్లరికపు అల్లుడి పరిస్థితిని పట్టి చూపిస్తున్నాయి

అల్లుడిపైతే గొల్లిగాడిపైతే రారా ఇల్లరికానికి

రవిక దెచ్చి లంగాలుతికి మడతలు పెట్టి

మా యమ్మ కిచ్చే గొల్లిగాడి పైతే రారా

ఇల్లరికానికి  అల్లుడిపైతే నేమి ....

**అత్తవారింటికెళ్ళిన బిడ్డను తల్లి తలచుకునే విధానం :**

ఎవ్వరికైనా ఆడపిల్లను చూడంగానే పని చెప్పాలనిపిస్తుంది. చివరికి పందిటి గుంజకుకూడా ఆడపిల్ల అంటే అలుసే. నిద్ర లేచింది మొదలుకుని

ఆడపిల్ల ఇంటిచుట్టు చిమ్మడం, బిందెలతో ఇంటి అవసరాలకి కావలసిన నీళ్ళు మోసుకురావడం వంటింట్లో వంటకి అవసరమైన చిలకడం, నూరడం, దంచడం, రుబ్బడం, విసరడం వంటి పనుల్లో అమ్మకి చేదోడుగా ఉండడం పరిపాటి. ఇంత తోడుగా తనపనుల్లో పాలుపంచుకునే ఆడపిల్లలు వివాహం అయి అత్తగారింటికి వెళ్లి పోయాక ఆ తల్లికి ఒక చేయి విరిగినట్లే ఉంటుంది. కానీ బిడ్డకు పెండ్లిచేసి అత్తారింటికిపంపించామన్న ఆనందంతో పాటు తన పనులకు ఆసరాగా ఉండిన బిడ్డను ప్రతి పని సమయంలోనూ తలచుకుంటూ ఉంటారు. అత్తగారింటికి వెళ్ళిన బిడ్డ ఎలాఉందో అనుకుంటూనే ఆబిడ్డ లేక పోవడంతో తనకు పనులలో సాయం చేసే వారే లేరని చింతిస్తున్న తల్లి ఈ పాటలో కన్పిస్తుంది.

చిన్నాచ్చిన్నా చిన్నాచ్చిన్నా చీపుర్లాతో వాకిలూడు మా తల్లి .....

ఇకమైన మా యింట్లో వుడిసే వారేవరమ్మా ....

అమ్మనిన్ను ..... పుల్లాచ్చాచవతినీ ఒప్పాజెప్పితిమమ్మా ....

చినచిన్నా బిందెలతో నిల్లుతెమ్మా తల్లి .......

ఇకమైనా మా ఇంట్లో త్తేచ్చేదెవరమ్మా .....

పుల్లాచ్చాచ .......... చినచిన్న రోకలితో పోటువ్యే మాతల్లి .....

ఇకమైనా మా ఇంట్లో వేసేవరేవరమ్మా.....

**సంతానం :**

ధర్మబద్ధమైన దాంపత్యజీవన ప్రతిరూపం వంశాంకురం. పెండ్లిఅయిన దంపతులకు ఇతరులుఇచ్చు సలహాలలో సంతానభాగ్యం పొందాలన్నఅంశం ప్రధానంగా ఉంటుంది. దాంపత్య జీవనం ప్రారంభించి కొన్ని నెలలు గడిచిన నాటినుండి నీ, నా అనుభేదం లేకుండా గర్భంగురించి ప్రస్తావించడం అలవాటు.

"నెలలు మరిచో నేనుండగ

నెదునూరు పోవోయ్ ఘూటా (యువకుడా)

నేదు(పంది)మాంసం తేవోయ్ ఘూటా ....."

**సంతులేనితనం :**

'సంతు లేని సంసారం పంట రాని చేను ఒకటే' అని సామెత. దంపతులందరూ సంతానంకోసం ఆకాంక్షిస్తూ ఉంటారు. పెండ్లి అయిన కొంతకాలం నుంచి ఈ విషయం పట్ల ఆలోచనలు కలుగుతూనే ఉండడం సహజం. స0తాన లేమి నరక యాతనతో కూడింది. తమకు కలగలేదని తాము బాధపడుతుంటే ఇతరులు వీరికి సంతానం లేదని పెట్టే ఈతి బాధలు ఇన్నని చెప్పలేము. వయస్సు మీరుతున్న కొద్ది ఆ బాధ ఇనుమడిస్తుందే కానీ తరిగేదికాదు. అనుక్షణం ఎదో రీతిలో ఈ లేమి కొట్టొచ్చినట్లు బాధిస్తూనే ఉంటుంది. తను శ్రమించి సంపాదించిన కీర్తి ప్రతిష్టలు, దాచిన సొమ్ము అనుభవించు సంతానంలేక ఎవరికి పంచాలో

తెలియక, వయస్సుమళ్ళినాక ఎవరిని నమ్మాలో తెలియక, దిక్కులేక నానా యాతనలు పడుతుంటారు. తనదైన ఆస్తిపాస్తులను పంచి ఇద్దామంటే పిల్లలు లేరు. దాయాదులంతా తన్ను విడిచి పారిపోయారు. పరుల సొమ్ముయి పోతుందే నా కష్టార్జితం అని దు:ఖిస్తూ సంతానలేమితో బాధపడుతున్న తీరు కనిపిస్తుంది.

"...పాలెవాడు పారిపోగా - పంచిపెట్టు బాల లేదు...."

**అలంకరణ :**

మానవ జీవనంలో అలంకరణ ఒక భాగం. ప్రతి ఒక్కరికి అందం పట్ల ప్రత్యేక ఆకాంక్ష. ఎంత అందంగా ఉన్నా ఇంకా అందంగా ఉండాలనే ఆశే తప్ప చాలని ఎవరూ అనుకోరు. అలంకరణ అందాన్ని ఇనుమడింప చేస్తుందని నమ్మకం. అలంకరణకు వాడే సామాగ్రి అనేక రకాలు. దుస్తులు, ఆభరణాలు, మైపూతలు ప్రధానమైనవి. ఇవికాక గోళ్ళని, వెంట్రుకలని రకరకాలుగా అలంకరిస్తారు. ఈ విషయాలన్నీ పాటల్లోనూ కథల్లోనూ అక్కడక్కడ ప్రస్తావితమై ఉన్నాయి.

**మైపూతలు :**

**కుంకుమ :**

నుదుట తిలకందిద్దడం భారతీయుల ఆచారం. కుంకుమ మంగళకరమైన వస్తువుల్లో ఒకటి. పెండ్లిలో పసుపు కుంకుమల ప్రాధాన్యత ఎక్కువ.

కొండరెడ్ల ఆచారాలలో బొట్టుకుపోవడం అనే తంతే ప్రత్యేకంగా ఉంది. పెండ్లి సారేలో కుంకుమ ప్రస్తావన పాటలో లభ్యమైంది.

"కుంకుమేరో బొట్టు పెట్టగా – కూడినాము ఇందరమూ"

మరో పాటలో

"దానిలో ఊలులు ఉన్నవో లేవో

కుంకుమ కురిపేలు ఉన్నవో లేవో......."

**కాటుక :**

కండ్లకు కాటుక అందం ఇవ్వడమే కాకుండా కండ్లకు కాపుదల అని వైద్యం. భారతీయ సంప్రదాయంలో కాటుకదిద్దడం నాటినుండి నేటివరకున్న అలంకరణ సామాగ్రి. ఈ అంశం కొండరెడ్ల గేయాలలో ఇలా ఉంది.

"కాటుకేరి కండ్లు దిద్దగా – కలిగినాము ఇందరమూ"

**గంధం:**

గంధం మేనిఛాయను మెరుగుపరుస్తుంది. ప్రాచీనులు గంధంను మైపూతలలో వాడే వారనడానికి అనేక ఆధారాలున్నాయి. కొండరెడ్ల గేయాలలోకూడా గంధం ప్రస్తావన కన్పిస్తుంది.

"గంధాపు నలుగూకు నడవరే"

"....కాటుక గంధం ఉన్నవో లేవో ......"

**తొగరు (సుగంధ ద్రవ్యాలు) :**

జలకాలాడేటప్పుడు మైపూతలుగా అనేక సుగంధద్రవ్యాలతో కూడిన పొడులను వాడేవారు. కొండరెడ్ల పాటల్లో ఈ పొడులకు 'తొగరులద్దడం 'అని ఉంది.

".....వేన్నిళ్లు చన్నీళ్లు వెయ్యరో కడవ –

చిక్కుడు చెట్టు కింద సితాజాలుకము

ఈ రావి ఆ రావి మట్టేల్లరావి –

తోటికోడలు పెండ్లి తోగరియ్యు రావి ......."

**తలకు తైల సంస్కారం (కొప్పులు) :**

తలకు తైల సంస్కారం చేసుకోవడంవల్ల మేధస్సుకు స్థిమితత్వం కలుగుతుందని, జుట్టు అందంగా ఉంటుందని ఎన్నిహంగులుగా దువ్వాలన్నా వీలవుతుందని తలకు నూనెనంటుతారు. నూనె అంటిన కొప్పులతో నూతినీళ్ళకు బోయినట్లు తెల్పుతున్న చరణాలు

".....నూనె కొప్పుల పొన్న చిలుక –నూతి నీళ్లు ముంచబోగా

తలపాగల చిన్నమయ్య తగులుకున్నాడా....

చిక్కులిప్పంగా చీకటయింది-కొప్పులిప్పంగా తెల్లవారే ....."

**వస్త్రాలంకరణ :**

వస్త్రం మానవసమాజంలో స్త్రీ పురుషులకు శరీర ఆచ్ఛాదనకై ధరించేది. ఒకప్పుడు వైవిధ్యం లేని వస్త్రాలు నేడు స్త్రీలకు పురుషులకు వేరువేరుగా ఉన్నాయి. కొండరెడ్ల పాటల్లో నూలు బట్టల ప్రస్తావనతో పాటు పట్టుబట్టల ప్రస్తావనకూడా ఉంది. రోజువారి నూలు బట్టలు కట్టుకోవడం ప్రత్యేక సందర్భంలో పట్టుబట్టలు ధరించినట్లు పాటల్లోని చరణాలు తెలుపుతున్నాయి.

**చీర :**

స్త్రీలకు అలంకరణలంటే మరింత మోజు. ఎంత అలంకరణ చేసుకున్నా మరికొంత చేసుకొంటే అందంగా ఉండగలమని భావిస్తారు. స్త్రీల అలంకరణలో మైపూతలు, ఆభరణాలే కాక వస్త్రాలకుకూడా చాలా ప్రాధాన్యంఉంది. ఎన్ని వస్త్రవిశేషాలున్నా మరో కొత్తది తెచ్చుకోలేదన్న భావన ఎప్పుడూ ఉంటుంది. కొండరెడ్ల మౌఖికసాహిత్యంలో స్త్రీలు ధరించే చీరలు, రవికలు ప్రస్తావించడం చాలా పాటల్లోని చరణాలలో కన్పిస్తుంది. చీరలలోని అనేక రకాలను అవి కొన్న ప్రాంతాలను, వాటి రంగులను, వాటిని నేసిన నేతగాళ్ళను, వాటి పైనున్న పూలఅల్లికలను కయికట్టిన తీరు కనపడుతుంది. అలాగే రవికల రకాలను అవి కొన్న సంతల్ని, వాటి రంగుల్ని రకరకాలుగా చిత్రించి పాడారు.

**చీరల రకాలు :**

కొండ సంత మండువలో కొన్నాడంటున్న మొగ్గల చీర ఇది. చీరపై నుండు మక్కువకి నిదర్శనం

"....కొండ సంత మండువలోన – కొన్నాడయ్యా మొగ్గల చీర "

కూరగాయలను, నార వస్తువులను అమ్మి కరకువన్నె చీర కొన్నట్లు తెలుపు పాట

"కూరలమ్మి, నారలమ్మి కరకువన్నె చీరగోన్నామా "

ఉమ్మడి కుటుంబంలో ఒకరు ఒక వస్తువు తమ సొంతానికి కొనుక్కొంటే ఇతరులకు కొననందుకు, కొనలేకపోయినందుకు కోప్పడడం, ఈర్ష్యపడడం, అసూయపడడం జరుగుతుంటుంది. అందుకని ఒకరికి తెలియకుండా ఒకరు చీరెలు, రవికలు, నగలు కొనుక్కోవడం చేస్తుంటారు. ఈ అంశం చీరలు కొనుక్కోవడంలో ఇలా తెలియజేస్తున్నారు. ఈ పాటల్లోని చరణాల్లో పలురకాల చీరలు కన్పడుతున్నాయి.

**అంటి వన్నె చీర :**

"అత్త మామలెరుగకుండ అంటి వన్నె చీర గోన్నమా ..."

**తొగరు వన్నె చీర :**

"తోటికోడలెరుగకుండ తొగరు వన్నె చీర గోన్నమా ...."

**గాగవన్నె చీర :**

"గంత కోడలెరుగాకుండ గాగ వన్నె చీరగోన్నమా ....."

**ఈత వన్నె చీర :**

"ఇంటి కోడలెరుగాకుండ ఈత వన్నె చీరగోన్నమా......"

పెండ్లిలో పిల్ల తరుపువాళ్లు పెండ్లికొడుకు ఇంటివారికి పంపు సారెలో చీరలు, రవికలు, బియ్యము.......మొదలైనవి పంపడం కొండరెడ్ల ఆచారం. పెండ్లికూతురు తెచ్చిన సారెలో చీరలు లేవని, పెండ్లి కూతురిని ఎద్దేవా చేస్తున్న చరణాలు

"చింత పూవు రైకదానా –చిలుకుచక్కని పెండ్లి కూతురా

చుట్టాల బియ్యము లేదు –సూటిగల్ల కొకలేదోయి"

**రవికలు :**

రవికలు ధరించిన అంశాలలో అనేక చరణాలున్నాయి. చీర, రవిక జతగలిగేలా ఉండాలి రంగురూపుల్లో, ఏ చీరకైనా తగిన రవిక తొడిగినపుడే ఆ బట్టలకు అందం. లేదంటే చీర అందం రవికకు నప్పదు. రవిక అందం చీరకు కుదరదు. కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలో చీరలతో సమానంగా రవికల ప్రస్తావనలున్నాయి. పెండ్లికూతురి అందచందాలు సామపువ్వు రైకలో, చింతపువ్వు రైకలో ఇమిడినతనాన్ని చెప్తున్నాయి.

**సామపూవుల రైక :**

"సామపూవుల రైకదానా చన్నుచక్కని పెండ్లికూతురా "

**చింత పూవురైక :**

"చింత పూవురైకదాన చిలుకుచక్కని పెండ్లి కూతురా....."

ఇంటిలోని ఇద్దరు ఆడవాళ్ళకి ఒకే రకం బట్టలుతెస్తే గొడవలుండవు చెల్లెలకి మరదలుకి ఒకే రకం తెచ్చినట్లు తెలుపు చరణం.

**సెనగపూవు రైక :**

"చెల్లెలు మరదలేరుగాకుండ –సెనగపూవు రైకగొన్నమా ......"

ఒకరు వేసుకున్న బట్టలు నచ్చితే అవి ఎక్కడ కొన్నారో తెలుసుకోవడంలో ఆసక్తి కనబరుస్తారు. ఏ సంతలో కొన్నారోనని తెలుసుకోవడం వాళ్ళకు తెలిసిన సంతలలో వీటిని కొన్నారేమో అని సందేహం వ్యక్తం చేస్తూ ప్రశ్నిస్తున్న తీరు కనబడుతుంది.

**ఎర్రరైక :**

"ఎర్రరైక లెక్కటివమ్మా –ఏలేశ్వరం సంతలకాటివా ....."

**పచ్చరైక :**

"పచ్చరైక లెక్కటివమ్మ-పిఠాపురం సంతలకాటివా ....."

పెండ్లికూతురు తెచ్చిన సారెలో నయ్యదాపు రాగి, రంగుగళ్ళ రవిక లేదని తెలుపు చరణాలు

**దాపు రవికె:**

లో దుస్తుల ప్రస్తావన వాళ్ళ కొండరెడ్ల వస్త్ర విశేషాలలో లోదుస్తుల్ని వాడె వారని తెలుస్తుంది.

"నయ్యదాపు రాగి లేదు - రంగు గల్ల రవికె లేదోయా ....."

**పురుషులు ధరించేవి :**

**తలపాగాలు :**

తలగుడ్డ పురుషునిపౌరుషానికి ప్రతీక. తలపాగాలు చుట్టుకోవడం భారతీయసంస్కృతిలో ప్రాచీనయుగాలనుండి కనబడుతుంది అనడానికి నిదర్శనం. ఈ అంశం కొండరెడ్ల పాటల్లో ఉంది. (చిత్రం.50)

"పచ్చతలగుడ్డ తెమ్మంతినో - పప్పులి బుల్లికి రమ్మంతినోయా

చీర తలగుడ్డ తెమ్మంతినో - సిరిగల బుల్లిని రమ్మంతినోయా "

"తలపాగజంగమయ్య-తగులుకున్నాడు నూటొక్కసేపోయా ....."

"...తాడులేరి పట్టబోగా - తలపాగ లేగురదన్నే ........"

**పంచెలు :**

మగవాళ్ళు పంచెలు ధరించడం ద్రవిడసంస్కృతి. ఎన్నో రకాలైన దుస్తులు వచ్చినప్పటికి సాంస్కృతిక సంప్రదాయ ఉత్సవాలలో పురుషులు పంచెలు కట్టి హడావుడి చేసేస్తుంటారు.

“ఏటి గట్టు సెవ్వడవు -ఎర్రపంచె దోవదులోయా

పాటిగట్టు సెవ్వడవు –పొట్టి పంచె దోవదులోయా”

**గోచిపాత :**

పురుషుల లోదుస్తుల్లోది. సాధారణంగా కొండరెడ్లల్లో పెద్ద వాళ్ళైన పురుషులు గోచిపాత తోటే రోజువారీ పనులలో తిరుగుతుంటారు. ప్రత్యేక సందర్భాలలోనే పంచెలు ధరిస్తారు. ఇప్పుడిప్పుడే చొక్కాలు ధరిస్తున్నారు. ఇప్పటి యువత లుంగీలు, ప్యాంట్లు, చొక్కాలు వేస్తున్నారు. (చిత్రం.49)

**ఆభరణాలు :**

ప్రాచీనకాలంలో స్త్రీలు పురుషులు ఇద్దరూ రకరకాల ఆభరణాలు ధరించేవారు. రాను రాను పురుషులు ధరించడం తగ్గింది. స్త్రీలకు ఇప్పటికీ నగలపై మక్కువ ఎక్కువగా ఉన్నట్లు కన్పిస్తుంది. తలశిఖరంనుండి కాలి వేళ్ళువరకు రకరకాలైన నగల ప్రస్తావనలు కొండరెడ్ల మౌఖికసాహిత్యంలో కన్పిస్తున్నాయి. ఒక్క పాటలోనే శరీరంలోని వివిధ అవయవాలకు ధరించే

నగలను ఏకరవు పెడుతూ లభ్యమైంది. అందులో మెడకు నానుతాడు, చేతికి మురుగులు, కడియాలు, చెవికి రింగులు, నడుముకు వడ్డాణం, చేతి వేళ్ళకు ఉంగరాలు, కాలివేళ్ళకు మెట్టెలు, కాళ్ళకు కండెలు, చెవికి కమ్మలు, ముక్కుకి బులాకీ, నత్తు, కర్ణమొగ్గలు, హంసకాడ, తలకు నెలవంక, సూర్యవంక, కొప్పుకు గొలుసులు ఇలా నగల ప్రస్తావనలు దొర్లాయి. (చిత్రం.51,52)

**నత్తు :**

ముక్కుకి కుడి ఎడమల వైపున రింగులాగా అమర్చే నగ పేరు నత్తు. నత్తు నాగరిక సమాజంలో తాత్కాలికంగా వేసే నగ. కొండరెడ్లలోని ఆడపిల్లలకు తప్పని సరిగా ముక్కు కుట్టిస్తారు. నత్తు బిగిస్తారు. నత్తు వీళ్ళల్లో నిరంతరం ధరించవలసిన ఆభరణం. ఈ అంశం గేయల్లో ఇలా ఉంది.

"నత్తులు తెచ్చెడి గోగిపూవు – పెట్టమన్నాడు గోగిపూవు......"

**గాజులు :**

స్త్రీలకు ఆభరణాలంటే మహాప్రీతి. అందులోనూ చేతికి గాజులు వేయక స్త్రీలుండరు. రకరకాల గాజులను సంతల్లో తెచ్చుకొంటూ ఉంటారు. చిట్టి గాజులు కొనిపెడతాను సంతకురా అని పిలుచుకుంటున్నారి పాటలో

"చింతలు చెల్లివి సంతకు పోదాం –చిట్టిచిట్టి గాజులు కొందాం "

గాజులు లేని చేతులు కట్టేపుల్లలని పిల్లలు మొదలు పెద్దవారైన ఆడవాళ్ళని పెద్దలు అపహాస్యం చేస్తుంటారు. ఎవరి చేతినైనా గాజులు లేకుంటే తను తెచ్చుకొన్న గాజుల్లోనుంచి కొన్ని గాజులను ఇస్తుంటారు. గాజులేని చేతిని ఈసడిస్తున్న చరణం.

"చేపలేదో జేల్లలేదో –చేతనోక్క గాజులేదోయా......"

మరో పాటలో

దిల్లీ మలారం నుండి వచ్చిన గాజులని వేసుకొన్నట్లు తెలుపుతున్న నల్లగాజుల చిత్రీకరణ

"అయ్యచేత నల్లగాజు నేలి పూరమంపినాను

నెల్లిపూరాన కల్లుటగా మళ్ళి వచ్చింది నల్లగాజు

డిల్లీకి డిలకరి మలకరి గాజోయా ......."

**నానులు :**

"మేడాకి నానూలు తెస్తరంట

మెడ సాగాదీసి పెడతారంట"

**వడ్డాణం :**

"నడుమూకి వడ్డానం తెస్తారంట

నడుమూ సాగదీసి"

**కడియాలు :**

చేతికీ కడియాలు తెస్తారట

చెయ్యా సాగదీసి పెడతారంట

**పూసలు :**

పూసల వ్యాపారస్తుని ప్రస్తావనలో నల్లపూసలు, రంగుపూసల ప్రస్తావన కనబడుతుంది.

"నయ్యకానో నల్లటివాడు – నల్లపూసల బెరగాడోయా

నయ్యకానో రంగులవాడు –రంగుపూసల బేరగాడోయా"

అదేవిదంగా నల్లపూసల దండను గూర్చిన ప్రస్తావన గల చరణాలు.

"నల్లపూసల పేరులాగా నలిగిపోండమ్మా......."

**అందెలు :**

"బొంతదాటు బొబ్బరగువ్వా ....

కాలి అందెలు బంగారు గువ్వయా...."

**అలంకరణకు వినియోగపడే సామాగ్రి :**

కొండరెడ్లసాహిత్యంలో ప్రస్తావితమైన వస్తుసంస్కృతిద్వారా వాళ్ళు వినియోగించిన వస్తువులజాడ తెలుస్తుంది. కేశాలంకరణకు దువ్వెనలు

ఈరిపెనలు వినియోగించినట్లున్న గేయాల చరణాలు..

**దువ్వెన :**

"నీవు దూసిన దువని బన్నె

ఎందుపెడితివి రంబల దేవోయా....."

సిక్కు దీసి మల్లెపూల సెక్కుతానె

సిక్కుదూనె – ఎందు పెడితివి రంబల దేవోయి

**ఈరిపెన :**

ఈరిపెనతో తలలోని పేలని, పున్నలని, పేల గుడ్డుని లాగేస్తారు. ఖాళీగా ఉన్నప్పుడు, లేదా తీరిక చిక్కినపుడు తల వెంట్రుకలలో పట్టిన పేలను ఏరేస్తూ ఉండడం స్త్రీలకు అలవాటు. ఒకరికొకరు కబుర్లాడుతూ పేలుదువ్వుకోవడం, ఈరిపెనతొ ఈర్లుఈర్చడం చేస్తుంటారు. ఈ అంశం పాటల్లో చోటుచేసుకున్న తీరు ఇలా ఉంది.

"ఈత చెట్టు కిందకిరావో ఈరిపెను నొక్కుదునోయా........"

**ఆహారపు అలవాట్లు :**

కొండరెడ్ల ఆహారపు అలవాట్లలో రకరకాల వస్తువులు కనిపిస్తున్నాయి, ధాన్యంలో సామలు, కొర్రలు, వరి, రాగి, చోళ్లువంటి ధాన్యాలతో చేసిన అన్నం, అంబలి, రొట్టె కన్పిస్తున్నాయి, ఈ అంశాలను తెలుపు చరణాలు.

**అన్నం రకాలు :**

**వరిఅన్నం :**

"అటుకులోని అన్నానికి చూసి – ఆశ పడ్డారు బంధుగులు

వడ్లకూడు ఉలవపప్పు – వట్టిదని దోల్లనంతివి

నెయ్యితోనో తాలింపులు – ముసింగా

పెసరపప్పు ముండకు వడ్ల కూడయా ......."

**సామ కూడు :**

"సామకూడు వండుదమనగా – సన్నమున్న దొల్లనంతివి

సర్విలిపిట్టల సామకూడు – చక్కగ వండుడు పెండ్లి వార ....'

**గంటే కూడు :**

"గంటే కూడు చిరుగటి పప్పు –చిన్నదని దొల్లనంతివి ...."

**వట్టి కూడు :**

"బిచ్చములేదు బచ్చములేదు –వట్టి కూడు భోజనాలుయా ...."

**రొట్టె :**

"చోడి రొట్టె మాడిన కంపోయా ......"

**అంబలి :**

చల్లనంబలి, పుల్లనంబలి అని రెండు రకాలు వీటిని తెలుపుతూ

అత్తమామలింటికి పొగా –చల్లలేని పుల్లనంబలి ...........”

**ఆకుకూరలు :**

ప్రకృతిలో దొరికే ఆకులే కాకుండా విత్తనాలు చల్లి ఆకుకూరలు పండి౦చినట్లు తెల్పుతూ చరణాలు

“కొ౦డచేను తువ్వడాలు –కొయ్యగూర విత్తనాలు .....”

“దొడ్డి దిక్కు చూడకులేవో –తోటకూర బొజ్జడున్నడు .....”

**దుంపలు :**

దుంపల్లో నారదుంపలు, నీరుల్లి, వెల్లుల్లి, కొండదుంపలు లాంటివి వీరి ఆహారంలో భాగంగా ఉన్నాయి.

**నారదుంపలు :**

‘నార దుంపల దొడ్డికాడ నడుమురాగ జల్లుకుంతివా ....’

**నీరుల్లి :**

‘నీరుల్లి పాయ కారాలు చేసి –నిన్న మొన్న తిన్న చెల్లనేరదు .....”

**వెల్లుల్లి :**

'వెల్లుల్లి పాయ కారాలు చేసి –వేగిన పొద్దు తిన్న చేల్లసేరదు ......"

**కొండ దుంప :**

'కొండ దుంపలు తింటాం –చెట్టులో తేనెలు కోస్తాం .....

దుంపలు తెచ్చుకు వత్తేదోయి దుంపలు తిందాముగాని ........"

**వేలిచందగడ్డ :**

వీటిని తవ్వుకొచ్చి గోదావరి నీళ్ళలో నానవేసి ఒకరోజు తర్వాత తింటారని తెలిపే చరణాలు

"పెలిసంద గడ్డలుతెచ్చుకు పోదామా

గోదాట్లో నానేసి తిందామా...."

**కాయగూరలు :**

చిక్కుడు, కాకర, వంకాయ, గుమ్మడి లాంటి కూరగాయల పాదులు, తీగలు పండించినట్లు వాటిని పంటలో కలుపుకున్నట్లు తెలుపుఅంశాలు.

**చిక్కుడు :**

'నీయింటోమ్ నా యింటి నడుమ

చిక్కుడాని వేసినాము ........"

**కాకర :**

'కాకనూరు కణుసుల మందా

కాకరాసుల చెల్లమేసిదా ......"

**వంకాయ :**

"ముదిరిన వంకాయ కూర

ఉత్తెకాయ చింత పులుసు ........."

**పప్పులు :**

ఉలువలు, పెసర, కందులు, బొబ్బర్లు కొండరెడ్లు ఆహారంలో భాగంగా ఉపయోగిస్తారు

**పప్పు ధాన్యాలు :**

**ఉలవలు :**

"ఉడుకనుడుక నులువపప్పు - చక్కగ వండుడు పెండ్లివార......"

"జొన్న కూడు ఉలవపప్పు –జోడదని ఒల్లనంతివి ......"

"వడ్ల కూడు ఉలవపప్పు –వట్టిదని ఒల్లనంతివి ...."

**చిరుగటి పప్పు :**

"చిప్పకూడు చిరుగటి పప్పు –చిన్నదని దోల్లనంతివి ..........."

**పెసలు :**

'నేయ్యితోనో తాలింపులు –ముసింగా పెసరపప్పు –ముండకు వడ్ల కూడోయా.......'

కూడోండి పప్పోండి –కుదుట బెట్టిందో .........."

పుట్టింట పప్పుకూరలతో భోంచేసిన వైభవాన్ని మెట్టినింట చల్లలేని పుల్లటి అంబలి అని ఆరళ్ళ జీవితాన్ని తలచి దు:ఖిస్తున్న వైనంలో పుట్టిన మేట్టింటిలోజీవన వైవిద్యం స్పష్టంగా తెలుస్తుంది.

"పుట్టింట యున్నప్పుడు –పప్పు కూడు భోజనాలు

అత్తమామలింటికి పోగా –చల్లలేని పుల్లనంబలి ........'

**పండ్లు :**

గున్నమామిడి పండ్లు, అరటిపండ్ల ప్రస్తావనలో ఈ చెట్లను ప్రత్యేకంగా సాగు చేసేట్లు కనబడుతున్నాయి. ఇవి కాక కొండల్లో దొరికే పండ్లను ఋతుక్రమానుసారంగా వీరు అనుభవిస్తుంటారని తెలుపుతున్న చరణాలు.

**మామిడి :**

'గొందికోటా గున్నమామిడి

గుజ్జుగుజ్జు గున్నమామిడి .......'

**అరటి పండు :**

‘అమ్మలమ్మా లేమిగోల అరటిపండు పిట్టిగోలోయా ........’

కాయ తింటే ఏమి ఫలము –పండ్లు తింటె పాలముండుదా ........”

**మాంసాహారం :**

**జంతువులమాంసం :**

అడవిలో దొరికే దుప్పులు, ఉడుములు, పందులు, మేకలు, గొర్రెలు, కుందేలు మొదలైన జంతువులను వేటాడి తెచ్చి ఐనవారంత పంచుకొని వండుకోవడం కొండరెడ్ల సాముహిక జీవనానికి నిదర్శనం. చిన్నా పెద్దా అందరూ కలిసి చేసుకొనే చిన్న చిన్న వేడుకలు మొదలుకొని విందుల వరకు మాంసం వాడటం అలవాటు. అందులో కోడికూర చాలా సర్వసాధారణమైన ప్రత్యేక వంటకం.

“కొసన వచ్చిన పెండ్లి పెద్ద –కోడిడుమ్ములు చెల్ల తిన్నడు ......

అద్దురంతపు అడవిలోన –గిద్దువన్నె కోడికూసే....

కాచిన కందులల్లె –కారుకోడి బాలలను.......

కొత్తకొత్త గువ్వల దుడ్డు –కోడి గుండెలు తిందేనన్నది........’

**కుందేలు :**

కుందేలుకు చెవులపిల్లి అని మరో పేరు. దీని మాంసాన్ని కొండరెడ్లు పిల్లిమాంసం అంటారు. పిల్లలందరూ కూడుకొని పిల్లిమాంసం పులుసు చేసుకొన్నారని తెలుస్తుంది.

'పిల్లలు పిల్లలు కూడుకునో

పిల్లిమాంసం పులుసుగోలోయా ......'

**పంది :**

అడవిపందుల్ని వేటాడి తెచ్చి సామూహికంగా గ్రామస్థులు అందరూ మాంసాన్ని పంచుకోనేరితి కొండరెడ్లలో కన్పిస్తుంది. ఈ అంశాన్ని తెలుపుతున్నవి చరణాలు.

"సేదు మాంసం తేవోయ్ ఘూట....... పాతపాత గవ్వల దుడ్డు

పంది గుండెలు తిందేనన్నది ......"

**మేక :**

ఏ చిన్నకోరిక కోరాలన్నా అమ్మవారికి మేకపోతుల్ని బలి ఇస్తామని మొక్కుకుంటారు. బలి ఇచ్చిన మేకపోతు మాంసాన్ని వంట చేసుకొని ప్రసాదంగా భావించి తింటారు, ఈ అంశాలు పాటలో ...

"ఓ మా ఊరి అమ్మవారికి – మందమేకలు చేల్లివో లేవో ....

మేలైన గవ్వల దుడ్డు – మేకగుండెలు తిందేనన్నది ......."

**ఉడుములు :**

ఉడుములు వేటాడి వాటి ముక్కలను వండుకోవడానికి తెస్తారని చెపుతున్న చరణాలు ఇలా ఉన్నాయి. ముక్కలంటే మాంసమని అర్థం.

"ఊరి కెదురు కొండలోన –ఉడుముల వేటగాడోయా .......

ఉడుములు వెంబడి ఉర్కిమారే

ఉడుము ముక్కలు తెత్తాడో ............"

**పక్షులు :**

పక్షుల వేటలో ఒక్కొక్కరు ఒక్కోరకమైన పక్షిని వేటాడడంలో తమ తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు . పూరి పిట్టల్ని పట్టే వేటగాడ్ని తెలియజేసే చరణం .

"పులిగాదో ఎలుగుకాదో –పూరి పిట్టల వేటగాడోయా ..........."

**కంజులు :**

పక్షి జాతుల్లో కనుజులు కొండరెడ్లకు ప్రీతి పాత్రమైన పక్షి మాంసం. వీటిని కనుజులు, కండుసులు అను పేర్లతో వీళ్లు పిలుస్తారు. ఇవి కంజుపక్షులు. వీటి కోసం వేటకు వెళ్ళిన తమ మనుషులు వాటి మాంసం తెస్తారో లేదో అనే ఎదురుచూస్తున్నట్లున్న చరణాలు.

“కండుసులు వేటకు పోయి మారే

కండుసులు ముక్కలు తెత్తాడో....”

**జలచరాలు :**

నేలమీద జంతువులను, ఆకాశంలో పక్షులను, నీటిలో జలచరాలను మాంసాహారంలో భాగంగా గ్రహిస్తారు, జలచరాలలో పీతలు, చేపలు, నత్తగుల్లలను కొండరెడ్లు ఆహారంగా తీసుకునే అలవాటుఉన్నట్లు కనబడుతుంది.

**ఎర్కలు :**

పీతలను ఎర్కలు అని పిలుచుకొంటారు. పెండ్లి కూతురి జాడ వచ్చిన పెండ్లి పెద్దలు ఎర్కలు తిన్నట్లు తెలుపుతున్న సందర్భం.

“పిల్ల జూడ వచ్చిన పెద్ద –పిడికె డెర్క లు జెల్ల దిన్నడు ...

ఎకురువాగు పోయి మారే ఎర్కలు తెచ్చుకు వత్తాడో ......”

**చేపలు :**

జలచరాలలో చేపలు, జల్లలు, రొయ్యలు ముఖ్యమైనవి. కొండరెడ్ల పాటల్లో రొయ్యలు, చేపలు, జెల్లల ప్రస్తావన కనబడుతుంది, బుర్రచేపల పులుసుతో విందు జరిగిన సందర్భం తెలుపుతూ చరణం. (చిత్రం.53,54)

“చేప లేదో జెల్ల లేదో –చేతనోక్క గాజు లేదోయా.....

బుడ్డిబుడ్డి కూడుకొని –బుర్ర చేపల పులుసు గోలోయా........"

**నత్తగుల్లలు :**

నత్తగుల్లలలోని నత్తలను వంటచేసుకొని తింటారని తెలుపు అంశం

"కిక్కిడి గిడిగిడి సంతల దారో – నత్త గుల్ల వర్రే పాపయా......"

**విద్య - వినోదం – విలాసం :**

కొండరెడ్లకు ప్రధానమైన విద్య వేటాడటం కోసం నేర్పే విలువిద్య, ఈటెలు విసరడం వంటి వాటి పై ప్రధాన తర్ఫీదు ఉంటుంది. కోటి విద్యలు గలవారుగా తమ్ము తాము భావించుకొంటున్నారు. కొండరెడ్ల పాటలో

"కొలువు మనదే – కొలత మనదే – కోటి విద్యలు గల్లవారము

వేట మనదే వేట్టిమనదే – వేయి విద్యలు గల్లవారము"

**వినోదాలు – విలాసాలు :**

మానసిక శారీరిక సౌభాగ్యానికి ఆటపాట మానవజీవితంలో భాగం. చిన్నపిల్లలు మొదలు వృద్ధులవరకు వయోభేదంలేకుండా అందరూ తమవంతు వినోదాలలో విలాసాలలో పాలుపంచుకొంటూ ఆనందిస్తుంటారు. ఆటలు సరదాగానూ, పాటలు హాయిగాను సాగుతుంటాయి. కొండరెడ్లు జానపద గేయాలలో వినోదాలను, విలాసాలను గమనించినపుడు వేటాడటం ఆటపాటలతో నృత్యం చేయడం ఆటపాట తమదేననుకోవడం వినోదంగా కనబడుతుంది. విలాస జీవితానికి

ధూమపానం, మద్యపానం ప్రధానం. ఈ ధూమపానం, మద్యపానం కొండరెడ్ల గేయాల్లోనూ కనబుతుంది.

**వేట :**

"వేటకు వెళ్ళి తెచ్చో – వేడుకీల ముంగిపిల్ల......

జోడు విండ్లు జోడించుకొని బోలకొండ వేటకు వెళ్ళో.......

చిక్కువిల్లు చిల్లలకోల –లాగివేయగ చిక్కుమన్నదా

జైకవిల్లు దడ్డకోల –లాగివేయ లక్కుమన్నదా ...."

**ఆటలు :**

**గోటిలాట :**

గోలీలాటనే కొండరెడ్లు గోటి లాట అంటున్నారు. ఇది మగపిల్లల ఆట. జట్లు జట్లుగా ఒకొక్కరు ఉంటారు. గోలీలను కలిగిన వారందరూ ఇందులో ఆటగాళ్ళే. ఇందులో అనేక రకాల ఆటలను ఆడుతారు. కొండరెడ్ల పిల్లలు కూడా ఈ ఆటను చాలా ఇష్టంతో ఆడడం కథల్లో కన్పిస్తుంది.

**కోడు కొళ్ళంకల ఆట :**

రెండు జట్టులుంటారు. ఒకజట్టు వారు రెండో జట్టుకు తెలియకుండా తమ జట్టులో నుండి ఒక నాయకుడిని ఎన్నుకుంటారు. రెండో జట్టు వారు మొదటి జట్టు వారి నాయకుడి పేరును బయట పెట్టాలి. అలాగే రెండో

జట్టువారు ఎన్నుకున్న నాయకుడిని మొదటి జట్టు వారు బయట పెట్టాలి.

**రేలాట :**

గుచ్చుగుచ్చు పుల్లాటనే కొండరెడ్లు రేలాట అంటారు. ఇద్దరు పిల్లలు నేలపై కుర్చుని తమ ముందు ఉన్న మట్టిని గేడిగా అమర్చి అందులో ఒక పుల్లను దాస్తారు. ఎదురుగా కూర్చున్న అమ్మాయి అ పుల్లని దాచిన చోట రెండుచేతులని జతకూర్చుకుని పుల్ల దాచిన చోట కప్పాలి. కప్పిన పుల్ల దొరికితే గెలిచినట్లు లేకుంటే దోసిట్లో మట్టిపోసి పుల్లని అందులో పెట్టి ఓడిన అమ్మాయికి కళ్లుగప్పి మట్టితో ఉన్న పుల్లని  ఒకచోట పోయిస్తారు. మళ్ళీ యధాస్థానానికి వచ్చి కల్లు విప్పుతారు. మట్టి పోసిన స్థానం నుండి పుల్లను తెమ్మంటారు. తెస్తే గెలిచినట్లు లేకుంటే ఓడినట్లు. ఈ ఆటను సుమారుగా 8-13 సం వయస్సులో ఉన్న వారు ఆడుతుంటారు.

**బాడిస గింజ లాట :**

బాడిసచెట్టు కాయలను ఏరి వాటి గింజలను దాచుకుంటారు. ఆటల్లో ఆకతాయితనంగా పిల్లలు ఒకరికొకరికి తెలియకుండా ఆ గింజలను నేలకురాసి వెంటనే మరొక ఆటగాడి ఒళ్ళుపై తాకిస్తారు.  రాపిడికి వేడెక్కిన గింజ వేడి  పిల్లల ఆటల మధ్య ఒక వినోదం

**తత్తిం బిత్తిం ఆట :**

ఇరు పక్షాల వారు ఎదురెదురుగా పద్మాసనం వేసుకుని గుండ్రంగా కూర్చోవాలి. చిల్ల పెంకుతో బొమ్మాబొరుసా  వేసుకుని ఎవరు గెలిస్తే వారు

ఆట ప్రారంభిస్తారు. అందరి తొడలపై కింది పాట పాడుతూ వరుసగా తడుతూ వస్తారు. ఎవరి దెబ్బతో పాట చివరి అక్షరమైన 'ది' వస్తుందో ఆ కాలు ఓడినదని అర్థం. అలా అందరి కాళ్ళు ఓడిన తర్వాత చివరి కాలు ఎవరికి మిగిలితే వాళ్ళు గెలిచినట్లు ప్రకటన. చాలా వరకు ఈ ఆటను పది సంవత్సరాల లోపు చిన్న పిల్లలు ఆడుకుంటారు.

తత్తిం బిత్తిం తానా బిత్తిం

యేకో జానా యెలగా పండు

యెల్లా రెడ్డి ఇంటి కాడ

గల్లు మన్నా ది

ఇలా అనేక ఆటలు పాటలు కలిగి ఉన్నాయని తెలియజేసే పాట

''ఆటమనదే పాటమనదే అన్ని విద్యలు గల్లవారము

పేటమనదే పెట్టి మనదే –కోటి విద్యలు గల్లవారాము.''

**పాట :**

ఆట పాట లేని గిరిజన తెగ ఉండదు. శ్రమను మరచి పోవడంలో పాట ప్రాధాన్యతే వేరు. ఎన్ని పాటలు పాడినా ఎన్ని ఆటలు ఆడినా తనివి తీరదు.

ఆటలెన్నో ఆడించినాను –పాటలెన్నో పాండించినానుగా....

**నృత్యం :**

కొండరెడ్లలో నృత్యకళ చాలా విస్తృతంగా కన్పిస్తుంది. స్త్రీ పురుషులు, యువతీయువకులు కలసి వేరువేరుగా ఒక జట్టుగా ఏర్పడి పాటలుపాడుతూ లయబద్ధంగా ఆడేవిధానంలో రకాలున్నాయి వారు ఒక వరుస క్రమంలో ఆడుతూ రెండడుగులు ముందుకు వేసి అంతే వేగంగా తిరిగి వెనుకకు రెండడుగులువేస్తూ ఆడే విధానాన్ని గిల్లలాట అంటారు మరొక విధంగా వరుస క్రమాన్ని మారుస్తూ మూడడుగులు వెనుకకు అంతే వేగంగా ముందుకు మూడడుగులు వేసి ఆడే విధానాన్ని మువ్వలాట అని అంటారు. వీరు నృత్యం చేస్తున్నంతసేపు ఓ రకమైన ఉత్సాహం, చుస్తున్న వారికి ఆశ్చర్యం కలిగే విధంగా లయబద్ధంగా పాటకూ, డోళ్లు శబ్దాలకూ అనుగుణంగా నృత్యం చేస్తారని పాటల్లోని సందర్భాలు తెలుపుతున్నాయి.

"... ముత్యాలమ్మకి సందడి చేద్దాం రండి ఓ గోవులారా
గుబ్బట్లలకి పిలిచుకురండి ఓ గోవులారా
డొల్లు బౌజాలు తెచ్చుకురండి ఓ గోవులారా
గుబ్బట్లతోని కలిసి ఎగురుదాము ఓ గోవులారా...."

గున్నమామిడి చెట్టుకింద గుబ్బట్లు లాగేరమ్మా –గుబ్బట్లు లాగేరమ్మా

ఓడిపోయిరమ్మా గుబ్బట్లు ఓడిపోయిరమ్మా......"

అడవిలో జీవించే కొండరెడ్ల జీవనం అడవితో ముడిపడి ఉంటుందన్నది సత్యం. వీరి వినోదాలలో అడవిలోని ప్రకృతి, పక్షులు, జంతువులు కూడా జతగలిసి ఉండడం పాటలో ప్రస్ఫుటమవుతుంది. ఈ అంశాన్ని తెలిపే చరణాలు.

"కనుజు పిట్టా ఆట్టాని జూడు
నెమలిపిట్ట ఆట్టాని జూడు
కారుకోడి కూతను జూడు
కోతినాట్యం ఆట్టని జూడు
కోగిలమ్మ పాటను జూడు..."

**విలాసాలు :**

కొండరెడ్ల విలాస జీవనానికి ప్రతీక కల్లు,సారాయి. వీటిని స్త్రీ పురుషులు, వృద్ధులు తీసుకొను అలవాటున్న సమాజం వీరిది. కల్లు మీద వీరికి ఎంతో ప్రీతిఅన్నది పాటల్లో కల్లు ప్రస్తావన రావడంలోనే తెలుస్తుంది. అలాగే సారాయి కూడా. కల్లు సారాయే కాకుండా నల్లమందును కూడా తాగుతారు. కొండరెడ్ల గేయాల్లో కల్లు ప్రస్తావనలు అనేక విధాలుగా కన్పిస్తుంది. (చిత్రం.58)

**కల్లు తాగడం :**

"చెట్టు కల్లు చెట్టునుండగ – సెమ సెమ పాణాలాయె

ఒగ్గుకల్లు వగ్గునండగ -ఒరగు ఒరుగు పాణాలాయె

మట్టకల్లు మట్టనుండగ – మత్తు మత్తు పాణాలాయె

దిప్పకల్లు దిప్పనుండగ –దిమదిమ పాణాలాయె

చెట్టు గీసో చిన్న యత్తమ్మ-చేవడిన బుక్కేడియ్యవా...."

మళ్ళిమళ్ళి దొరుకుతుందో లేదోనని దొరికిన కల్లుని దొరకిన చోట దాచేసుకున్నట్లు తెల్పుతున్నాయి ఈ పాటలోని చరణాలు

"దిప్పతోనో దిప్పెడు కల్లు – దిగగొందిన దాచిడుకున్నాడు

చెట్టితోనో చట్టేడు కల్లు- చాపచాటున దాచిడుకున్నాడు

ముంతతోడి ముంతెడు కల్లు-మూల్లగొందిన దాచిడుకున్నాడు

కల్లయితే కాగిదిగాని –కంటిదోకి కనపడదు

గుమ్మున కాగిన కమ్మని కల్లు –కురిడె పిల్లి నంజుకాలు

కల్లు గీసో చిన్న యత్తమ్మా-పేనపుడేగ లేత్తుకపోయివా "

మరో పాటలో కల్లు తాగడం వల్ల మోహంలో కన్పిస్తున్న మార్పులను ఏకరవు పెడుతున్న తీరు కనపడుతుంది. ఉదా.

"ఈతకల్లు తాగెవో లేవో-నియ్యమెహము ఈరెలాయె

తాటికల్లు తాగెవో లేవో-నియ్యమెహము తాటిలాయె

తెల్ల కల్లు తాగెవో  లేవో-నియ్యమెహము తెల్లలాయె

సారా కల్లు తాగెవో లేవో-నియ్యమెహము చారాలాయివా....."

మరో పాటలో వెదరు బొంగులతో ఒగ్గులను తయారు చేసి అందులో కల్లును చెట్టునుండి పట్టుకొంటారు వీటినే గొట్టాలనికూడా అంటారు. కల్లుగొట్టాల అమ్మవారికి కల్లును గొట్టాలతో చెల్లించారో లేదో అని సందేహిస్తూ పాటలోని చరణాలు.

"తోటపల్లి చెల్లమదేవి -      ఆరు డ్రాముల సారా తాగి

అమ్ముకొండ అడ్డుపడ్డదా...." (చిత్రం.46,21,22)

**సారాయి :**

సారాయిని అమ్మనుబోతే ఆరోజు అది అమ్ముడుపోలేదు. సారాయి అమ్ముడుపోకపోవడానికి కారణం తాము నమ్మిన తోటపల్లి  చెల్లమదేవి అని గంగాలమ్మ అని బూతులతో తిడుతూ ఇలా సాగుతుంది పాట.

బొమ్మెత్తు పొద్దులాయే బొట్టు పెట్టు వేలలాయినా

చరాచరా పొద్దులాయే సారా తాగే వేలలాయినా

**నల్లమందు :**

"డిక్కితోనో డొక్కెడు మందు- డెక్కినోట వేసిడుకొన్నాడు

బరిణేతోడి నల్లమందు బరివినోట వేసిడుకొన్నాడు"

**ధూమపానం :**

చుట్టలు కాల్చడం కొండరెడ్ల పాటల్లో కన్పిస్తుంది. పొగాకులతో చుట్టలు చేసుకొని పొగ పీల్చడం లేదా పొగాకును దుమ్ము చేసి తాంబులంతోపాటు సేవించడం చేస్తుంటారు.

**చుట్ట :**

"పొత్తడాకు పొగచుట్ట-ఇంద పొత్తడ పొగాకు చుట్ట

......................................................................

అందుకోనోఆరగించు-ఎండపల్లి పొగచుట్ట

చుట్టుడాకు పొగ చుట్ట" (చిత్రం.59,60)

**పొగాకు :**

"పొద్దున్నింత పొగాకు లేదు –పోపో గుంటడ మీవారింటికి

ఇచ్చినావు ఇంత పొగాకు-తీసినావు తిత్తిరి డోంకకా..."

**ముగింపు :**

కొండరెడ్ల మౌఖికసాహిత్యం ఆధారంగా వాళ్ళ జీవనసంస్కృతిని అధ్యయనం చేసినపుడు వీరు ఆచరిస్తున్న మతం, పూజా విధానం, నైవేధ్యాల రకాలు, బలులు, పెండ్లితంతు, సంతానం, సంప్రదాయాలను, ఆచారవ్యవహారాలను, అలంకరణలను, ఆహారపద్ధతులు, విద్యావినోదం విలాసాలను పరిశీలించి చూసినపుడు కొండరెడ్ల సంస్కృతీ పరిరక్షణ ప్రకృతితో ముడిపడిన విధానం, దేవతామూర్తులను కాలానుగుణంగా పూజించేతీరు, దేవతలను అనుగ్రహించుకునే నమ్మకాలు, కుటుంబ సంస్కృతి పరిరక్షణ, గ్రామసంస్కృతిలో సామూహికంగా పాల్గొనే విధానాలు, నైవేధ్యాలను సమర్పించే విధానాలు, దైవాన్ని నమ్మిన తీరు, ప్రతి చిన్న పెద్ద పండుగలకు వీరు చేసుకునే విందులు వినోదాలు వీరి జీవన సంస్కృతిని తెలియజేస్తున్నాయి.

# ఐదవ అధ్యాయం

## కొండరెడ్ల మౌఖిక సాహిత్యం – భాషావిశేషాలు

కొండరెడ్లు ప్రధాన స్రవంతి అయిన నాగరక సమాజానికి దూరంగా నివసిస్తుండడంవల్ల  తెలుగు ప్రాచీనతకు సంబంధించిన కుదురు వీళ్ళల్లో కన్పిస్తుంది. వీరు  వినియోగిస్తున్న తెలుగు భాషలోని పదాలలోను, వ్యాకరణాంశాలలోను ప్రాచీనతను దర్శించవచ్చు. కొండరెడ్లు అడవులలోనూ, కొండలలోను జీవిస్తుండడంవల్ల వీరు వినియోగిస్తున్న తెలుగుభాషలో ప్రాంతీయ పర్యావరణ సంపదకు చెందిన అనేక పదాలు లభ్యమౌతున్నాయి. కొండరెడ్ల వృత్తి, ప్రవృత్తి పోడు వ్యవసాయం, వేటకావడంవల్ల వీటికి సంబంధించిన పదాలు అధికంగా ఉన్నాయి. వీరు ప్రకృతి ఆరాధకులు. ప్రకృతితోపాటు శక్తిపూజకూడా విశేషంగా చేస్తారు. వీటికి సంబంధించిన పదాలుకూడా  అధికంగా వున్నాయి. కొండరెడ్లు నాగరక సమాజానికి దూరంగా నివసించడం, జనజీవనంలో కలిసి జీవించక పోవడం చేత వీరి భాషలో ప్రాచీన రూపాలు ఎడనెడ అధికంగా

చోటుచేసుకొని ఉన్నాయి. భాషానిర్మాణ సంబంధమైన వర్ణాలను, నేటి ప్రమాణ భాషకు కొండరెడ్ల తెలుగు భాషకు పదాల వినియోగంలోగల మార్పులను, పదప్రత్యయ సంయోజనాలను పరిశీలించినప్పుడు ప్రాచీన అర్వాచీన రూపాలు కలగలిసినట్లున్నాయి. వీటిని ఈ అధ్యాయంలో వర్ణవిజ్ఞానం, నామరూపవిజ్ఞానం, క్రియారూప విజ్ఞానం, పదాలు, పదబంధాలు అని విoగడించి చర్చించడం జరిగింది.

వర్ణవిజ్ఞానం : కొండరెడ్ల భాషలో అచ్చులు హల్లులు వాటి వ్యాప్తి నేటి ప్రమాణ తెలుగుతో చూడడం జరిగింది.

**అచ్చులుః (Vowels)**

| | పూర్వాచ్చులు (Front vowels) | పరాచ్చులు (Back vowels) |
|---|---|---|
| సంవృతాలు | ఇ ఈ | ఉ ఊ |
| అర్ధ సంవృతాలు | ఎ ఏ | ఒ ఓ |
| వివృతాలు | | అ ఆ |
| అక్షరవ్యంజనం | ఋ | |

**హల్లులుః** (Consonants)

| | ఓష్ఠ్యాలు | దంత్యాలు | దంత మూలీ యాలు | మూర్ధన్యాలు | అగ్ర తాలవ్యాలు | తాలవ్యాలు | జిహ్వా మూలీ యాలు |
|---|---|---|---|---|---|---|---|
| | శ్వా. నా. | శ్వా. నా. | శ్వా. నా. | శ్వా. నా. | శ్వా. నా. | శ్వా. నా. | శ్వా.నా |
| అ. ప్రా స్పర్శాలు మ.ప్రా | ప బ<br>ఫ భ | త ద<br>థ ధ | | ట డ<br>ఠ ఢ | | | క గ<br>ఖ ఘ |
| అ. ప్రా స్పృష్టోష్మాలు మ.ప్రా | | | | | చ జ | చ జ<br>ఛ ఝ | |
| అనునాసికాలు | మ | న | | ణ | | ఞ | ఙ |
| ఊష్మాలు | | స | శ | ష | హ | | |
| పార్శ్వికాలు | | | ల | ళ | | | |
| తాడితాలు | | | ర | | | | |
| కంపితాలు | | | | ఱ | | | |
| అంతస్థాలు | వ | | | | య | | |

ఐ, ఔ (Diphthongs)లు“సాంప్రదాయిక వర్ణ సమామ్నాయంలో ప్రత్యేక లిపి సంకేతాలతో చూపించే 'ఐ, ఔ' లు (వక్రతమాలు) కొండరెడ్ల తెలుగు భాషలో ‘అయ్,అవ్' లుగా అంటే రెండేసి వర్ణాలుగా స్వీకరించడం లాఘవం దృష్ట్యా సమంజసం. ఉచ్చారణలో 'అయ్-ఐ, లకు 'అవ్-ఔ' లకు తెలుగులో భేదం లేదు. ఉదా 'అయ్న-ఐన', 'అవ్ ను-ఔను’. కాకపోతే ఛందస్సులో యతిప్రాసల సందర్భంలో ఐ,ఔ లు అచ్చు+హల్లుల లాగ కాక దీర్ఘాచ్చుల(ఉదా.ఆ-ఓల)లాగా ప్రవర్తించటం వల్ల వాటిని ప్రత్యేకవర్ణాలుగా

గుర్తించినా శాస్త్ర వైరుధ్యంలేదు. అందుకనే లాఘవం, ఉచ్చారణ ప్రమాణాలుగా తీసుకున్నప్పుడు "అయ్-అవ్'లు గానే గ్రహించటం సమంజసమన్నాను” (కృష్ణమూర్తి, బి.హెచ్. 2000; పుట 34-35).

వీటినే సంధ్యచ్చులు అని కూడా అంటారు. ఇవి క్రమంగా అకార యకారాలు(అయ్), అకార వకారాలు(అవ్) కలవగా ఏర్పడినవి. అందువల్ల వీటిని ప్రత్యేక వర్ణాలుగా కాకుండా రెండు వర్ణాల అనుక్రమాలు (Sequence) గా అంటే అయ్/అవ్/ లుగా గ్రహించాలి. ఐ, ఔ లకు అయి, అవులకూ మధ్య అర్థభేదనసమర్థత లేదు. కాబట్టి వీటిని ప్రత్యేక వర్ణాలుగా పరిగణించాల్సిన అవసరం లేదు.

**వర్ణ మార్పులు : అచ్చులుః**

-ం->-అ-రతనంబు < రత్నం

-అ->-ఆ- పుట్టాలు < పుట్టలు

-అ->-ఆ- మేడాలు < మేడలు

-అ->-ఆ- ఇంతాటి < ఇంతటి

-అ->-ఆ- కాకారిపువ్వు < కాకరపువ్వు

-అ->-ఆ- ఉలుకాదు < ఉలకదు

-అ->-ఆ- తాగాదు < తాగదు

-అ->-ఆ- పలుకాదు < పలకదు

-అ->-ఇ-  కాకారిపువ్వు  <  కాకరపువ్వు

-అ->-ఉ- అవుతారం < అవతారం

-అ->-ఉ- ఉలుకాదు < ఉలకదు

-అ->-ఎ- బెమ్మా < బ్రహ్మా

-అ->-ఒ- ఆడబోడుసు < ఆడపడుచు

-ఆ->-అ- సంబళ్ళ  <  స్తంభాల

-o->-ఇ- వరినించు < వర్ణించు

ఇ->అ-   రండ < రండి

-ఇ->ఇ-  ఇస్వామిత్రుడు <  విశ్వామిత్రుడు

-ఇ->-అ-  దాద < దాది

-ఇ->-ఏ- బర్ణేలు < భరిణలు

-ఈ->-ఇ-  లచి0దేవి < లక్ష్మీదేవి

ఈ->-ఈ-  యీటే < ఈటె

-ఉ->-అవు- సవుమిత్ర < సుమిత్ర

-ఉ->-ఇ- రిక్మిణి < రుక్మిణి

-ఋ->-ఉ-  సుంగారం < శృంగారం

-ఐ->-అయి- కయికేయి < కైకేయి

-ఓ->-ఒ- పొండ < పోండి

-ఔ->-ఆవు- కవుసల్య < కౌసల్య

**హల్లులుః**

-ం->-క- సెక్కరాలు < చక్రాలు

-క్->-ం- లచిందేవి < లక్ష్మీదేవి

-గ->-వ- బందుగులు<బంధువులు

-ఘు->-క- శత్రుకులు < శత్రుఘ్నుడు

చ->స- చంద్రమతి < సెంద్రమతి

చ->స- సేతి < చేతి

-చ->-స- పైటసెరుగు < పైటచెరుగు

చ->స- సాలకుంటే < చాలకుంటే

చ->స- సీరెలు < చీరలు

చ్->శ్- శెల్లి < చెల్లి

-ణ్- >-న్ బేపన్ < బ్రాహ్మణ

-ణ్->-ం- బర్నెలు < భరిణలు

-ణ్->-న్- వరినించు < వర్ణించు

-ధ->-ద- బందుగులు<బంధువులు

-ప్->-బ్- ఆడబోడుసు < ఆడపడుచు

-మ->-ప- బేపన్ < బ్రాహ్మణ

ం->య్- యూటే < ఈటె

-య్- >-ం- రూపాలు <రూపాయలు

ర-> ం బేపన్ < బ్రాహ్మణ

-ర్->-ం- బెమ్మా < బ్రహ్మా

-ళ్->-ల్- ఏలాయే < వేళాయే

-ళ్ళ->-ళు- నీళు < నీళ్ళ

వ->య- యేట < వేట

వ->య- యేడుకలు < వేడుకలు

వ్->ం- ఇడదీయు < విడదీయు

వ్->ం- ఏలాయే < వేళాయే

శ->స- సెంకు < శంఖు

-శ్->-స్- ఇస్వామిత్రుడు < విశ్వామిత్రుడు

-ష్->-చ్- లచిందేవి < లక్ష్మీదేవి

హ్->o- అనుమంతు < హనుమంతు

-హ- >-o- బేపన్ < బ్రాహ్మణ

-హ->-వ- వీరబావుడు < వీరబాహుడు

-హ్->-య్- లోయితుడు < లోహితుడు

**సంయుక్తాలు దిత్వాలుగా మారినవి :**

-చ్చ->-త్తి- ఇత్తిని < ఇచ్చాను

-ణ్య->-న్నె- అరన్నెవాసం < అరణ్యవాసం

-ణ్య->-న్నె- పున్నెం < పుణ్యం

-త్య->-చ్చ- సచ్చం < సత్యం

-త్య->-త్త- ముత్తేలు < ముత్యాలు

-శ్చ->-చ్చ- వరిచ్చంద్ర < హరిశ్చంద్ర

-స్త->-త్త- తీత్తాను < తీస్తాను

-స్త->-ద్ద- తీద్దాం < తీస్తాం

-హ్మ->-మ్మ- బెమ్మా < బ్రహ్మా

-ంహ->-మ్మ- సమ్మరించు < సంహరించు

**సంయుక్తం వర్ణలోపం ఏర్పడి అసంయుక్తంగా మారినవి :**

స్త->స- సంబళ్ళ < స్తంభాల

స్వా->సా- సామి < స్వామి

**దీర్ఘం మీద అనుస్వార రూపాలు :**

ఆవుపేండ, నాంగలి, పాంతసాంప, మూంగవాండు, వేంటాడు, వేంప, బోంగులు,

**నామ విజ్ఞానం :**

తెలుగులోని నామాలను వాటి ప్రాతిపదికల నిర్మాణ పద్ధతులను బట్టి దేశ్య నామాలు, ఆదత్త నామాలు అని రెండు రకాలుగా విభజించవచ్చు.

“old Telugu Nouns, based on stem formation patterns are classified native and borrowed. Native nouns include those inherited from Dravidian and nativised forms that are borrowed from Indo-Aryan sources along with changes adapting them to the old Telugu phonological system. borrowed nouns, largely from Sanskrit and Prakrit nominal to which old Telugu suffixes are added’’ (Ramanarasimham,1988:185)

**దేశ్య నామాలు**

తెలుగు భాషా నిర్మాణానికి లొంగేవి దేశ్య నామాలు. దేశ్యనామాల్ని రెండు రకాలుగా విభజింపవచ్చు.

**ప్రాధమిక దేశ్యనామాలు**

అ. లింగప్రత్యయం లేనివి

వీటిని మనుష్య, మనుష్యేతర అని రెండుగా విభజింపవచ్చు.

మనుష్య : పుంలింగం

ఉదా: తండ్రి, మామ, తాత, మేనమామ, బావ, మరిది, గున్నె (అబ్బాయి), గాటు(అబ్బాయి), గోవు(యువకులు), పెడ్డి (పెండ్లి కాని అబ్బాయి)

**స్త్రీలింగం :**

ఉదా : అవ్వ, అత్త, తల్లి, కోడలు, మరదలు, తోటికోడలు, గంతకోడలు, ఘాటి(అమ్మాయి) కూతురు, అమ్మాయి, దేవత.

**బహువచనం :**

పుంలింగం : అన్నదమ్ములు, కొడుకులు, గోవులు(యువకులు)

స్త్రీ లింగం : ఆడోల్లు, కూతుళ్ళు, ఆడంగోళ్ళు, గుబ్బట్లు(యువతులు), మరదండ్లు,

**మనుష్యేతర : ఏకవచనం**

ఉదా: కర్ర, ఇల్లు, కొండ, మడుగు, పులి, నక్క, యెద్దు, సేల, అడవి, చెట్టు, శేరు, సారా, ఉగాది, ఉయ్యాల, ఊలు, కల్లు, మడుగు, కోడి, కాటిక, కావడి, కొబ్బరి, కొలువు, గిత్త, గుమ్మడి, గెడ్డ, గొండ్లెం, చన్ను, చిక్కుడు, చిగురు,

చలి, చోడి, జావ, డోలు, తబాల, తుడుము, తోట, దూడ, నక్క, నాంగలి, నిచ్చెన, పందిరి, పసుపు, పాక, పిట్ట, పెట్టె, పెండ, పెళ్ళి, పొట్లం, బంతి(వరుస), బరిణ, బస్తా, బాణం, మానిక, ముంత, మెకము, సెలక, సురుబు(దేవత) రాయి, వేంట, వేంప, వెట్టి, సవరం, సత్తర(అటక), సారా, కనజు, వేపి, బొంత, పన్నె,

**మనుష్యేతర : బహువచనం :**

అచ్చింతలు, ఇండ్లు, ఎరుకలు, గదులు, గుంజలు, డుమ్ములు, తడికెలు, మంచాలు, సాపలు, అనుములు, గిన్నెలు, అలసందులు, కాంజులు, కొమ్ములు, కొలతలు, ఓరపుకుండలు, కట్టెలు, కుటుంబాలు, కూలులు(కూలీలు), గర్రులు, గెలలు, గొట్టాలు, గొడ్లు, ఘూటులు(పిల్లలు), చాపలు, చిడుగులు, చివటలు, జొన్నలు, పళ్ళు, బిందెలు, బోద, మోకులు, మొరకలు(చెవులు), విత్తనాలు, వడుగులు(కథలు), సంతలు,

**నిష్పన్న దేశ్య నామాలు**

1. ప్రాథమిక దేశ్య నిష్పన్న నామాలు

ఉదా: మోగు –మోత, కోయు –కోత, చేయు – చేత, పాడు-పాట, వండు –వంట, పండు –పంట, రాయు-రాత ,పూయు –పూత, కూయు –కూత, ఈదు – ఈత.

## లింగం

తెలుగులోని నామాలలో కన్పించే లింగభేదాన్నిబట్టి మనుష్య పుం వాచకాలు, మనుష్య స్త్రీ వాచకాలు, మనుష్యేతర వాచకాలు అని మూడువిధాలుగా విభజింపవచ్చు. వీటిని సంప్రదాయ వ్యాకరణాలు క్రమంగా మహద్వాచకాలు, మహతీవాచకాలు, అమహద్వాచకాలు అని వ్యవహరించాయి. ఈ భేదాల్ని తెలపడానికి కొన్ని నామాలు ప్రత్యయాల్ని గ్రహిస్తుండగా, మరికొన్ని నామాలు ఎటువంటి ప్రత్యయాలు లేకుండానే ఈ భేదాల్ని తెలియజేస్తున్నాయి. దీన్ని బట్టి తెలుగులో లింగ భేదం సర్వత్ర ప్రత్యయ ఆశ్రయం కాదు అని చెప్పవచ్చు.

### 1.లింగ బోధక ప్రత్యయాలను గ్రహించని నామాలు

అ. మహద్వాచకాలు

ఉదా: తండ్రి, అప్ప, అబ్బ, బావ, మామ, తాత

ఆ.మహతీవాచకాలు

ఉదా: తల్లి, అత్త, అక్క, బుడ్డి(అవ్వ), మరదలు, చెల్లెలు,.

ఇ. అమహద్వాచకాలు

ఉదా: ఏకవచనం : ఆవు, మేక, కోట, ముంత, మెకము,

బహువచనం : ఎర్కలు(పీతలు), ఉడుములు, దుంపలు

**2. లింగబోధక ప్రత్యయాలను గ్రహించే నామాలు**

అ. మహద్వాచకాలు

-డు: మొగుడు, మొగడు, తమ్ముడు, గుంటడు, బుడ్డాడు(తాత),మొగడు, అయిలోడు, కొలగాడు,

-అయ్యా: లచ్చుమయ్య, జంగమయ్య, నల్లమయ్య, మామయ్య

-అన్న: చిన్నన, పెద్దన్న, ముత్తన్న

-బాబు : కమ్మరిబాబు(వేషాలువేసేవాడు), బుజ్జిబాబు

ఆ. మహతీవాచకాలు

-అక్క :గండిపేటక్క

-అండ్లు:మరదండ్లు,కోడండ్లు

-అలు : కోడలు, చెల్లెలు

-ఆలు : బాలింతరాలు, చెల్లాలు, మరదాలు.

-అమ్మ : అయ్యమ్మ, కనకమ్మ, కొండమ్మ, కొమ్ములమ్మ, కోడలమ్మ, గంగాలమ్మ, గందపుండాలమ్మ, గుబ్బాలమ్మ, చిన్నమ్మ, జేజమ్మ, జోగమ్మ, దేవతమ్మ, దోదమ్మ, పిన్నమ్మ, నూకాలమ్మ, నరుసులమ్మ, సారలమ్మ, భూములమ్మ, ముత్యాలమ్మ, బజ్జెమ్మ, సీతమ్మ,

మునెమ్మ, సావిత్రమ్మ.

-అమ్మా: చెల్లెలమ్మా, ముత్యాలమ్మా.

-అత్త : కన్నత్త, పిన్నత్త.

-అత్తమ్మ : గుండ్లత్తమ్మ, చిన్నయత్తమ్మ.

-సాని : మంత్రసాని, ఆకసాని

ఇ.అమహద్వాచకాలు

-ము : గొ౦డ్లెము, వార్ణము. -౦బు : రాగిచెంబు.

**వచనం :**

తెలుగులో వచనం రెండు రకాలు

ఏకవచనం:

ఒక వ్యక్తినిగాని, ఒక వస్తువునిగానీ తెలియజేసేది ఏకవచనం. సాధారణంగా ఆధునిక ప్రమాణ తెలుగుభాష ఏకవచనం ప్రత్యయాల్ని ఆశ్రయి౦చి ఉండదు. కాని కొండరెడ్ల తెలుగులో ప్రత్యయాలను కలిగియున్న నామపదాలు:

ఉదా 11. గుంటడు, మొగుడు, తమ్ముడు,

**బహువచన౦** :

ఏకవచనబోధక నామాలకు బహువచన ప్రత్యయం చేర్చటంవల్ల

బహువచన బోధకమౌతుంది. బహువచన ప్రత్యయాన్ని ఆశ్రయించి ఉంటుంది. నామపదాలు మీద బహువచన ప్రత్యయం చేరినపుడు నామప్రాతిపదికల్లో కొన్ని మార్పులు కనిపిస్తాయి. అవి 1. బహువచన ప్రత్యయం'లు' చేరినపుడు పదాంతంలో ఉన్న 'ఇ''ఉ' గా మారుతుంది.

ఉదా : గది+లు > గదులు

పక్షి+లు > పక్షులు

చెవి+లు > చెవులు

కత్తి+లు > కత్తులు

జాజి+లు > జాజులు

2. –ము/ం పదాంతంలో ఉండి బహువచన ప్రత్యయం'లు' పరమైనపుడు'ము'/ం' లు లోపించి దానికి ముందున్న అచ్చు దీర్ఘం కావడం. దీనినే లోపదీర్ఘత అంటారు.

ఉదా : విత్తనం+లు > విత్తనాలు

కారం+లు > కారాలు

కల్లుగొట్టం+లు > కల్లుగొట్టాలు

ఆముదం+లు > ఆముదాలు

తోరణం+లు > తోరణాలు

చుట్టం+లు > చుట్టాలు

పంపకం +లు > పంపకాలు

3. ఇదంత శబ్దాల్లో అకారేతర దీర్ఘస్వరపూర్వకమైన 'య' కారం 'త' కారంగా మారుతుంది.

ఉదా : కొయ్యి+లు > కోతలు

చెయ్యి+లు > చేతులు

మొయ్యి+లు > మోతలు

4. -అ, -ఉ, -ఎ లు పదాంతంలో ఉన్న ఏకవచన నామాలకు బహువచన ప్రత్యయం 'లు' చేరినప్పుడు ఏ మార్పు కలగదు .

ఉదా: కోక+లు > కోకలు

నీడ+లు > నీడలు

దుంప+లు > దుంపలు

పిల్ల+లు > పిల్లలు

ఎర్క+లు > ఎర్కలు

పేమ+లు > పేమలు

అన్న+లు > అన్నలు

చాంప+లు > చాంపలు

రెమ్మ+లు > రెమ్మలు

పెద్ద+లు > పెద్దలు

పుట్ట+లు > పుట్టలు

రాజు+లు > రాజులు

కొక్కు+లు > కొక్కులు

గాజు+లు > గాజులు

కొలుపు +లు > కొలుపులు

కొమ్ము+లు > కొమ్ములు

తేనె+లు > తేనెలు

పీనె+లు > పీనెలు

గుండె+లు > గుండెలు

5. ప్రాతిపదికాంత ఉత్వం లోపించడం

ఉదా: గుడ్డు+లు > గుడ్లు

చేను +లు > చేన్లు

ప్రాతిపదికాంత అత్వం లోపించడం

బుట్ట+లు > బుట్లు

గొడ్డు +లు > గొడ్లు

చేట+లు > చేట్లు

ప్రాతిపదికాంత ఎత్వం లోపించడం

గిన్నె+లు > గిన్లు

6. పదాంతంలో 'ఇ' ఉండి బహువచన ప్రత్యయం 'లు' చేరినపుడు 'ళ్ళు' వచ్చిన రూపాలు

ఉదా: కోడి+లు > కోళ్ళు

మడి +లు > మళ్ళు

గొంగళి+లు>గొంగళ్ళు

కావడి+లు>కావళ్ళు

చావడి+లు>చావళ్ళు

డోలు+లు > డోళ్ళు

కోడు +లు >కోళ్ళు

నెగడు +లు > నెగళ్ళు

పదాంతంలో 'ఉ' ఉండి బహువచన ప్రత్యయం 'లు' చేరినపుడుం 'ండ్లు' ఆదేశమయిన రూపం కొండరెడ్ల తెలుగులో ఒక రూపం కనబడుతుంది.

ఉదా: విల్లు+లు > విండ్లు

పోడు విండ్లు జోడించుకుని – బోలకొండ పేటకు పెళ్ళా.

7. 'రు' మనుష్యవచక సర్వనామాలలోనూ, మనుష్యబోధక సంఖ్యావాచక రూపాలలోనూ వస్తుంది.

ఉదా: మీరు, వారు, నలుగురు, ముగ్గురు.

8. నిత్యబహువచన రూపాలు:

ఉదా: తలంబ్రాలు, అక్షింతలు, రాగులు, చోళ్లు, సామలు, జొన్నలు, బొబ్బర్లు, నువ్వులు, కొర్రలు, అలసందలు, పెసర్లు,

9. నిత్యబహువచనరూపాలైనప్పటికి ఏకవచన రూపాలుగా ప్రయోగించబడుతున్నాయి.

ఉదా:పాలు, కల్లు, సారాయి, మందు, తేనె, అన్నం, నీళ్ళు, నెయ్యి, బియ్యం.

కొండరెడ్ల తెలుగులో తేనెలు అను బహువచన రూపం విశేషంగా కనబడుతుంది.

.....కొండ దుంపలు తిందాం – చెట్టులో తేనెలు కోస్తాం.......

**విభక్తి:**

**నామప్రత్యయాలు**

'ను' కర్మర్థంలోనూ, 'కు' సంప్రదానాది అర్థాల్లోనూ నామానికి చేరతాయి. వీటికి ఇకారాంత శబ్దాల తర్వాత ని, కి, అనే రూపాలున్నాయి.

| | |
|---|---|
| ఉదా: -ను | -ని |
| నేను | మమ్మల్ని |
| చుట్టాలను | ఆడోళ్ళని |
| నిన్ను | మొగోళ్ళని |

కొండరెడ్ల జానపద భాషలో సర్వనామాలపై కర్మార్థంలో 'కు' కు బదులు 'కి' రాయడం విశేషంగా కనబడుతుంది. తక్కిన శబ్దాల్లో ని, ను లు కి, కు లలో ఏదైనా వస్తుంది.

| | |
|---|---|
| -కు | కి |
| లేగలకు | నాకి, నీకి |
| చుక్కలకు | అన్నానికి |

| | |
|---|---|
| కేకలకు | పెండ్లికి |
| కన్నెకు | పోట్లానికి (మాంసానికి) |
| పూటకు | కంటిదోకి |
| తానాలకు | చలిదికి |
| గుబ్బట్టకు | నగరికి |
| పాటకు | దారికి |
| ఆటకు | ఆడవారికి |
| వేటలకు | మగవారికి |
| తీగతీగకు | సందికి |
| -ను | -ని |
| కళ్ళను | పల్లిని |
| అవ్వను | బిడ్డల్ని |
| గుడ్లను | |
| -కు | -కి |
| పాటకు | అడవికి |
| ఉట్టిచేట్లుకు | వేటకి |

| | |
|---|---|
| తోటకు | కయ్యకి |
| తానాలకు | బక్కోడికి |
| పత్తి చెట్టుకు | నేలతల్లికి |
| నేలకు | గూటికి |

**సహచరి సంబంధకారకాలు –తో, -తోని, -తోటి, -తోడి**

| **-తో** | **-తోని** | **-తోడి** |
|---|---|---|
| మోతలతో | అయ్యతోని | కులముతోడి |
| కయ్యలతో | మరదండ్లతోని | అమ్మలతోడి |
| ఏమితో | **-తోటి** | గుబ్బట్టతోడి |
| నీళ్ళతో | బాణముతోటి | ముంత తోడి |
| నెయ్యితో | తల్లితోటి | |

**1.అభ్యంతరార్థకాలు –లో, -లోన**

| ఉదా : -లో | -లోన |
|---|---|
| పెట్టిలో | కాయలోన |
| కోటలో | కొండలోన |
| దొర్రలో | దోర్రలోన |

సంగువలోన

బయలులోన

వెన్నులోన

గండిలోన

మోరులోన

నామవాచకానికి- నామవాచకానికి, నామవాచకానికి- క్రియకి మధ్యగల సంబంధాన్ని బోధించే స్థలార్థక ప్రత్యయాలు కొండరెడ్ల గేయాలలో ఎడనెడ కన్పిస్తున్నాయి. అవి 1. స్థలార్ధరకంలో :

-మీద, -దగ్గిర, -కా, -లో, -లోన, -లోని, -కింద వీటిని ఉపర్యర్థకాలు, స్టలార్థకాలు, సమీపార్థకాలు మొదలగు వాటిగా చెప్పడం జరిగింది.

ఉపర్యర్దకం : -మీద

ఉదా: గండిమీద, చెంపమీద, బోయలమీద

సమీపార్ధాకాలు : -దగ్గిర, -కాడ, -కడ

| | | |
|---|---|---|
| ఉదా: -దగ్గిర | -కాడ | -కడ |
| గుబ్బట్లదగ్గిర | కొండకాడ | ఇంటికడ |
| గోవులదగ్గిర | దొడ్డికాడ | యేటకడ |

స్థలార్థాకం :  -లో /-లోన/-లోని/-కింద

ఉదా :   -లో    -లోన    -లోని

| | | |
|---|---|---|
| సందులో | పుట్టలోన | పొయ్యిలోని |
| వామిలో | లంకలోన | అటుకులోని |
| అడవిలో | డొంకలోన | దొడ్డిలోని |
| అడుసులో | దోర్రలోన | కొండలోన |

-కింద : గుండుకింద, కొండకింద,  పందిరికింద, రావికింద

**ఔపవిభక్తికరూపాలు :**

నామ ప్రాతిపదికలమీద చేరే  విభక్తి ప్రత్యయాలతో నామానికి అన్వయం కుదరనపుడు ఔపవిభక్తి ప్రత్యయాలు వచ్చి చేరి అన్వయం కుదిరిస్తాయి. ఇది ఉచ్చారణ సౌలభ్యంకోసం భాషలో జరిగే ప్రక్రియ. వైయాకరణులు భాషలో జరిగే ఈ సంయోజనం గుర్తించి ఉపవిభక్తిగా గుర్తించారు. కొండరెడ్ల తెలుగులో ఔపవిభక్తి ప్రత్యయాలుగా –టి, -ంటి, -ట

-ట : నోటమాట, ఏట్ల

-టి   : సూటిగొడ్డు, తోటికోడలు, తిరగటిరాయి, మూకిటిని, తాటిని, వీటిని, ఏటిగట్టు

-ంటి : చీకటింటి, కంటి,

**క్రియావిజ్ఞానం :**

కొండరెడ్ల తెలుగులోని క్రియలను, వాటిపై చేరిన ప్రత్యయాలను పరిశీలించినపుడు కొండరెడ్ల తెలుగు చాలా వరకు నేటి ప్రధాన స్రవంతికి దగ్గరగానే ఉంది. క్రియలను సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త క్రియలు అని రూప పరంగా విభజించి, అకర్మక సకర్మకాలుగా వింగడించి చూడడం జరిగింది. క్రియల సమాపక అసమాపక స్థితిని పరిశీలించి చూడడం జరిగింది, క్రియల వినియోగంలోని అర్థ విస్తృతిని పరిశీలించడం జరిగింది. చివరగా క్రియలపై చేరే వ్యతిరేక ప్రత్యయాలను పరిశీలించడం జరిగింది.

**సామాన్య క్రియలు**

అడుగు, అబ్బు, ఆడు, ఊగు, ఎరుగు, ఒప్పు, కలయు, కాయు, కొరుకు, కోయు, గుంజు, గుద్దు, గూంకో, చిమ్ము, చెల్లు, తూలు, తెంచు, తేలు, తొక్కు, తోలు, త్రిప్పు, దంచు, దాటు, దూచు, దూరు, పంచు, పండు, పడు, పాడు, పారు, పెంచు, పొడుచు, మాడు, మాను, ముట్టు, మోగు, మోయు, మ్రింగు, విసురు, వేంగు, సాదు.

**సంశ్లిష్ట క్రియలు**

**-ఇంచు :** ఆరగించు,

**-చు :** కాచు, కాల్చు, గుచ్చు, దూచు, వొడుచు, విచ్చు,

**-పు :** పంపు, సాపు, ఒప్పు, తిప్పు,

**సంయుక్త క్రియలు:**

**-ఉండు :** పైతుండు, కొట్టుతుండు, సిమ్ముతుండు, ఎగురుతుండు,

వెడుతుండు, గుచ్చుతుండు, చీకుతుండు

**-కొను :** నమ్ముకొను, దువ్వుకొను, అందుకొను, కమ్ముకొను, జల్లుకొను

**-ఇచ్చు :** తీసిచ్చు, నాటిచ్చు, కట్టిచ్చు, ఇప్పిచ్చు, తొక్కిచ్చు, తోలిచ్చు, కొట్టిచ్చు,

**-పడు :** కుడుటపడు, ఆశపడు, కట్టుపడు, తలపడు

**అకర్మక క్రియలు**

అడుగు, ఆడు, ఊపు, కొరకు, గుంజు, గుచ్చు, గుద్దు, చల్లు, చెప్పు, తగులు, తిప్పు, తెంచు, తెచ్చు, తొక్కు, దంచు, దాటు, దిగు, నాటు, పట్టు, పాడు, పెంచు, మాను, మింగు, ముట్టు, రాయు

**సకర్మక క్రియలు**

**-చు**

కాయు-కాచు

వేయు-వేచు

చూడు-చూచు

కాయు-కాచు

పంపు-పంచు

పెంపు-పెంచు

రాయు-రాచు

దుయు –దూచు

దాయు-దాచు

మోయు-మోచు

కాలు-కాల్చు

తెగు-తెంచు

పూయు –పూచు

**-ంచు**

తాగు-తాగించు

పండు-పండించు

పెట్టు-పెట్టించు

కట్టు-కట్టించు

నమ్ము-నమ్మించు

పట్టు-పట్టించు

పాడు-పాడించు

కలుగు-కలిగించు

చిక్కు-చిక్కించు

వేయు-వేయించు

తెచ్చు-తెప్పించు

అమ్ము-అమ్మించు

చెప్పు-చెప్పించు

**-పు**

వాయు-వాపు

మోయు-మోపు

కాయు-కాపు

ఊగు-ఊపు

సాచు –సాపు

**-ంపు**

దించు-దింపు

తెంచు-తెంపు

వంచు –వంపు

పెంచు-పెంపు

**అకర్మకం సకర్మకంగామారి ప్రేరణార్థకాలు కావడం**

ఆకర్మకం : చూచు, తలచు, పంచు, పెంచు, తెంచు, చచ్చు, ఏడ్చు,పొడుచు,

సకర్మకం : చూపు, తలపు, పంపు, పెంపు, తెంపు, చంపు, ఏడ్పు, పొడుపు.

ప్రేరణార్థకం : చూపించు, తలపించు, పంపించు, పెంపించు, తెంపించు, చంపించు, ఏడిపించు, వొడిపించు.

**సమాపక క్రియలు : భూతకాలం**

**మ.పు. ఏ.వ. :** కలిపినావు, కలిసినావు, ఇచ్చావు, చెప్పితివి,

**మ.పు.బ.వ.** వచ్చారు, ఇచ్చారు, కనిపెట్టిరి

**ఉ.పు.ఏ.వ:** చెప్పితిని, మందెతిని, ఇత్తిని, కొట్టాను.

**బహువచనం:** చెప్పితిమి, కొడితిమి, జల్లుకొంతిమి, దురమైతిమి.

**ప్ర.పు.బ.వ.(స్త్రీ+పుం)**

వచ్చారు, కలిసినారు, ఉన్నాము, చెప్పాము, వేశం

**ప్ర.పు.నపుం. బ.వ.:** వోయాయి, ఉన్నాయి, చొరబడ్డాయి.

**ప్ర.పు.ఏ.వ.(నపుం+స్త్రీ):**ఉంది, ఎగిరింది, జల్లుకుంది, వోయింది.

**ప్ర.పు. ఏ.వ. (పుం.):**వచ్చాడు, కొట్టాడు, కొన్నాడు, తిన్నడు

**సమాపకక్రియలు /వర్తమానకాలం**

**ఉ.పు. ఏ.వ.:** వచ్చే, తాగుతున్న, వోతున్న.

**ఉ.పు.బ.వ. :** దంచుకుంటున్నాము, కోస్తున్నాము, చేసుకుంటున్నాము

మధ్యమ పురుష ఏ.వ.: వస్తున్నాము, కోస్తున్నాము, తింటున్నాము.

బహువచనం : చూసుకుంతున్నారు, తాగుతున్నారు, జల్లుకుంటున్నారు

**మ.పు. బ.వ.(స్త్రీ+పుం):** కోస్తున్నారు, దంచుకుంటున్నారు, ఉంతున్నారు, కోంతున్నారు

**ప్ర. పు. బ.వ. (నపుం ):**చూసుకుంటున్నాయి, తింటున్నాయి, గుర్తుకొస్తున్నాయి, తాగుతున్నాయి

**ప్ర. పు. ఏ.వ.(నపుం+స్త్రీ):**పోతుంది, చంపేస్తుంది, చేస్తుంది, ఉంతుంది

**ప్ర. పు. ఏ.వ.** (పుం.): జోరబడుతున్నాడు, కోస్తున్నాడు, అడుగుతున్నాడు

**సమాపకక్రియలు /భవిష్యత్తు**

**ఉ.పు. ఏ.వ** :పోతా, కోస్తా, కట్టుకుంతా, యాల్తా, ఉంతా

**ఉ.పు.బ.వ.:** మన్నిద్దాము, కొడ్తాము, చెప్తాం, చంపేస్తాం, కట్టుకుంతం, తిందాం **మ.పు. ఏ.వ. :**కొడ్తవు, ఎక్కిస్తవు, తింటవు, పోతవు.

**మ.పు.బ.వ.:** అంతరు,ఆరబెడ్తరు,కొడ్తరు,చెప్తరు

**ప్ర.పు. ఏ .వ.(నపుం+స్త్రీ) :**పెడ్తది, చెప్తది,పోద్ది, కొడ్తది

**ప్ర.పు. ఏ .వ.(పుం) :**మన్నిస్తడు,ఉంచుతడు,ఎక్కుతడు, ఇస్తడు

**ప్ర.పు.బ.వ.(నపుం.):**చేస్తాయి,ఎగురుతాయి,ఎల్తాయి,కలుస్తాయి

**ప్ర.పు.బ.వ.(స్త్రీ.+పుం.) :**అంతరు,అరుస్తరు,ఆరబోస్తరు,కొడ్తరు

**తద్ధర్మార్ధకక్రియలు**

అనటం,పారడం,పుట్టడం,జరుగు

**అసమాపక క్రియలు**

**క్త్వార్థకము :**

ఆగి, ఎక్కి, ఏర్పడటానికి, కట్టి, కలిపెసి, కలిసి, కాగబెట్టి, కోసి, చూసి, డోకి, తగిలించుకొని, తీసి, తీసికెళ్ళి, తెచ్చి, తెలియని, తోగేసి, తోలికెళ్ళి, దంపి, నరికి, నరికేసి, నిర్మించుకొని, నిలబడి, పట్టి, పిలిచి, పూజించి, పెట్టి, పోయి, పోసి, మింగేసి, లేపి.

**శత్రర్ధక క్రియలు**

తాగుకుంట,తినుకుంట,నడ్సుకుంట,పాడుకుంట,వినుకుంట

**సందేహార్ధక క్రియలు (-ఓ,-ఎమో,-అని,-కాని,-కదా,-వచ్చు,-ఆట,-అంట,-ఆ):**

ఏదో, పొడ్తదేమో, ఉందేమో, దొరకాలని, పర్వాలేదని, దేల్వదుకాని, తిరుగుతారుగద, తెలవద్దుకదా, పెద్దవారుగదా, పెళ్ళైందికదా, తినవలెకదా, అనుకోవచ్చు, పెడ్తాడట, కనిపిస్తానంట, అదా, కల్సిపోతారుగా.

**చేదర్ధక -ఏ, :** ఇప్పుడైతే, ఇయ్యకపోతే, కదిరితే, చనిపోతే, దిగితే, దిగాలంటే, పెడ్తే, పోవాలంటే, మిగిలితే, వస్తే.

**ఆశ్చర్యార్థకాలు**

అంటే!, అయ్యో!, అవునా !, ఇప్పుడెలా!

**ప్రశ్నార్ధకక్రియలు**

ఎవరైతేనేమి?, ఎవర్రా?, ఏం?, ఏటి?, ఏమని?, ఏముంటాయిరా?, చూశారా?, చూసుకుంతారా?, నిలబెడతారా?, నీకుఏటి?, వండుతారా?

**ధాతుజవిశేషణాలు –ఇన**

కొట్టిన, చెడ్డిన, పండిన, వచ్చిన.

**భావర్ధక క్రియలు –అటం ,-అడం**

కోరటం, పండించుకోవటం, వాడుతుండటం, చెండటం, చల్లడం, తొక్కడం, తోలడం.

**విద్యర్థక క్రియలు**

అడుగురా, అనండి, చూడరా, చూడు, తాగు, తిను, తిసుకురా, పట్టండిరా, పాడుద్ది, రాసుకొన్డ, వెంగాయే(వేగంగారా), సత్తర(చూపించు)

**వ్యతిరేకార్థక  క్రియలు**

ప్రత్యయగతం : -అ, -ఆకు, -అక, -లేక , -అకుండ,

**-అ**

తెలియదు, ఉండవు, తాగం, అటువెల్లరు.

**-ఆకు**

గొట్టాకు, రావాకు.

**-అక:** కాయక

**-లేక:** మతిలేక

**-అకుండ:** ఎరుగకుండ, కట్టనివ్వకుండ

**పదగతం :  -లేదు, -లేడు, -రావు, -కాదు  -వద్దు**

**-లేదు:**ఆడలేదు,కట్టలేదు,తిప్పలేదు,దగ్గరలేదు,పుట్టలేదు.

**-లేడు:** తిసేవాడులేడు

**-రావు:** గితలురావు

**-కాదు:** ఇదికాదు,మీరేంకాదు.

**-వద్దు:** ఇత్తువద్దు, పోత్తువద్దు,

**సర్వ నామాలు :**

ఉత్తమపురుష సర్వనామాలు

మధ్యమ పురుష సర్వనామాలు

ప్రథమ పురుష సర్వనామాలు

ప్రశ్నార్థక సర్వనామాలు

సూచక సర్వనామాలు

అది, అదే, అప్పుడు, యిప్పుడు, ఈ, ఆ, యే, అలాంటిది, అవన్నీ, ఇంత, ఇటు, ఇటే, ఇది, ఇవి, మీ, వారు, తమ, దాన్ని, దీన్ని, ఇక్కడ,

**సంఖ్యా వాచకాలు**

సంఖ్యావాచకాలు నామవాచకాల్లో ఒక భాగం. సంఖ్యావాచకాలను ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

అ . ప్రాథమిక/గణన సంఖ్యావాచకాలు

ఆ . నిష్పన్న /శ్రేణి స్థాన సంఖ్యావాచకాలు

ఒకటి, రెండు, మూడు మొదలైనవి ప్రాథమిక సంఖ్యావాచకాలు. ఇవి లెక్కబెట్టడానికి ఉపయోగపడతాయి. వీటినే గణన సంఖ్యావాచకాలు అంటారు. ఈ సంఖ్యావాచకాలకు ‘‘-ఆవ, --అగు’ అనే ప్రత్యయాలు చేరి ఏర్పడేవి శ్రేణి స్థాన సంఖ్యావాచకాలు. వీటినే

సంఖ్యేయవాచకాలు అంటారు.

ఉదా : ఒకటవ, రెండవ, మూడవ, ఇవి ఒక శ్రేణిలోని స్థానాన్ని తెలపటానికి ఉపయోగపడతాయి.

కొండరెడ్ల మౌఖికసాహిత్యంలోని సంఖ్యావాచకాలు ప్రమాణ భాషలోని సంఖ్యావాచకాలకన్నా కొంత విలక్షణంగా కన్పిస్తున్నాయి ......

ఒకటి, రొండు , మూడు, ఐదు , ఆరు, ఏడు, పది, వంద,నూరు కనిపించాయి

ఒకటికిత్తే , రొండు పుడుకులు, మూడు పుట్లు, అయిదు పుడుకుల గడ్డి, ఆరు డ్రాముల సారా, ఏడూళ్ళు, పదికాలాలు, రానుపోను వందరుపాలుంటే, నూరు

**సంఖ్యావాచకాలు – లింగవచన నిరూపణ**

సంఖ్యావాచకాలలో ఏకత్వబోధక సంఖ్య ఏకవచనం. దీనిపై ఏకత్వ లింగబోధక ప్రత్యయం చేరి ఏకత్వబోధక సంఖ్యావాచకం ఏర్పడుతుంది.

**ఏకత్వబోధక సంఖ్యావాచకం:** ఇవి మూడు రకాలు

| మహద్వాచకం | అమహత్మహతీవాచకం |
| --- | --- |
| ఒక్కడు | వొకటి (ఒకటి) |
| వొక్కడు | వొక్క (ఒక్క) / వొక(ఒక) |

వీటిని గౌరవసూచకంగా సూచించేటప్పుడు బహువచన ప్రత్యయం 'రు'

ప్రయోగింపబడింది.

ఉదా : ఒక్కరు, యిద్దురు

**బహుత్వబోధక సంఖ్యావాచకాలు**

సంఖ్యా వాచకాలలో బహుత్వబోధక సంఖ్యబహువచనం. ఇవి రెండు రకాలు.

1. మనుష్యవాచక సంఖ్యావాచకాలు
2. అమనుష్యవాచక సంఖ్యావాచకాలు

**1. మనుష్యవాచక సంఖ్యావాచకాలు**

ఇందులో మహన్మహతీ భేదం ఉండదు. మహత్తులను,మహతీ వాచకాలను తెలపడానికి ఒకే రకమైన సంఖ్యావాచకాలను వాడతారు.

ఉదా : ఇద్దురు/యిద్దురు/ఇద్దరు/వోగరిద్దరు/ముగ్గురు/నలుగురు.

ఇద్దరికంటేఎక్కువ సంఖ్యగల బహుత్వబోధక మనుష్యవాచక సంఖ్యావాచకాన్ని చూపి౦చాల్సి వచ్చినప్పుడు 'గురు' ప్రత్యయం చేరుతుంది.

ఉదా : ముగ్గురు , నలుగురు, అయిదుగురు

ఐదు సంఖ్య నుండి మనుష్య వాచక సంఖ్యావాచకాల్ని చూపించాల్సి వచ్చినపుడు ''మంది' ప్రత్యయం చేరుతు౦ది.

ఉదా : ముప్పైయారు మంది

డెబ్బైయారు మంది

**2 . బహుత్వ బోధక అమనుష్య వాచకసంఖ్యా వాచకాలు**

వీటిని మూడు రకాలుగా విభజించవచ్చు .

1. సామాన్య సంఖ్యావాచకాలు

2. సంశ్లిష్ట సంఖ్యావాచకాలు

3. సంయుక్త సంఖ్యావాచకాలు

**1. సామాన్య సంఖ్యావాచకాలు**

వీటిని మూలకాంకాలు అంటారు. సంశ్లిష్ట, సంయుక్త సంఖ్యావాచకాలు ఏర్పడడానికి ఇవి మూలం.

మూలకాంకాలు :1 నుంచి 10, 100, 1000, లక్ష, కోటి మొదలైనవి.

ఉదా : వొక్కటి, రెండు, మూడు, ఆరు, ఏడు, పది, నూరు,వెయ్యి, కోటి.

**2 సంశ్లిష్ట సంఖ్యావాచకాలు**

ఉదా : ఇరపై

**3. సంయుక్త సంఖ్యావాచకాలు**

ముప్పై+ఆరు =ముప్పైయారు

డెబ్బై+ఆరు =డేబ్బైయారు

కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోని భాషను పరిశీలించి కొండరెడ్ల భాషలోని వర్ణాలు వాటి ప్రాచీన స్వరూపం నేటి ప్రమాణ తెలుగుతో పోల్చి చూడడం, కొండరెడ్ల తెలుగులో ఉన్న సంయుక్తాలను, దిత్వాలను పదసహితంగా ఇవ్వడం జరిగింది. పద ప్రత్యయ సంయోజనలను పరిశీలించి లింగం, వచనం, విభక్తి ఔపవిభక్తి రూపాలను చర్చించడం జరిగింది. క్రియలపై చేరె కాలబోధక ప్రత్యయాలను పురుష బోధక ప్రత్యయాలను, వ్యతిరేకార్థక ప్రత్యయాలను వివరించడం జరిగింది. చివరగా కొండరెడ్ల తెలుగులో లభ్యమైన సర్వనామాలను, సంఖ్యా వాచకాలను విశ్లేషించడం జరిగింది. కొండరెడ్ల తెలుగుభాషపై భాషా శాస్త్ర దృక్పథంతో ప్రత్యేక అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.

# పరిశోధన ఫలితాలు

**పరిశోధన ఫలితాలు**

భారతదేశంలో గిరిజన తెగలు అనేకం. భారదేశానికి మూలవాసులుగా ఉన్న అనేక తెగలలో తెలుగు మాతృభాషగా కలిగిన కొండరెడ్లు ఒకరు. నేటికీ కొండరెడ్లు తమదైన అస్తిత్వ జీవన విధానాన్ని విడనాడకుండా కాపాడుకుంటూ వస్తున్న తెగగా గుర్తింపు కలిగిఉంది. తెలుగు మాతృభాషగా గలిగిన సుమారు ఏడు గిరిజన తెగలలో కొండరెడ్లు ఒకరు. వీరి జనాభా మొత్తం మీద రెండు లక్షలకు మించి ఉన్నారు. వీరు స్థానిక తెగలకు చెందినవారైనప్పటికీ విద్యారంగంలో చాలా వెనకబడిఉన్నారు. ప్రభుత్వ పరమైన పథకాలు అమలుపరుస్తునప్పటికి నాగరక సమాజంలోకి రావడం లేదు. ప్రకృతితో మమేకమైన జీవనానికి అలవాటు పడ్డ కొండరెడ్లలో మౌఖికసాహిత్యం అపారంగాఉంది. నాగరక సమాజానికి చెందని గిరిజనులైనప్పటికిని వీరి సామజిక సాంస్కృతిక జీవనంలో అనేక విషయాలలో అంతసూత్రబద్ధమైనా భారతీయతలో భాగమైన ద్రావిడసంస్కృతి నిండుగా కనబడుతుంది. ఇందుకు ఆకరంగా వీరి మౌఖిక సాహిత్యాన్ని సేకరించి అధ్యయనం చేయడంద్వారానూ, అందులోని అంశాలను

క్షేత్రపరిశోధనకు వెళ్ళినపుడు క్షేత్రంలో దర్శించడం ద్వారాను తెలుసుకొన వీలు కలిగింది.

కొండరెడ్ల మౌఖిక సాహిత్యం భాషాసామాజిక పరిశీలన అన్న అంశంపై పరిశోధనకై కొండరెడ్లను గురించిన విషయసేకరణ చేసి వారి ఉనికికి సంబంధించిన విశేషాలను మొదటి అధ్యాయంలో కూర్చడమైంది. ఇందులో కొండరెడ్ల నివాస ప్రదేశాలు వారి కుటుంబవ్యవస్థ, జీవనవిధానం, సామాజిక స్థితిగతులు, సంస్కృతిలోని ఆచారవ్యవహారాలు వివరించడంతో పాటు పరిశోధనకు ఎన్నుకున్న క్షేత్రమైన ఖమ్మంజిల్లాలో నివసించే కొండరెడ్ల ఉనికికి సంబంధించిన విషయాలను మొదటిఅధ్యాయంలో కొండరెడ్ల పరిచయంగా తెలపడం జరిగింది. ఈ అధ్యాయ రచనద్వారా కొండరెడ్లకు సంబంధించిన అనేక విశేషాలు తెలుసుకొను అవకాశం కలిగింది. కొండరెడ్ల మౌఖికసాహిత్యంద్వారా పైన చెప్పిన విశేషాలు అన్నీ లభ్యం అవుతున్నాయా లేక ఇంతకన్నా మించిన విశేషాలు ఎమన్నా లభ్యం అవుతాయా అని పరిశీలించడంకోసం పరిశోధన చేయడం జరిగింది. ఖమ్మం జిల్లాలోని వరరామచంద్రాపురం మండలంలోని కొండరెడ్ల మౌఖికసాహిత్యంపై ఇంతకూ మునుపు ఎమ్.ఫిల్. చేశాను. అందుకు కొనసాగింపుగా ఖమ్మంజిల్లాలో అన్ని మండలాలలో నివసిస్తున్న కొండరెడ్ల మౌఖిక సాహిత్యంపై పిహెచ్.డి. చేయాలని తలపెట్టాను. క్షేత్రపర్యటన చేసి కొండరెడ్లు పాడే పాటలను సేకరించడమైంది. ఖమ్మంజిల్లాలో ప్రధానంగా ఆరు మండలాలలో కొండరెడ్లు నివసిస్తున్నారు. ఈ ప్రదేశాలు కొన్ని సమతల భూభాగంలోనూ కొన్ని పర్వత శ్రేణుల్లోనూ ఉన్నాయి. రెండు ప్రదేశాలలోని

జీవనరీతులు కొంత వైవిధ్యంగా కన్పిస్తున్నాయి. ఈ అంశాలు మౌఖికసాహిత్యంలో ఎంతమేరకు చిత్రీకృతమైనవో పరిశీలించి తరువాతి అధ్యాయాలలో చర్చించడమైంది.

కొండరెడ్ల మౌఖికసాహిత్యంద్వార కొండరెడ్ల కుటుంబ జీవనవ్యవస్థను రెండవ అధ్యాయంలో పరిశీలించినపుడు కొండరెడ్ల కుటుంబంలో అవ్వతాతలు కుటుంబ పెద్దరికం వహిస్తారు. తరువాత ఆ వరుసలో తండ్రితల్లి, కొడుకులు, కోడళ్లు, మరుదులు మరదల్లు కుటుంబంపై బాధ్యతను కలిగి ఉంటారు. బావామరదళ్ళ సరసం అందరికీ ఉన్నట్లే కొండరెడ్లలోనూ కన్పిస్తుంది. అన్నదమ్ముల అనుబంధం అప్పచెల్లెళ్ళకు అన్నదమ్ముల అండదండలు, అత్తమామలగతులు, పినతల్లి, తోడికోడండ్లు, మరదండ్ల ప్రస్తావనలు అనేకం ఈ సాహిత్యం పరిశీలించడంద్వారా కుటుంబంలో వారి స్థానాన్ని తెలుపుతున్నాయి. వివాహం కాగానే ఎవరికి వారు వేరు వేరు ఇండ్లల్లో నివసించినా కుటుంబ సంబంధ విషయాలలో ఒకరికొకరు తోడుగా ఉన్న తీరు కన్పిస్తుంది. కొండరెడ్ల మౌఖికసాహిత్యంలోని కుటుంబజీవన విధానాన్ని పరిశీలించినపుడు వీరికున్న బంధువర్గ విస్తరణ, బంధుప్రీతి, బంధువర్గంతో చేసే సంప్రదింపులు, విందులు, వినోదాలు ఇలా అనేక కుటుంబ సంస్కృతికి సంబంధించిన అంశాలు తెలుస్తున్నాయి. వీటితో పాటు కొండరెడ్ల వైవాహిక సంబంధంలోని బలమైన కట్టుబాట్లు తెలుస్తున్నాయి.

కొండరెడ్ల సామాజిక జీవనమనే మూడవ అధ్యాయంద్వార కొండరెడ్లు అడవుల్లోనూ కొండ ప్రదేశాలలోనూ అనుసరించే వ్యవసాయ విధానాలు, పండించే పంటలు, జలవనరులకై చేసే వెతుకులాటలు, వ్యవసాయ అనుబంధంగా పశుపోషణ కన్పిస్తున్నాయి. వేటాడే విధానాలు, వేటాడ బడే జంతువులు, పక్షులు, సామూహిక వేట విధానం, మాంసం పంపకాలు, విందుల్లో సాముహిక రీతి వంటి విశేషాలు

కన్పిస్తున్నాయి. అటవీ వనరుల సేకరణలో మూలికలు, తేనె, వెదుర్లు, తునికాకు, కుంకుడ్లు, జిగుర్లు వంటి వస్తువుల సేకరించే పద్ధతులు, చేతి వృత్తులుగా వెదురుతో అనేక వస్తువులు తయారు చేయడం, అవసరం మేరకు వినియోగించడం తక్కినవి సంతల్లో అమ్మడం  వంటి విషయాలు.  వ్యాపార విధానంలో సంతలు, బేరసారాలు, ద్రవ్యరీతి, వస్తుమార్పిడి విధానాలు చిత్రితమైన   తీరు కన్పిస్తుంది. సారాయి, కల్లు తాగడం,  నల్లమందు మింగడం, పొగాకునమలడం, చుట్టలు బీడీలు కాల్చడం వంటి వ్యాపకాలు కన్పిస్తున్నాయి. వీరు నిర్వహించే వృత్తులు, ఇంటినిర్మాణ రీతులు, గ్రామనిర్మాణ రీతి, వెట్టిజీవనంవంటి అంశాలతో  కొండరెడ్ల జీవన పరిమితులు వీరి సాహిత్యంలో పుష్కలంగా  కన్పిస్తున్నాయి .

కొండరెడ్ల మౌఖికసాహిత్యం - సంస్కృతిని అన్న నాల్గవఅధ్యయంలో కొండరెడ్లు ఆచరిస్తున్నమతం, పండుగలు,  పూజావిధానం, బలులు, మాంసం నైవేధ్యాలు వంటివి. పెండ్లితంతు, మేనరికాలు, పెండ్లి,  సీమంతం,  సంతానం ప్రధానంగా కన్పిస్తున్నాయి. ఇల్లరికం, పెండ్లి తిరస్కృతి ప్రత్యేకంగా కన్పిస్తున్న విషయాలు. కొండరెడ్ల అలంకరణ సామాగ్రి, వీరు ఆచరించే సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, విద్యావిధానంలో  ప్రాచీనత ఉట్టిపడుతుంది. వీరి ఆహార విహార పద్ధతులు, వినోద విలాసాలను పరిశీలించి చూసినపుడు కొండరెడ్ల సంస్కృతిలో నాగరికతను అలవరచుకోనితనం తెలుస్తుంది. దేవతామూర్తులను కాలానుగుణంగా పూజించేతీరు, దేవతలను అనుగ్రహించుకునే నమ్మకాలు, నైవేధ్యాలను సమర్పించే విధానాలు, దైవాన్ని నమ్మినతీరును గమనించినపుడు కొండరెడ్ల సంస్కృతీ పరిరక్షణ ప్రకృతితో ముడిపడినవిధానం కన్పిస్తుంది. కుటుంబసంస్కృతి పరిరక్షణ, గ్రామసంస్కృతిలో

సామూహికంగా  పాల్గొనేవిధానాలు, ప్రతి చిన్నపెద్ద పండుగలకు వీరు చేసుకునే విందులు వినోదాలు వీరి జీవన సంస్కృతిలోని వైవిధ్యాన్ని  తెలియజేస్తుంది.

కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోని భాషను పరిశీలించి కొండరెడ్ల భాషలోని వర్ణాలు వాటి ప్రాచీన స్వరూపం నేటి ప్రమాణ తెలుగుతో పోల్చిచూడడం, కొండరెడ్ల తెలుగులో ఉన్న సంయుక్తాలను, దిత్వాలను పదసహితంగా ఇవ్వడం జరిగింది. పదప్రత్యయ సంయోజనాలను పరిశీలించి లింగం, వచనం, విభక్తి, ఔపవిభక్తి రూపాలను చర్చించడం జరిగింది. క్రియలపై చేరే కాలబోధక ప్రత్యయాలను పురుషబోధక ప్రత్యయాలను, వ్యతిరేకార్థక ప్రత్యయాలను వివరించడం జరిగింది. చివరగా కొండరెడ్ల తెలుగులో లభ్యమైన సర్వనామాలను, సంఖ్యావాచకాలను విశ్లేషించడం జరిగింది.  కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోని భాషను అక్షరగతంగానే దర్శించడం జరిగింది. అలా కాకుండగా మౌఖికభాషను శాస్త్ర దృక్పథంతో సేకరణ చేసి ప్రత్యేక అధ్యయనం చేస్తే మరిన్ని భాషావిశేషాలు వెలుగుచూడగలవని భావిస్తున్నాను.

కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోనూ క్షేత్రపరిశోధనకు వెళ్ళి మౌఖిక సాహిత్యాన్ని సేకరించే సమయంలో కొండరెడ్లతో జరిగిన సంభాషణలో లభ్యమైన పదాలను పదబంధాలను అనుబంధంలో  చేర్చడమైంది. అనుబంధంలోని  పదాలను అర్థ క్షేత్రాలుగా వర్గీకరించి చూపడం జరిగింది.

# అనుబంధాలు

కొండరెడ్ల మౌఖిక సాహిత్యాన్ని పరిశీలనకై దర్శించినపుడు వారు వినియోగించే తెలుగు పదాల విస్తృతి విరళంగా కన్పిస్తుంది. ముఖ్యంగా నామపదాలను పరిశీలించి చూసినపుడు ప్రతి అంశానికి సంబంధించిన అర్థక్షేత్రాలు కన్పిస్తున్నాయి. నామపదాల విస్తృతి జాతిజీవనరీతి వైశిష్ట్యాన్ని తెలియజేస్తుంది. కొండరెడ్లు తక్కువ ప్రదేశాలలో నివసిస్తున్నప్పటికీ, ఆ తెగలో తక్కువమంది జనాభా ఉన్నప్పటికీ, ప్రాచీనతను సంతరించుకున్న జాతిగా మనుతున్నారు. వారి జీవన శైలినాగరక సమాజంలోని దేశి జీవనం చేస్తున్న వారికి సమానంగా కన్పింంచేలా వీరు వినియోగిస్తున్న పదాలు కన్పిస్తున్నాయి. ఈ అధ్యాయంలో చాలా మాటలు కొండరెడ్ల మౌఖిక సాహిత్యంలోనివి. అవే కాకుండా క్షేత్రపర్యటనలో సందర్శన చేసిన చోట విషయసేకరణకై కొండరెడ్లతో సంభాషించినపుడు చేసుకున్న రికార్డులలో నిక్షిప్తమైన వారి మాటలను కూడా విషయ నివేదనకై ఈ అధ్యాయంలో చేర్చడం జరిగింది.

**ఇండ్లు** : అడ్డుదూలాలయిల్లు, ఓటికంబాలయిల్లు, కీడుపాకలు, కోళ్ళపాకలు, గొడ్లపాక, చావడిల్లు, చీకటిల్లు, చేనుపాకలు, దీపకంబాలయిల్లు, బోడుకంబాలయిల్లు, మలకరిల్లు, మూడు స్తంబాల యిల్లు,

**ఇండ్ల కట్టుడు వస్తువులు :** రాట్టలు, నిట్రం,గునాలు, పట్టెలు, వాసాలు, దూలం, వెదురు బొంగులు, తాటాకు, తాటినార.

**ఇండ్లభాగాలు** : అటక, కంబాల, గదులు, గుమ్మం, దిడ్డు, పిసేలు, పురికప్పు, బడ్డి.

**ఇంటి అలంకరణ :** అలుకు, ఎర్రమట్టి, ముగ్గు, బర్కం.

**వ్యవసాయ భూములు :** కుంటభూమి, గరవుభూమి, పొలంభూమి, పోడుభూమి, మెరకభూమి, రేగడిభూమి,

**వ్యవసాయ పనిముట్లు** : అడ్డకత్తి, ఊసికత్తి, ఓలకత్తి, కట్టువ, కొడవలి, గునపం, గొడ్డలి, చిన్నకత్తి, చెలుపుకత్తి, పలుగు, పార, బోబ్బెకత్తి, వొలువ,

**నీటివనరులు** : కొండచెలమలు, గోదావరినదీజలాలు, మడుగులు, లోయలు,

**వ్యవసాయం పనులు :** ఆకుపొయ్యడం, ఆకుమడి, ఉటనీరు, ఊడ్పడం, కలుపుతీయడం, కళ్లం, కోతలు, గట్లుగొట్టు, గద్దె, తూములు, దుంపగీత, నూర్పిడి, పనకట్టడం, పెద్దమడి, బెండకొట్టడం, మంచె,

**పంటలు :** అనుములు, అర్లు, ఆముదాలు, ఉలవలు, కందులు, పొగాకు, కొర్రలు, గోగు, చోళ్ళు, జొన్నలు, నువ్వులు, పత్తి, పెసర, పొగాకు, బుడుమ, బూడిదగుమ్మడి, బొబ్బర్లు, మినుములు, మొక్కజొన్నలు, వంగ, వడ్లు, సాములు,

**కూరగాయలు** : అరటికాయ, ఒర్రకాయ (మిరప), కాకరకాయ, గుమ్మడికాయ, చింతకాయ. చిక్కుడుకాయ, టమాట, దొండకాయ, దోసకాయ, నిమ్మకాయ, పనసకాయ, పరిందకాయ, పొట్లకాయ, బీరకాయ, బెండకాయ, మునక్కాయ, వంకాయ, సొరకాయ.

**పండ్లు :** అరటిపండు, ఇప్పపండ్లు, కుసుంపొండ్లు, చింతపొండు, చిక్కు పండ్లు, తాటిపండ్లు, నేరేడుపండ్లు, పనసపండు, మామిడిపండ్లు, యెలగపండు, రామాఫలం, సీతాఫలం, సోంపండ్లు.

**ఆకుకూరలు** : కొండతోటకూర, కొక్కెలికూర, కొయ్యగూర, గురుగుకూర, గోంగూర, చామకూర, చింతచిగురు, చెంచలికూర, పిట్టకందకూర, బచ్చలికూర, బొద్దికూర, బొద్దుకూర.

**దుంపలు**: అడవికంద, అల్లం, ఉల్లిపాయలు, కర్రపెండెలం, కలువదుంప, నల్లగడ్డ, నారదుంప, నీరుల్లిపాయ, పసుపు, పిండిదుంప, పుట్టకంద, పెలిచందగడ్డలు.

**పుట్టగొడుగులు :** అడ్డకొక్కులు, ఆమిదకొక్కులు, బేడికొక్కులు, బూడిదెకొక్కులు, చీర్మాను కొక్కులు, చిరుపుట్టకొక్కులు, గడ్డకొక్కులు, గరువకొక్కులు, గొడుగుకొక్కులు, జొన్నకొక్కులు, మొద్దుకొక్కులు, నేలకొక్కులు, పందికొక్కులు, పిడెంకొక్కులు, పెదురుకొక్కులు.

**పువ్వులు :** ఇప్పపూవు, కందిపూవు, కనకాంబరాలు, కొల్లెంసిపూలు, జాజిపూలు, తామరపూవు, పచ్చపూలు, మొల్ల, సెంటుమల్లిపూలు,

**తేనెలు**: కర్రతేనె, కుండకందురుతేనె, కుక్కనలుకతేనె, చెట్టుతేనె, తొర్రతేనె, పుట్టతేనె, బుడ్డతేనె, మొసరితేనె.

**జిగుర్లు :** తరుడుబంక, తెల్లబంక, నల్లబంక.

**వెదురు వస్తువులు :** ఎత్తు, గంప, గాదె, గూడగంప, చేట, తట్ట, తడక, పరకబుట్ట, పుటికె, పేడతట్ట, సిబ్బి.

**చెట్లపేర్లు** : అరటిచెట్టు, ఇప్పచెట్లు, ఈతచెట్లు, ఉసిరికచెట్టు, కనకాంబరంచెట్లు, కానుగచెట్టు, కుంకుడుచెట్టు, కొండగోగుచెట్టు, గుగ్గిలంచెట్టు, చింతచెట్టు, జీలుగుచెట్టు, జువ్విచెట్టు, జేగురుచెట్లు, తాటిచెట్లు, తునికిచెట్టు, తుమ్మచెట్లు, నేరేడుచెట్టు, పత్తిచెట్టు, పనసచెట్టు, పాలచెట్టు, పాశంచెట్లు, బడిశచెట్టు, బూరుగుచెట్టు, బొద్దిగచెట్లు, మామిడిచెట్టు, మారేడుచెట్టు, రావిచెట్టు, వెలగచెట్లు, వేపచెట్లు, సిందుగచెట్టు, సిగరాకు చెట్టు, సెంటుమల్లెసెట్లు, సోమిచెట్టు.

**తీగలు :** అడ్డతీగ, కోడిపుర్రుతీగ, గురివెందతీగ, టంగుడుతీగ, తిప్పతీగ, పాలతీగ, బూదరతీగ, మల్లెతీగ, ముచ్చికతీగ, వెంపలితీగ.

**పొదలు :** వెదురుపొద, ముళ్ళపొద.

**జంతువులు** : అడవిపందులు, ఆవులు(తెల్లావు, కర్రావు, ఎర్రావు, బొల్లావు, కొమ్ములావు, ముదారుగొడ్డు), ఎద్దులు, ఎలుగులు, కుందేలు, కుక్కలు, కొండగొర్రె, గిత్త, గేదెపోతులు, గేదెలు, గొర్రెలు, తోడేళ్ళు, దున్నపోతులు, దూడ, నక్క, పిల్లిలు, పందులు, పులులు, ముళ్ళ పందులు, మెకము, మేకపోతులు, మేకలు, లేగదూడ.

**జంతువులజబ్బులు:** కడ్లగడ్లు, కనసు, నోటిగడ్లు, మోర్క, రాసపుండు.

**పక్షులు** : ఋషిపిట్ట, ఎండ్రీతపిట్ట, కంచేరిపిట్ట, కనుజుపిట్ట, కన్నెపిట్ట, కాకి, కాటుకపిట్ట, కారుకోడి, కొప్పుపిట్ట, గడ్డిపిట్ట, గిస్సపిట్ట, గుంజిపిట్ట(గుడ్లగూబ), గుమ్మడేగ. గువ్వపిట్ట,

గైరికపిట్ట, గోరపిట్ట, చంబరుబుర్కపిట్ట, చిర్కుపిట్ట, జక్కిపిట్ట, జాజుపిట్ట, డబ్బపిట్ట, తీత్వపిట్ట, తేనెపిట్ట, తొగరికోడి, తోకపిట్ట, నెమలిపిట్ట, పికిలిపిట్ట, పిచుక, పూరిపిట్ట, పొన్నచిలుక, పొన్నపిట్ట, పొలుగుపిట్ట, బత్తిపిట్ట, బుచ్చిపిట్ట, బువ్వపిట్ట, బోడగువ్వలు, భీంపిట్ట, మైనాగొర, మైలపుంజు, రాలిపిట్ట, లకుముకిపిట్ట, వెండికుచ్చులడేరపుడేగ, సాకలిపిట్ట, సిక్కపిట్ట, సోరిపిట్ట.

**కోళ్ళు** : తల్లికోళ్ళు, నాటుకోళ్ళు, పందెంకోళ్ళు, పిల్లలకోళ్ళు, పుంజుకోళ్ళు, పెట్టకోళ్ళు.

**పాములు** : అకుదొల్ల, ఇమ్మెదుల, ఎర్రజెర్రిపోతు, కొండసెలువ, కొండపొడ, గుడ్డిపొడ, గోదుంతాసు, చక్కపాము, జెర్రిగొడ్డు, తాదేలు, నల్లజెర్రిపోతు, నల్లతాచు, నాగజెర్రి, నాగుపాము, పచిరిగాపాము, పాలకర్రముండది, పింజెర్ర, పొడపాము, బురదపాము, రగుటపొడ, వానపాము.

**కీటకాలు** : పురుగులు ఈగలు చీమలు అని ఇవి మూడు రకాలు. వీటిల్లో అనేక రకాల కీటకాలు ఉన్నాయి.

**పురుగులు :** ఆరుద్రపురుగు, ఈతబొడ్డెంపురుగు, ఉప్పుపురుగు, గరిసెపురుగు, గాగ(సీతాకోకచిలుక), గొంగలిపురుగు, గొమ్మరిపురుగు, చేడిపురుగు, పెంకుపురుగు, బండారుపురుగు, బల్లి, బొడ్డెంపురుగు, మిల్లిమిసికపురుగులు.

**ఈగలు :** కుండకందిరీగ, పచ్చకందిరీగ, పుట్టకందిరీగ, తేనెటీగలు,

**చీమలు :** ఎర్రచీమలు, గండుచీమలు, గుంట్రుచీమలు, చలిచీమలు, పుల్లచీమలు, రాణిచీమలు, సురేచీమలు.

**బల్లులు :** ఉడుకుబల్లి, పులిబల్లి, రాబల్లి.

**అన్నాలు** : అస్రకూడు, ఓరెంకూడు, కొర్రన్నం, గంటెకూడు, చిప్పకూడు, జొన్నన్నం, వడ్లకూడు, సజ్జన్నం, సామలకూడు.

**అంబళ్ళు** : అంబలి, చోడంబలి, టేంకంబలి.

**కూరలు** : అనపప్పు, ఉలవపప్పు, గొద్దలికూర, చిరుగటిపప్పు, దూలదామపప్పు, నెల్లికూర, బొద్దుకూర, వెదురుకొమ్ములకూర, సారుకూర.

**వాయిద్యాలు** : ఔజం, గిల్లకాయలు, డోలు.

**వ్యాపారసంపద** : అడ్డాకు, కుంకుడ్లు, జీడిమామిడి, తునికాకు, తేనె, శీకాయ.

**వెదురు వస్తువులు :** చేటలు, బ్యాంబోఫ్లవర్స్, విసనకర్రలు, వెదురుబుట్టలు.

**కొలతలు** :

**ధాన్యంకొలతలు :** పావుసేరు, అర్ధసేరు, కుంచం, గరిసె, తవ్వెడు, పుట్టి, బస్తా, మానెడు, మానేడి, సేరు, సోల.

**భూమి కొలతలు :** అరక, గుంటి, అడుగు.

**దారం, బట్ట కొలతలు :** గజం, జానెడు, నుడెతెడు, బార, బెత్తెడు, మూర,

**నీళ్ళలోతు కొలతలు :** చెయ్యెత్తులోతు, నిలివెడులోతు, పీకల్లోతు, మొలబంటిలోతు, మొలలోతు, మోకాల్లోతు, సంకలోతు,

**అగణ్యాలు** : అడ్డెడు, గురివెడు, గుల్లెడు, చట్టెడు, డొక్కెడు, తెడ్డెడు, తొట్టెడు, దిప్పెడు, బుక్కెడు, బుట్టెడు, సేరెడు.

**తూనికలు :** ఆరుతక్కెడ్లు, వీసెడు.

**దూరం కొలతలు** : కోసు, బారెడు.

**సమయపదాలు :** కొండరెడ్ల క్యాలెండర్లు, గడియారాలు తెలియని సమాజంలో పొద్దును, కాలాలను తెలుపడానికి ప్రకృతే ఆధారం. ప్రకృతిలో వాన కురిసిన కాలంఅని, ఎండాకాలమని, చలివేస్తున్న కాలమని, ఆకురాలు కాలమని ఇలా ప్రకృతితో కాలాన్నిముడిపెట్టి చూస్తున్నారు. రోజువారి పొద్దును తెలపడానికి చుక్కలు పొడిచే కాలమని, పళ్లుతోమే కాలమని, అంబలి తాగేకాలమని ఇలా రోజు పొద్దులను తెలపడం నేటికి కొండరెడ్ల అలవాటు.

**వేటవస్తువులు** : ఈటెలు, చేవులంబు, మిద్దెంబు, రెండోమిద్దెంబు, వింటిబద్ద, శోబంబు.

**బట్టల్లో రకాలు :**

**చీరలు :** ఈతవన్నెచీర, కరకవన్నెచీర, గళ్ళకోక, గాగవన్నెచీర, తగరువన్నెచీర, తెల్లకోక, నిలువుకోక, పచ్చకోక, మొగ్గలచీర, వెల్లకోక.

**రైకలు** : ఎర్రరైక, పచ్చరైక, సెనగపువ్వులరైక.

**పంచెలు** : ఎర్రపంచెదోవతులు, పొట్టిపంచెదోవతులు.

**తలగుడ్డలు** : చీరతలగుడ్డ, పంచెతలగుడ్డ.

**కల్లుపదాలు** : ఈతకల్లు, ఎడకల్లు, ఒగ్గుకల్లు, చల్దికల్లు, చిగురుకల్లు, జీలుగుకల్లు, తాటికల్లు, దిబ్బకల్లు, దుమ్ముకల్లు, నాముకల్లు, పండుకల్లు, పులిపేళకల్లు, పోతుకల్లు, మట్టకల్లు.

**సారాయిపదాలు** : ఇప్పసారా, కల్లుసారా, చింతపండుసారా, పండ్లసారా, బెల్లంసారా.

**కల్లుతీసే వస్తువులు** : కల్లుగొట్టాలు, కల్లుడోకు, కల్లుదిప్ప, కల్లుపటక, కల్లుబల్ల, కల్లుముంత.

**ధ్వన్యనుకరణ పదాలు** : అతుకులుబొతుకులు, కొక్కరకో, గబగబా, చితుకుచితుకు, జల్లుజల్లు, పిన్నపెద్ద, సితుకులు బొతుకులు, సెల్లసెల్ల. తిరిగెండ్లు మరిగెండ్లు,

**పదబంధాలు** :

అందరప్రదేశ్, అనపప్పు, అన్నంగిన్నెలు, అన్నదమ్ములు, అన్యమతము, అమ్మానాన్నలు, అరటిచెట్టు, అర్ధసేరు, అర్మంకర్మం, అల్లరిబోకు, అస్రకుంచం, అస్రకూడు, ఆకులకట్ట, ఆకుమడి, ఆటపాట, ఆదివాసీ, ఆరుద్రకార్తె, ఆవునూనె, ఇప్పసారా, ఇల్లుబంతి, ఈకలతు౦టి, ఉంగంకొట్టడం, ఉండేవాళ్ళు, ఉపవాసం, ఉలవపప్పు, ఉల్లిపాయలు, ఉసికత్తి, ఊటనీరు, ఊరబెత్త౦, ఊరిపెద్ద, ఎండుసేల, ఎండ్రికనీళ్ళు, ఎక్కబెట్టు, ఎడకల్లు, ఎడగీత, ఎడవరులు, ఎర్రగొండ, ఎర్రమన్ను, ఏడుమెట్టలు, ఓరపుకుండ, ఓలకత్తి, ఓలికపూడు, కంచునగరి, కంటిదోకి, కట్టకల్లు, కన్నతల్లి, కన్నత్త, కన్నెజిలుగు, కమ్మరిబాబు, కర్రపోగు, కల్లుసారా, కాకమడుగు, కాకిబావ, కారుకోడి, కాలిగోళ్ళు, కావడినీళ్ళు, కావురాళ్ళబండ, కాళ్ళసందు, కిరసనాయిలు, కీడుపాక, కుండదూర౦, కులకంకులు, కూరగిన్నెలు, కూరగాయలు, కొంగుడబ్బు, కొండనీళ్ళు, కొండపోడు, కొక్కిపాక, కొక్కిపిల్ల, కొబ్బరిచెట్టు, కొమరబల్ల, కొమ్మజోడు, కోరివిదెయ్యం, కోడిపిల్ల, కోతిడోళ్ళు, కోళ్ళదొర్రి, గడ్డికొరప, గబ్బిలాలగోండి, గాలిదూళి, గాలిదేవుడు, గిల్లకాయ, గుంపెనలాట, గురముద్ద, గుర్రంకొమ్ములు, గూ౦బుట్ట, గూడగంప, గూనబెబ్బులి, గొద్దలికూర, గోనెపొట్లం, గొట్టకాయలు, గోనేటేడ్లు, చందమామ, చన్నీళ్ళకుండ, చన్నీళ్ళపళ్ళెం, చాపచుట్టు, చింత పులుసు, చిక్కువిల్లు, చిగురుకల్లు, చిన్నకత్తి, చిన్నకాపు, చిన్నచేను, చిప్పర్కోడి, చిర్కుపిట్ట, చీకటితప్పు, చీపురకట్ట, చుక్కబొట్టు, చుట్టుముట్టు, చెంపదెబ్బ, చెక్కలకట్ట, చెట్టుతొర్ర,, చేయికాలు,

చోడిరొట్టెలు, జాజుపిట్టలు, జిలుగుచెట్టు, జీడిమామిడి, జొన్నకంకు, జొన్నబడ్డి, జౌరజ్ఞానం, టేంకంబలి, టేంకోత, టేంగిగొడ్డలి, డప్పునగరి, డొప్పసేనలు, తలకట్టుచీర, తలనేస్తం, తల్లికోళ్ళు, తల్లులాట, తిప్పతీగ,తిరిగెండ్లు మరిగెండ్లు, తీన్రాయి, తూంకాకు, తేనేబల్ల, తోటకూర, దుక్కివర్షం, దున్నపోతు, దుమ్ముకల్లు, దువ్వరిల్లు, దూలికూడు, దేశవిడి, నగరిబస, నల్లగాజు, నల్లమందు, నాటుకోడి, నాటుమందు, నాముకల్లు, నీళ్ళసామాన్లు, నులకమంచం, నూనెపాకెట్టు, నెమిలిపిట్ట, నేతకట్టు, నేదుకొయ్య, పండుకల్లు, పండునేల, పందిపిల్ల, పందిమాంసం, పచ్చపండుగ, పచ్చిబద్దలు, పట్టపుల్ల, పట్టిబల్ల, పట్టుడుదొంగ, పదిరూపాయలు, పప్పన్నం, పమిడిపిక్క, పలకజీడి, పలుగర్ర, పసుపునీళ్ళు, పాదుకోడి, పాపికొండలు, పాలదోకి, పాలవర్షం, పాలవిందు, పింజరికట్ట, పిండాకూడు, పిండిపిడత, పిండిపెండేపుకల్లు, పిట్టసొరి, పిన్నత్త, పీనుగరుగు, పులివేళ, పూలవన్నె, పెండ్లికొడుకు, పెండ్లిపెద్ద, పెద్దకాపు, పెద్దవిడి, పెద్దకొండ, పెద్దపాత్ర, పెద్దసేను, పెళ్ళికొడుకు, పేడపురుగు, పొగచుట్ట, పొట్టసరువు, పొతబూరం, పోతుకల్లు, పోదరిబండ, పోలకట్ట, బండలపులి, బడ్డిపండుగ, బర్రకాయ, బారికవోడు, బావామరదులు, బాలబడి, బాలబాస, బుచ్చిపిట్ట, బురిడెతీగ, బుర్రడిప్ప, బొక్కదీపం, బొద్దుకూర, బొబ్బెకత్తి, బోడగువ్వలు, బోలుగుచెట్టు, బెల్లంసారా, బ్యాంబోప్లవర్స్, భింపిట్టలు, భూమిపండుగ, మంచిచెడు, మత్తుమందు, మలకరికల్లు, ముచ్చాలబొక్క, ముదారుగొడ్డు, ములుగర్ర, మూడనమ్మకాలు, మైలుపుంజు, మొక్కజొన్న, లేగదూడ, వందరూపాయలు, వడిబాలు, వడిమూట, వరసకల్లు, వియ్యాలవారు, విల్లంబులు, విసనకర్ర, విస్తరాకు, వెండిరూక, వెదురుకొమ్ములు,

పెదురుబొడిపె, పెదురుబొంగులు, పేషగాళ్ళు, శుభలేఖలు, సుక్కదిప్ప, సెంటుమల్లె, సెలగలపాఠం, నొరకాయ మొదలైనవి.

అర్థక్షేత్రాలలోని పదాలే కాక తక్కిన పదాలు కూడా అనేకం ఉన్నాయి వాటిని భాష అనే అధ్యాయంలో నామవిజ్ఞానంలో ఉదాహరించిన రూపాలలోనూ, క్రియావిజ్ఞానంలో ఉదాహరించిన రూపాలలోనూ చూపడం జరిగింది. పదబంధాలు అనేకం సేకరణలో లభ్యమయ్యాయి. వీటిలో చాలా వరకు నామబంధాలు ఉండడం విశేషం.



1.అడవులు




2.పోడువ్యవసాయం



3.చేనుపాక



4.గ్రామం,వ్యవసాయభూమి



5.పశుసంపద



6.కొండరెడ్లు పశువుల పాలు తీసే కాళ్ళ బంధం



**7.**నీళ్ళు మోస్తున్న మహిళలు



8.నీళ్ళ దిప్ప



9.గోదావరిలో వంటపాత్రలుకడుగుతున్న మహిళలు



10.కావడినీళ్ళతో కొండరెడ్లు



11.గోదావరిలో స్నానం చేస్తున్న మహిళలు



12.కొండపై ప్రాంతంలో స్నానపు గదులు



13.విల్లంబులు,కత్తులు కలిగివున్న కొండరెడ్లు



14.అంభుఎక్కుపెట్టిన కొండరెడ్డి



15.సంతలో కొండరెడ్లు



16.చేటలు,బుట్టలు అమ్ముతున్న కొండరెడ్లు



17.సంతలోకొన్న వస్తువులతో కొండెక్కుతున్న కొండరెడ్లు



18.సంతల దారిలో కొండరెడ్లు



19.కల్లు కొలత పాత్రలు



20.వెదురు కల్లుగొట్టాలు





21జిలుగుచెట్టుపై కల్లు పాత్ర.

22.తాటిచెట్టుపై కల్లుగొట్టాలు





23.కొండరెడ్ల తాటాకు ఇల్లు

24.కొండరెడ్ల రెల్లుగడ్డి ఇల్లు



25.కొండరెడ్ల కీడుపాక



26.నిర్మాణంలోవున్నా కొండరెడ్ల ఇల్లు



27.అలంకరించిన కొండరెడ్ల ఇల్లు



28.ఇంటి ముందుభాగంలో కోళ్ళ పాకలు



29.కొండరెడ్ల వంటగది



30.ఇంట్లో బడ్డిపై భద్రపరిచిన వస్తువులు



31.వంటపాత్రలు



32.వంటచెరకు



33.కొండరెడ్ల వీది



34.వెదురు వస్తువులు



35.పూలచెట్లు పెంచుతున్న కొండరెడ్లు



36.ఇంటి ఆవరణలో పండ్ల చెట్లు



37.కొండరెడ్ల దేవత



38.నైవేద్యం



39.పందిని బలిస్తున్న కొండరెడ్లు



40.మాంసం పంపకాలు



41.పూజర మొక్కు



42.వనానికి వస్తున్న కొండరెడ్ల మహిళలు



43.కొండరెడ్ల పిల్లల బంతీ



44.ఆహార పంపకాలు



45.పండుగ అనంతరం తిరిగి ఇంటికి వెళ్తున్న మహిళలు



46.కల్లు తాగుతున్న కొండరెడ్డి



47.పెళ్ళికూతురు



48.కొండరెడ్ల పెళ్లితంతు



49.గోచితో ఉన్న కొండరెడ్డి



50.తలపాగా ధరించిన కొండరెడ్డి



51.ఆభరణాలు ధరించిన కొండరెడ్ల మహిళ



52.ఆభరణాలు ధరించిన కొండరెడ్ల మహిళలు





53.చేపల వేటకు వెళ్తున్న కొండరెడ్డి

54.చేపలు





55.మహిళల నృత్యం

56.డొల్లు వాయిస్తున్న కొండరెడ్లు



57.గచ్చకాయలతో మహిళల నృత్యం



58.కొండరెడ్ల వినోదాలు



59.పొగాకు భద్రపరిచిన కొండరెడ్లు



60.చుట్ట కాలుస్తున్న కొండరెడ్డి

**కొండరెడ్ల పేర్లు – గ్రామం – మండలం**

సంజీవరెడ్డి చెదల – చింతగండి – కూనవరం

భీంరెడ్డివల్లాల

రాంరెడ్డి వల్లాల

పోషమ్మ వల్లాల

సుబ్బిరెడ్డి చెదల – తోటమామిడిగొంది

భీంరెడ్డి సుంట్రు

కొమ్మారెడ్డి కొండ్ల – టేకులోద్ది

లక్ష్మారెడ్డి కొండ్ల

బుచ్చిరెడ్డి కేచ్చల

తమ్మిరెడ్డి కేచ్చల - కొప్పిరిమెట్ట

భీంరెడ్డి కొండ్ల

బాపయ్య - కార్మెన్ కొండ

లక్ష్మారెడ్డి

దీపిక కేచ్చల – గబ్బిలాలగొంది

సేల్లమ్మ కొండ్ల – పాతకార్మెన్ కొండ

చారపురెడ్డి కొండ్ల

కన్నపురెడ్డి కేచ్చల

గంగమ్మ కేచ్చల

శ్రీనివాసరెడ్డిముర్ల – టేకుపల్లి – వేలేరుపాడు

వెంకటరెడ్డి ముర్ల

కమలపిట్ల

సునిత పోగల

ఎర్రంరెడ్డి గురుగుంట్ల

గంగిరెడ్డి గురుగుంట్ల

చిన వెంకటరెడ్డిముర్ల

భాస్కర్ రెడ్డిముర్ల

ప్రభాకర్ రెడ్డిసోకుల

కన్నేంరెడ్డి వెన్నెల

మాధవరెడ్డి సోకుల

పార్వతి ముర్ల

రమేష్ రెడ్డిపిట్ల

మునెమ్మ పిట్ల

జెజమ్మ ముర్ల

అల్లిరాణిగురుగుంట్ల

దామోదర్ రెడ్డి కధల – కోయిదా

లక్ష్మణ్ రెడ్డి కొండ్ల

కాశిరెడ్డి కోపాల

కనకరెడ్డి సుంట్రు

దేవిరెడ్డి సుంట్రు

చిన్నారెడ్డి కేచ్చల

భూపతిరెడ్డి వల్ల

ధర్మరాజు రెడ్డి పోగల – రేపాకగొమ్ము

రామిరెడ్డి

మంగిరెడ్డి

పుష్పలత వెట్ల

స్వరూప
లక్ష్మి పోగల
ఓబుల్ రెడ్డి – కాకిఇసునూరు
శ్రీనివాస్ రెడ్డి
మంగిరెడ్డి ముర్ల – పేరంటపల్లి
అక్కమ్మ ముర్ల
సుక్కారెడ్డి పిట్ల
తమ్మిరెడ్డి ముర్ల
శివశంకర్రెడ్డి ముర్ల
బాబురెడ్డి గురుగుంట్ల
కృష్ణారెడ్డి – గాండ్లగూడెం – అశ్వరావుపేట
మోహన్ రెడ్డి – గాండ్లగూడెం
ముచ్చాలురెడ్డి – బండారుగూడెం
బాలరెడ్డి అందెల
లచ్చిరెడ్డి చెదల – చెదలవాడ – చింతూర్
కన్నపురెడ్డి చింతల – బాయిబొక్క
గీతపల్లాల
వీరమ్మవల్ల
రాంరెడ్డి చెదల – చెదలవాడ
సేల్లమ్మ చెదల – కల్లేరుమిద్ది
కన్నయ్యరెడ్డి నడుపు
పరిమిరెడ్డి గొల్ల – తుమ్మిలేరు – వరరామచంద్రపురం
పోయారెడ్డి సుంట్రు

సుగ్గిరెడ్డి కొండ్ల

రాజిరెడ్డి కొండ్ల

కోగిరెడ్డి పెట్ల

సత్యనారాయణ రెడ్డి గొల్ల

రామిరెడ్డి కదల

గోపిరెడ్డి కోపాల – చిన్నమట్టేపల్లి

గంగారాజురెడ్డి కోపాల

సాంభశివరెడ్డి వల్ల

భాస్కర్ రెడ్డి పెట్ల

నవీన్ కుమార్ రెడ్డి పెట్ల – రాజుపేట

మురళిరెడ్డిపెట్ల

ఆదిరెడ్డి

లచ్చిరెడ్డి సుంట్రు - జీడిగుప్పా

రామచంద్రారెడ్డి

కనకరెడ్డి

రాంరెడ్డిముర్ల

గోపిరెడ్డి విద్దె – కొల్లూరు

బుచ్చిరెడ్డి విద్దె

దుర్గారెడ్డి పెన్నెల

మురళీరెడ్డి పెన్నెల

శ్రీనివాసరెడ్డి పెట్ల

విశ్వనాద్ రెడ్డి పెట్ల

చంద్రారెడ్డి సూరా – కొటారుగోమ్ము

మాధవరెడ్డి ముర్ల

సున్నంరెడ్డి ముర్ల

లచ్చమ్మ ముర్ల

కోటేశ్వరరెడ్డి వాల్ల – పోచవరం

సీతారాంరెడ్డివాల్ల

పోషమ్మవాల్ల

బుల్లెమ్మవాల్ల

మంగమ్మవాల్ల - ముత్యాలమ్మగండి

రమాదేవివాల్ల

మునెమ్మ అందెల - ఇప్పూరు

అబ్బాయిరెడ్డి అందెల

జోగుపవిత్ర వాల్ల

సావిత్రమ్మ వాల్ల

నాగమణి విద్దె – మారేడుపూడి

పద్మవిద్దె

కన్నేంరెడ్డి పిట్ల - అంకంపాలెం – దమ్మపేట

నవనీత పెట్ల

నర్సమ్మ పెట్ల

సుశీల ముర్ల

సురపురెడ్డి చింతల - కొత్తమాములవారిగూడెం

దుర్గమ్మ గురుగుంట్ల

శాంభవిపోగల

కన్నపురెడ్డి చింతల

సారపురెడ్డి కథల - కవాడిగుండ్ల –          అశ్వారావుపేట

గంగమ్మ వాళ్ల

సంజన కథల

మీనాక్షి ముర్ల - గోగులపూడి

కనకరెడ్డి పెట్ల

వాల్ల గౌరమ్మ

విద్యాదుర్గ

నరసింహారెడ్డి

ప్రసాదరెడ్డి

వరలక్ష్మి

# ఉపయుక్తగ్రంథ సూచి


**అనంత్,.** 2000 : మనుగడకోసం పోరాటం (ఆంధ్రప్రదేశ్ ఆదివాసులు)అనువాదం, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.

**అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి** 1991 : సంస్కృతి విన్యాసం, తెలుగు అకాడమీ, హైదరాబాదు.

**కృష్ణమూర్తి భద్రిరాజు**.,2010 : తెలుగు భాషా చరిత్ర, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్.

**చినవెంకటేశ్వర్లు భూక్యా**., 2002 : ఆదివాసులజీవనం, పూజా పబ్లికేషన్స్, గుంటూరు.

**చినవేంకటేశ్వర్లు భూక్యా.,** 2004 : స్వతంత్రభారతంలోఆదివాసితెగలు : పూజాపబ్లికేషన్స్, గుంటూరు.

**జగన్నాథ శర్మ కడియాల.,** 1989 : సమాజ శాస్త్ర పరిచయం, తెలుగు అకాడమీ, హైదరాబాదు.

**నర్సింహా రెడ్డి., పి.,** 1983 : తెలుగు సామెతల్లో జనజీవనం, శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, తిరుపతి.

**పద్మబాల, ఎ.,** 1991 : అడ్డతీగల మండలం గిరిజన గేయాలు-సామాజిక పరిశీలన, పద్మబాల పబ్లికేషన్స్, రాజమండ్రి.

**ప్రేమలత .వి.** 1988 : జానపద విజ్ఞాన పరిశీలనం , తిలక్ నగర్, హైదరాబాదు.

**ప్రతాప్ ఆర్.,** : ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జాతులు, ఆదివాసీ సాంస్కృతిక పరిశోధన సంస్థ, హైదరాబాద్.

**ప్రభావతి డక్క.,** 2008 : ప్రళయకావేరి కథలు – నెల్లూరు జిల్లా మాండలికం, ఎమ్.ఫిల్. సిద్ధాంతగ్రంథం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**బాలస్వామి బుక్కా.,** :మహబూబ్ నగర్ జిల్లా జానపద కథలు, తెలుగు పరిశోధన ప్రచురణ, హైదరాబాదు.

**మునిరెడ్డి పి.ఎం,.**1998 : తూర్పుగోదావరి జిల్లా కొండరెడ్ల గిరిజన ఆచార వ్యవహారాలు(అముద్రితం), బెంగుళూరు విశ్వవిద్యాలయం.

**మొహన్. జి.ఎస్**. 1981 : జానపద విజ్ఞాన వ్యాసావళి, శ్రీనివాస పబ్లికేషన్స్, కళ్యాణ దుర్గం.

**రంగారెడ్డి కెచ్చల.,** సెప్టెంబర్, 2004: అభివృద్ధికి దూరంగా ఆంధ్రప్రదేశ్ గిరిజనులు: సిపిఐ (ఎం,ఎల్,న్యూడెమోక్రసీ)ఖమ్మం.

**రమేష్ భట్టు(సం).,** 2010 : కొండరెడ్డి గిరిజనుల జీవన విధానం (బొడ్లంక)-జా.గి.వి. పీఠం పొ.శ్రీ.తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్లు.

**రాధాకృష్ణమూర్తి మిక్కిలినేని.,** 2011 : తెలుగు వారి జానపద కళారూపాలు:తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ : హైదరాబాద్.

**రామరాజు బి.,** 1990 : జానపద మౌఖిక సాహిత్యం: జానపద విజ్ఞాన ప్రచురణ: హైదరాబాద్.

**లక్ష్మీనారాయణశర్మ.కే.,** 2012 : తెలుగు మండలికాలు ఖమ్మం జిల్లా - తెలుగు అకాడమి హైదరాబాద్.

**విజయలక్ష్మి,డి.,** 1999 : తెలుగు తమిళ లాలి పాటలు - భాషా సామాజిక పరిశీలన. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

**విద్యాసాగర్, ఎ.,** 2004 : భద్రాచలం మన్నెం కథలు, ఎమెస్కోబుక్ హౌస్, విజయవాడ.

**వెంకటరావు పొన్నాడ. సుబ్బారెడ్డి ఎస్(సం).,** 2002 : ఆంధ్రప్రదేశ్ లో గిరిజన సమస్యలు – సంక్షేమం, తెలుగుఅకాడమి, హైదరాబాదు.

**వెంకట రెడ్డి కసిరెడ్డి.,** 1994 : జానపద సాహిత్యం –అధ్యయనం అనుశీలనం, జాతీయ సాహిత్య పరిషత్.

**శంకరయ్య జనపాల.,** : లంబాడిల గేయసాహిత్యం, నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.

**శాస్త్రి.వి.యస్.వి.కె.,** 2005 : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి, పరివర్తన, గిరిజన సాంస్కృతిక పరిశోధన,శిక్షణ సంస్థ, హైదరాబాద్.

**శివరామకృష్ణ పిరాట్ల.,** జులై 2007 : కొండకోనల్లో తెలుగు గిరిజనులు, శక్తి ప్రచురణ: హైదరాబాద్.

**శివరామకృష్ణ పిరాట్ల,.** 1991 : తెలుగు గిరిజన గీతాలు, శక్తి ప్రచురణ: తూర్పు గోదావరి జిల్లా.

**సత్యనారాయణ కంభంపాటి.,** 1981 : ఆంధ్రుల సంస్కృతి చరిత్ర -1, హైదరాబాద్ బుక్ హౌస్, హైదరాబాద్.

**సుందరం ఆర్వి యస్.,** 1983 : ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్.

**సుందరరామయ్య .,** 1989 : భారతీయ వారసత్వం సంస్కృతీ, తెలుగు అకాడమి, హైదరాబాద్.

**సుబ్రహ్మణ్యం పి ఎస్,** 1984 : ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు

**సుబ్రహ్మణ్యం పి ఎస్,** 2006 : ద్రావిడ భాషలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

**సుబ్రహ్మణ్యం పిరాట్ల,** 1992 : మారేడుమిల్లి మండలం గిరిజన గేయాలు - సామాజిక పరిశీలన.

**సురవరం ప్రతాప రెడ్డి.,** 2007 : అంధ్రుల సాంఘిక చరిత్ర, ఓరియంటల్ లాంగ్మన్ పబ్లికేషన్స్, హైదరాబాదు.

**సూర్యధనుంజయ్.,** 2009 : నల్లగొండ జిల్లా బంజార సాహిత్యం జీవన చిత్రణ, శీతల్ పబ్లికేషన్స్, హైదరాబాద్.

**సూర్యనారాయణ,ఎమ్.,**(కూర్పు) రంగారావు,కె., 2005 : భారతదేశ గిరిజన సముదాయాలు, తెలుగుఅకాడమి, హైదరాబాద్.

**హస్నైన్, నదిం.,** 1995: భారతీయ గిరిజనులు: ఓరియంట్ లాజ్మన్, హైదరాబాద్.

**Anilkumar,k.,** 2006 : Local Environmental Knowledge and Natural Resource Management among the kondareddi of Andhrapradesh. University of Hyderabad.

**Furer-Haimendorf, Christoph**, 1945 : The Reddis of the BisonHills, Macmilan&Co,Ltd,London.

**Jagadish Ayer.P.P.,** 1982: South Indian custums, Asian education services, New Delhi.

**పత్రికలు – వ్యాసాలు**

**కుమారస్వామి, జి.,** 1992 : భారతదేశ చరిత్రలో గిరిజనులు, తెలుగువైజ్ఞానిక మాస పత్రిక.

**తోమాసయ్య, కర్నాటి.,** మార్చి, 1989 : కొండరెడ్డి తెలుగు మాండలికం - కొన్ని ప్రత్యేకతలు.

**నాగరాజు కుప్పాల.,** సెప్టెంబర్ 22, 2008 : స్వేచ్ఛా వాయువులు పీల్చే గిరిపుత్రులు, కొండరెడ్లు, ఆంధ్రప్రభ దినపత్రిక, భద్రాచలం.

**శివరామకృష్ణ పిరాట్ల.,** ఏప్రిల్,1978 : గిరిజన భాషా మాండలికం-1: భారతి.

**శివరామకృష్ణ పిరాట్ల.,** ఏప్రిల్,1979 : గిరిజన భాషా మాండలికం-2: భారతి.

**గిరిజన సాంస్కృతిక పరిశోధన-శిక్షణ సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ముద్రించబడిన గిరిజన సంస్కృతి పత్రికలన్నింటిని పరిశీలించి విషయ సేకరణకు వినియోగించడమైంది.**

**ఆంధ్ర జ్యోతి (దినపత్రిక)** 31-5-2014 'కొండంత ...ముంపు' పేజి నెం. 8

**ఆంధ్ర జ్యోతి (దినపత్రిక)** 1-6 -2014 'తుపాకీ కొసనుంచి ముంపుకొనకు ....' పేజి నెం. 8

**Kamal K.Misra,** 1998 ; Trees in the Religion and Folklore of the Konda Reddy of South india.

**Sunita Reddy,** 2004 ; Ecosystems Approach to Human Health : A Case of Konda Reddi Tribes and Women's Health.

‘